# ఆర్గాన్ న్యూస్
VOICE OF DEMOCRACY
తెలుగు దినపత్రిక

సంపుటి :17 సంచిక :113 ఖమ్మం, తెలంగాణ ఆదివారం 11.05.2025 పేజీలు :12, వెల : 2/-

Circulating to : Hyderabad, Khammam, Warangal, Nalgonda, Karimnagar, Adilabad, Medak and Mahabubnagar



## విలేకరులు కావలెను

ప్రజా సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి "ఆర్గాన్ న్యూస్" ఛానల్, దినపత్రిక ఆహ్వానం పలుకుతోంది. పని చేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని అన్ని నియోజకవర్గాల నుంచి రిపోర్టర్లు కావలెను.

పూర్తి వివరాలకు సంప్రదించండి

98481 56178














# దెబ్బకు దిమ్మతిరిగిన పాక్

## నడ్డివిరిగి నిలబడలేని దుస్థితి

- ఉగ్రదాడిని యుద్ధ చర్యగానే పరిగణిస్తామని భారత్ హెచ్చరిక
- భారత్ హెచ్చరికలతో బెంబేలెత్తిన పాక్ పాలకులు
- కాల్పుల విరమణకు అమెరికాతో మధ్యవర్తిత్వం
- భారత్ దెబ్బకు పాక్ ఎయిర్ బేస్‌లన్నీ ధ్వంసం
- యుద్ధం చేయడానికి సత్తా..సత్తువ లేకుండా చేసిన భారత్
- చేసేది లేక కాళ్లబేరానికి వచ్చిన పాక్ పాలకులు
- పరిమిత దాడులతో సైనిక శక్తిని చాటిన భారత్
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విజ్ఞప్తిని అంగీకరించిన భారత్
- ఇరు దేశాలు కాల్పుల విరమణకు అంగీకారం

దెబ్బకు దిమ్మ తిరిగింది. నడ్డి విరిగి.. నడవలేని పరిస్థితుల్లో పాకిస్తాప్ కాళ్లబేరానికి వచ్చింది. నేరుగా భారత్ కాళ్లనే పట్టుకున్నా...కాదనడంతో అమెరికాను ఆశ్రయించింది. చైనా అద్యక్షుడు జిన్‌పింగ్‌తో చెప్పించింది.ఐదు రోజుల్లోనే పాక్ ఇక ముందుకు అడుగు వేయలేని దుస్థితికి చేరింది. భారత రక్షణ దళాల దెబ్బకు పాక్ కోలుకోలేని దెబ్బతింది. ఇక యుద్ధంకాదుకదా...భారత సైన్యం ముందు నిలబడలేని దుస్థితికి వచ్చింది. ఈ క్రమంలో యుద్ధం వద్దంటూ కాళ్లావేళ్లా పడింది. మరోవైపు ప్రతీ ఉగ్రదాడిని యుద్ధచర్యగానే పరిగణిస్తామని శనివారం భారత్ చేసిన ప్రటకనతో వణికిపోయింది. మరోవైపు బలూచీస్థాన్ స్వతంత్రం ప్రకటించకుంది. ఈ క్రమంలో భారత్‌తో తలపడలేని పరిస్థితిలో చేతులెత్తేసింది. ఇప్పటికే చేయాల్సిన నష్టం చేసిన భారత్ కూడా ...కాల్పుల విరమణకు సరేనంది. అయితే..షరతలు వర్తిస్తాయని తేల్చిచెప్పేసింది. ఈ క్రమంలో విదేశాంగ మంత్రి జై శంకర్ కాల్పుల విరమణ ప్రకటిస్తూ ట్వీట్ చేశారు.

**న్యూఢిల్లీ, మే 10 :** పహల్గామ్ ఊచకోత తరవాత.. పివోకెలో ఉగ్ర శిబిరాలపై దాడితో పాక్ దిమ్మతిరిగి మైండ్ బ్లాక్ అయ్యింది. తామేమీ తక్కువ తినలేదని బీరాలకు పోయి యుద్ధానికి కాలు దువ్వింది. గత బుధవారం భారత్ ఉగ్రశిబిరాలను ధ్వంసం చేయగానే ..పాక్ యుద్ధానికే దిగింది. దీంతో భారత్ తన దెబ్బ ఎలావుంటుందో రుచి చూపింది. ఈ దెబ్బకే దిమ్మతిరిగిన పాక్ చేతులెత్తేసింది. ఇప్పటికే అక్కడి ఎంపిలు పాక్‌ను దమ్మెత్తి పోశారు. యుద్ధం చేయలేమని హెచ్చరించారు. వినకుండా ఆర్మీ చీఫ్ మునీర్ ఒత్తిడితో కాలుదువ్వి.. కాళ్లు విరగొట్టుకుంది. మొత్తంగా గత కొన్ని రోజులుగా భారత్–పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతలకు తెరపడింది. కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించినట్లు భారత విదేశాంగశాఖ ప్రకటించింది. శనివారం సాయంత్రం 5గంటల నుంచి ఇవి అమల్లోకి వచ్చినట్లు తెలిపింది. అంతకుముందు ఇదే అంశంపై స్పందించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్– పాక్‌లు కాల్పుల విరమణకు అంగీకరించాయని, ఇందుకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని ప్రకటించారు. శనివారం సాయంత్రం భారత విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. మధ్యాహ్నం 3.35 గంటలకు ఇరుదేశాల డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ స్థాయిలో ఇరుదేశాల మధ్య చర్చలు జరిగాయి. పాకిస్థాన్ డీజీఎంఓ భారత డీజీఎంవోకు ఫోన్ చేశారు. కాల్పుల విరమణకు ఇరు దేశాల సైనికాధికారులు అంగీకరించారు. సాయంత్రం 5గంటల నుంచి ఇది అమల్లోకి వచ్చింది. భూ, గగన, సముద్రతలాల నుంచి ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతుంది. వీటికి సంబంధించి ఇరుదేశాల సైన్యానికి తగిన ఆదేశాలు వెళ్లాయి. ఈ నెల 12న సాయంత్రం డీజీఎంవోలు మళ్లీ చర్చలు జరుపుతారని విదేశాంగ మంత్రి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. ఇరు దేశాల మధ్య కుదిరిన కాల్పుల విరమణపై విదేశాంగశాఖ మంత్రి ఎస్ జైశంకర్ ఎక్స్ వేదికగా స్పందించారు. కాల్పుల విరమణ, సైనిక చర్యలను నిలిపివేయడంపై భారత్, పాక్ ఈ రోజు ఓ అవగాహనకు వచ్చాయన్నారు. ఉగ్రవాదం విషయంలో మాత్రం భారత్ తన రాజీలేని వైఖరిని కొనసాగి స్తుందని పేర్కొన్నారు.

మిగతా 2 లో



03

## ఆపరేషన్ కగార్‌కు సిందూర్ ఎఫెక్ట్

- తాత్కాలికంగా నిలిచిపోయిన మావోల ఏరివేత
- కర్రెగుట్టల నుంచి బలగాలు వెనక్కి
- సరిహద్దులో వెళ్లేందుకు ఆదేశాలు



## పాక్ అరాచకాలకు గట్టిగా సమాధానం చెబుతున్న మోడీ

03

- బహీర్ బాగ్ కనకదుర్గమ్మ ఆలయంలో కిషన్ రెడ్డి పూజలు

## అట్టహాసంగా మిస్ వరల్డ్ పోటీలు

- జయజయహే రాష్ట్ర గీతాలాపనతో ప్రారంభం
- 250 మంది కళాకారులతో పేరిణి నృత్య ప్రదర్శన
- ప్రపంచవ్యాప్తంగా 110 దేశాల నుంచి హాజరు
- వేడుకలను ప్రారంభించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- తెలంగాణ సాంస్కృతిక వైభవం కళ్లకు కట్టేలా ప్రదర్శనలు






**హైదరాబాద్, మే 10 :** అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న ప్రపంచ సుందరి పోటీలు శనివారం సాయంత్రం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం మిస్ వరల్డ్ 72వ పోటీల ఆరంభ వేడుకలకు వేదికైంది. తెలుగు రాష్ట్రాల చరిత్రలో ఈ పోటీలు నిర్వహించడం ఇదే ప్రప్రథమం. వేడుకలను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. 'హైదరాబాద్‌కు స్వాగతం, సుస్వాగతం' అంటూ నిర్వాహకులు అచ్చ తెలుగులో పలకరించారు. రామాచారి శిష్య బృందంలోని 50 మంది గాయనీగాయకు లు అందెశ్రీ రచించిన రాష్ట్ర గేయం "జయజయహే తెలంగాణ జననీ జయకేత నం" ఆలపించారు. ప్రారంభ వేడుక తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల మేళవింపుగా సాగింది. ప్రపంచదేశాలకు మన కళల్ని అద్భుతంగా పరిచయం చేసింది. తెలంగాణ జానపద నృత్యాలతో నాలుగు ఖండాలకు చెందిన పోటీదారులను పరిచయం

మిగతా 2 లో

## కాల్పుల విరమణ ఉల్లంఘనలో పాక్ రికార్డు

- ఏనాడూ ఒప్పందాలను పట్టించుకోని దాయాది
- ఉగ్రమూకలను ఉసిగొల్పుతూ.. దాడులకు పాల్పడే నైజం
- తాజా కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటుందా అన్నదీ అనుమానమే



పాక్ ఎప్పుడూ నమ్మదగిన శతృవు కాదు. నిరంతరంగా పక్కలో బల్లెంలానే వ్యవహరించింది. అనేక యుద్ధాల్లో ఓడినా దానికి బుద్ధి రాలేదు. ఎప్పుడూ కయ్యానికి కాలు దువ్వడం అలవాటు చేసుకుంది. ఉగ్రవాదులను పెంచి పోషించి, భారత్‌లో మారణహోమం సృష్టించడం ఆనవాయితీగా పెట్టుకుంది. అయితే పహల్గామ్ ఊచకోత తరవాత భారత్ గట్టిగా సమాధానం ఇవ్వడంతో దెబ్బకు దయ్యం వదిలింది. అయితే ఉగ్రమూకలను పోషించకుండా పాక్ ఉంటుందా..అక్కడి సైన్యం ఉండనిస్తుందా అన్నదే సమస్య.

# దెబ్బకు దిమ్మతిరిగిన పాక్

(మొదటిపేజీ తరువాయి)

పహల్గాం ఉగ్రదాడితో కయ్యానికి కాలుదువ్విన పాకిస్తాన్ ఇప్పుడు భారత్ కన్నెర్ర చేయడంతో దిగ్గుతోచని పరిస్థితుల్లో పడింది. ఓవైపు ఆర్థిక వ్యవస్థ కుదేలయ్యిందంటూ ప్రపంచ దేశాల ముంగిట రుణాల కోసం వెంపర్లాడుతూ, ఉద్రిక్తతలు తగ్గించేందుకు ముందుగా భారత్ చొరవ తీసుకోవా లంటూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోంది. మ-రోవైపు, సొంత పౌరుల ప్రాణాలు బలపెట్టేందుకు నిస్సిగ్గుగా సిద్ధమవుతోంది. పాకిస్తాన్ దాడుల విషయంలో కేవలం ప్రతిసారీ మౌనంతో సాధ్యపడదని భారత్ ఇటీవల దాడులతో నిరూపించింది. ఈ క్రమంలోనే భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరుకున్నాయి. భారత్, తన శక్తిని మౌనంగా చూపించకుండా, స్పష్టంగా వ్యూహాత్మకంగా పాకిస్తాన్ దురుద్దేశాలకు గట్టి కౌంటర్ ఇచ్చింది. ఈ ప్రతిస్పందనతో పాక్ చివరికి వెనక్కి తగ్గింది. అమెరికా మధ్యవర్తిత్వంతో, కాల్పుల విరమణ ఒప్పందానికి భారత్ అంగీకరించింది. ఈ నేపథ్యంలో శనివారం సాయంత్రం ఈ పరిస్థితులకు ముగింపు లభించింది. అయితే శాంతి అంటే బలహీనత మాత్రమే కాదు. అది సమర్థత, స్థిరత్వం, దేశ ప్రజల పట్ల నిబద్ధత గురించి ఆలోచించి తీసుకున్న నిర్ణయమని చెప్పవచ్చు. ఈ పరిణామం శాంతిని నిలుపు కోవడంతోపాటు సైనిక శక్తి ఎలా ఉపయోగిస్తుందో భారత్ మరోసారి పాకిస్తాన్ సహా అనేక దేశాలకు చూపించింది. ఈ క్రమంలో ఇరు దేశాల ప్రజల ప్రాణాల గురించి ఆలోచించిన భారత్ చివరకు శాంతి విధానానికి సమ్మతించింది. భారత్‌పై ఇటీవల పలు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఆ దేశ రక్షణ శాఖ మంత్రి ఖవాజా ఆసిఫ్ తాజాగా మరోసారి తన నీచ బుద్ధిని, చేతకానితనాన్ని చాటుకున్నారు. ఇందుకు నిస్సిగ్గుగా పార్లమెంటును వేదికగా చేసుకున్నారు. అత్యవసర పరిస్థితులు తలెత్తితే మదర్సాలలో చదువుకునే విద్యార్థులను రెండవ రక్షణ కవచంగా ఉపయోగిస్తామని ఖవాజా ఆసిఫ్ పార్లమెంటులో ప్రకటించారు. అయితే భారతదేశం ప్రతీకార చర్యతో పాకిస్థాన్ పూర్తిగా భయపడింది. మధ్యవర్తిత్వం కోసం అమెరికాను ఆశ్రయించింది. అమెరికా భారత్– పాక్ మధ్య మధ్యవర్తిత్వం వహించింది. పాకిస్థాన్ కాల్పుల విరమణకు అంగీకరించింది. భారత్–పాకిస్తాన్ యుద్ధంపై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు.. కాల్పుల విరమణకు భారత్–పాక్ అంగీకరించాయి.. భారత్–పాకిస్థాన్ మధ్య మధ్యవర్తిత్వం వహించాం.. రాత్రంతా భారత్–పాకిస్థాన్‌లతో చర్చలు జరిగాయి.. రెండు దేశాలకు నా అభినందనలు.. తక్షణమే కాల్పుల విరమణకు ఇరు దేశాలు అంగీకరించాయని ట్రంప్ పేర్కొన్నారు. అయితే పాక్ గతచరిత్ర చూస్తే ఏనాడు కాల్పుల విరమణను పాటించలేదు. ఇప్పుడు ఎలా అంగీకరిస్తారన్నది చూడాలి.



## అట్టహాసంగా మిస్ వరల్డ్ పోటీలు

(మొదటిపేజీ తరువాయి)

చేయడం వీక్షకుల కు సరికొత్త అనుభూతినిచ్చింది. కొమ్ముకోయ కళాకారులు లాటిన్ అమెరికా దేశాల పోటీదారులకు ఆహ్వానం పలికారు. తొలుత అర్జెంటీనా కంటెస్టెంట్ ర్యాంప్‌పైకి వచ్చారు. అనంతరం గోండు తెగకు చెందిన గుస్సాడి నృత్యంతో ఆఫ్రికా ఖండంలోని దేశాల పోటీదారును ఆహ్వానించారు. లంబాడీ–డప్పులు ప్రదర్శన విదేశీ–యులను అమితంగా ఆకట్టుకుంది. వీరు యూరోపియన్ దేశ పోటీదారులకు స్వాగతం పలికారు. ఒగ్గుడోలు కళాకారుల వేషధారణ, ప్రదర్శన ఆకట్టుకుంది. జాతీయ జెండాను చేతబూని కళాకారులు అద్భుత ప్రదర్శన ఇచ్చారు. వీరు ఆసియా ఖండంలోని పోటీదారులను స్వాగతించారు. సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నా.. హైదరాబాద్‌లో మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకలు వైభవంగా, ప్రశాంతంగా జరిగాయి. 110 దేశాల అందాలభామలతోపాటు విదేశీ అతిథులకు తెలంగాణ ప్రభుత్వం మంచి ఆతిథ్యంతోపాటు, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఈ వేడుకలను కోట్ల మంది తిలకించారు. ప్రపంచ శాంతికి, ఐక్యతకు మిస్ వరల్డ్ పోటీలు కూడా పాటుపడతాయని నిర్వాహకులు ప్రకటించారు. తెలంగాణ బ్రాండ్ ఇమేజీని ఈ వేడుకలు మరోసారి ప్రపంచానికి చాటిచెప్పాయని పర్యాటకశాఖ వర్గాలు తెలిపాయి.

### సైనికులకు సెల్యూట్..

11వ శతాబ్దానికి చెందిన పేరిణి నృత్యం పోటీలకు ప్రేరణగా నిల్చింది. దీన్ని 250 మంది నర్తకీమణులు వేదికపై అద్భుతంగా ప్రదర్శించారు. కంటెస్టెంట్స్‌లో అందరికంటే చివరగా మిస్ వియత్నాం ర్యాంప్ పైకి వచ్చారు. కార్యక్రమం చివరలో అందరూ కలిసి తమతమ జాతీయ జెండాలను చేతపట్టుకుని వచ్చారు. చివరలో మిస్ ఇండియా నందిని గుప్తా మూడు రంగుల జెండా పట్టుకుని వచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాత్రి 8.05 గంటలకు వేదికపైకి చేరుకున్నారు. ఆయన వెంట రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కూడా వచ్చారు. మిస్ ఇండియాకు కరతాళ ధ్వనులతో ఆహూతులు స్వాగతం పలికారు. 'జనగణమన..' జాతీయ గీతాన్ని ప్రారంభ వేడుకల్లో పాడారు. సరిహద్దుల్లో దేశం కోసం పోరాడుతున్న సైనికులకు వారి ధైర్య సాహసాలకు ఈ సందర్భంగా నిర్వాహకులు సెల్యూట్ చేశారు. కార్యక్రమం చివరలో మిస్ వరల్డ్ గీతాలాపన చేశారు. తెలంగాణ జరూర్ ఆనా నినాదంతో కార్యక్రమం ముగిసింది.



## యుద్ధప్రాతిపదికన సీతారామ-సీతమ్మ సాగర్ పనులు

- బహుళార్థ సాధక ప్రాజెక్టు పూర్తికి ప్రత్యేక ప్రణాళిక
- ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు ఉత్తమ్, తుమ్మల, పొంగులేటి సమీక్ష

**హైదరాబాద్:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నిర్మిస్తున్న సీతారామ–సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేందుకు ప్రభుత్వం సంకల్పించింది. ఈ ప్రాజెక్టు పూర్తికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకుని ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. శనివారం హైదరాబాద్‌లోని జలసౌధలో ఈ ప్రాజెక్టుపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. సమావేశం అనంతరం మంత్రి ఉత్తమ్ విలేకరులతో మాట్లాడారు.

### 7.80 లక్షల ఎకరాలకు నీళ్లివ్వడమే లక్ష్యం: మంత్రి ఉత్తమ్

భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో 7.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు. 'సీతారామ పథకంలో ఇప్పటికే మూడు పంపుహౌస్‌లను ప్రారంభించగా మరొకదాని పనులు 97 శాతం పూర్తయ్యాయి. పాలేరు, ఏన్కూరు లింకు కాలువలు, సత్తుపల్లి ట్రంక్ కాలువ పనులు పురోగతిలో ఉన్నాయి. పనుల్లో ఇంజినీర్లు వేగం పెంచాలి. సీతమ్మసాగర్ బ్యారేజీ నిర్మాణానికి సంబంధించి పర్యావరణ అనుమతి లేకుండా నిర్మించినందుకు జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ) విధించిన రూ.51.41 కోట్ల అపరాధ రుసుం రద్దుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ప్రతిపాదించిన పనులను పరిశీలనలోకి తీసుకుంటాం' అని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

### ప్రధాన కాలువ, సొరంగాల నిర్మాణాలపై చర్చ

సీతారామ ఎత్తిపోతల ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీలు, సొరంగాల నిర్మాణాలపై సమావేశంలో కీలక చర్చ జరిగినట్లు తెలిసింది. అందిన సమాచారం మేరకు... ఈ ప్రాజెక్టుపై కొత్తగూడెం సర్కిల్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇవ్వగా.. ఈఎన్సీ అనిల్‌కుమార్ పలు అంశాలు వివరించినట్లు సమాచారం. రూ.19,325 కోట్లతో చేపట్టాల్సిన బ్రాంచి కాలువలు, డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు సంబంధించి సవరించిన అంచనాలకు ప్రభుత్వ ఆమోదం అనంతరం ఉత్తర్వులు విడుదల కావాల్సి ఉంది. పునరాకృతితో చేపట్టిన సీతారామ పథకంలో ఇల్లెందు ప్రాంతానికి నీళ్లు వచ్చే మార్గం లేకుండా పోయిందని, ప్రత్యామ్నాయం చూపాల్సి ఉందని ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టులో సాంకేతికంగా ఇది ఎంత వరకు సాధ్యం అంటూ.. మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. ఈ భూ సేకరణ ఎందుకు పూర్తి కావడం లేదన్నారు. చాలాకాలం నుంచి ఒకే చోట పనిచేస్తున్న అధికారులను మార్చితేగానీ ఫలితాలు వచ్చేలా లేవు అని పేర్కొన్నారు. సమీక్షలో శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

## కాల్పుల విరమణ ఉల్లంఘనలో పాక్ రికార్డు

- ఏనాడూ ఒప్పందాలను పట్టించుకోని దాయాది
- ఉగ్రమూకలను ఉసిగొల్పుతూ.. దాడులకు పాల్పడే నైజం
- తాజా కాల్పుల విరమణకు కట్టుబడి ఉంటుందా అన్నదీ అనుమానమే



**న్యూఢిల్లీ, మే 10 :** పాక్ ఏ మాత్రం ఉగ్రచర్యలకు దిగినా భారత్ మరోమారు సైనిక చర్యకు దిగడం ఖాయం. ఇది పాక్‌కు కూడా తెలుసు. కాల్పుల విరమణలో ఇది ప్రధాన అంశం కానుంది. నిజానికి దీనిని పూర్తిస్థాయి యుద్ధానికి తీసుకుని వెళ్లి పాక్ భరతం పట్టాలని ప్రధాని మోడీ గట్టి పట్టుదలతో ఉన్నా అంతర్జాతీయంగా వచ్చి ఒత్తిళ్లకు తలొగ్గక తప్పలేదు. ఇకముందు కాశ్మీర్ లేదా భారత్‌లో ఎలాంటి ఉగ్ర చర్యలు జరిగినా అందుకు పాక్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇకపోతే కాల్పుల విరమణ జరిగినా భారత్ తీసుకున్న అష్టదిగ్బంధన చర్యలు మాత్రం యధావిధిగా కొనసాగే అవకాశం ఉంది. అందులో సింధూజలాల ఒప్పందం రద్దు, సిమ్లా ఒప్పందం రద్దు వంటివి ఉన్నాయి. భారత్, పాక్‌ల మధ్య1980 నుంచి ఉద్రిక్తతలు మొదలయ్యాయి. కాగా.. 2010 నుంచి 2020 సెప్టెంబర్ వరకు దాదాపు 11,572 సార్లు పాకిస్థాన్ సరిహద్దుల్లో శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించింది. ఈ ఘటనల్లో దాదాపు 240 మంది భారతీయలు చనిపోయారు. 673 మంది పౌరులు, 594 మంది సైనికులు గాయపడ్డారు. 1972లో నియంత్రణ రేఖను నిర్ధరించిన అనంతరం సరిహద్దుల్లో దాదాపు 10ఏళ్ల పాటు– ఎటువంటి ఉద్రిక్తతలు జరగలేదు. 1980 నుంచి యుద్ధ ట్యాంకులతో గస్తీ జోరందుకోగా.. 1990లో కశ్మీర్ లో తిరుగుబాటు తారాస్థాయికి చేరుకునే నాటికి ఇరుదేశాలు పూర్తి బలగాలను మోహరించాయి. 2001లో భారత్ తన సరిహద్దు ప్రాంతంలో కంచె నిర్మించడం ప్రారంభించిన తర్వాత నియంత్రణ రేఖ వద్ద కాల్పులు తీవ్రతరం అయ్యాయి. 2003 తర్వాత ఇరుదేశాలు యుద్ధ ట్యాంకులను దాదాపు 5 ఏళ్లపాటు నిషేధించాయి. ఈ దేశాల మధ్య ఆ సమయంలో జరిగిన చర్చలు మంచి ఫలితాలను ఇచ్చాయి. అయితే ముంబయిలో 2008 ఉగ్రదాడుల తర్వాత శాంతి చర్చలకు తావు లేకుండా పోయాయి. క్రమంగా సరిహద్దుల్లో యుద్ధట్యాంకుల అలజడి పెరిగింది. 2013లో అంతర్జాతీయ సరిహద్దు, నియంత్రణ రేఖ వద్ద ఉల్లంఘనలు ఎక్కువయ్యాయి. ప్రతి ఏడాది అవి గణనీయంగా పెరుగుతున్నాయి. 2017లో భారత్ 1,970 సార్లు ఉల్లంఘనలకు పాల్పడిందని పాకిస్థాన్ ఆరోపించింది. 2018లో పాకిస్థాన్ 936 సార్లు కాల్పుల విరమణ ఒప్పందానికి తూట్లు– పొడిచిందని భారత్ ఆరోపించింది. ఆనాటికి 15 ఏళ్లలోనే ఆల్ టైమ్ రికార్డది. 2018 మే నెలలో జమ్మూకశ్మీర్ లో.. భారత్ నాన్ ఇనీషియేషన్ ఆఫ్ కాంబాట్ ఆపరేషన్లను ప్రకటించింది. దీన్నే రంజాన్ కాల్పుల విరమణ అంటారు. ఇది 2003లో జరిగిన కాల్పుల విరమణ ఒప్పందానికి కొనసాగింపు. అయితే కాలక్రమేణ ఇరుదేశాల మధ్య సత్సంబంధాలు దెబ్బతిని.. 2019, 2020లో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. అఇప్పటి నుంచి కూడా 2025 వరకు పాకిస్థాన్ వరుసగా కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ వస్తోంది. తాజాగా సరిహద్దుల్లో కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి పౌరులపై కాల్పులకు తెగించింది. దీంతో ఇద్దరు జవాన్లు, 22మంది సామన్య పౌరులు మృతి చెందారు. ఈ క్రమంలో అమెరికా మధ్యవర్తిత్వంలో ఈ ఒప్పందం ఎంతవరకు ఫలిస్తుందో చూడాలి.

## కాల్పుల విరమణపై అఖిలపక్షం

- అన్ని విషయాలు సమగ్రంగా చర్చించాలి
- ప్రభుత్వానికి కాంగ్రెస్ డిమాండ్
- కాల్పుల విరమణను స్వాగతించిన ఒమర్
- శాంతికి భారత్ పెద్దన్న పాత్ర పోషించాలన్న మెహబూబా

**న్యూఢిల్లీ, మే 10 :** భారత్– పాక్ మధ్య కాల్పుల విరమణకు అంగీకారంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ప్రధాని మోదీ నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించి రాజకీయ పార్టీలన్నింటికి జరిగిన పరిణామాలను వివరించాలని కోరింది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేసింది. పహల్గాం ఉగ్రదాడి ఘటన అనంతరం గడిచిన 18 రోజులుగా జరిగిన పరిణామాలు, కలికట్టుగా తీసుకున్న నిర్ణయాలను చర్చించేందుకు సమావేశం నిర్వహించాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. ఇకపోతే భారత్– పాక్ మధ్య కాల్పుల విరమణను స్వాగతిస్తున్నట్లు– జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా పేర్కొన్నారు. ఇదే ఒప్పందం రెండ్రోజుల ముందు జరిగి ఉంటే కొంత రక్తపాతాన్ని, కొన్ని జీవితాలను కాపాడిటనట్లయ్యేదని పేర్కొన్నారు. ఎట్టకేలకు ఇరు దేశాల మిలటరీ ఆపరేషన్ డైరెక్టర్ జనరల్స్ సరిహద్దుల్లో కాల్పుల విరమణకు అంగీకరించడం స్వాగతించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. దాడుల కారణంగా జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఉపశమనం చర్యలు చేపట్టాల్సిన బాధ్యత జమ్మూకశ్మీర్ అధికార యంత్రాంగం ఉందని ఒమర్ అబ్దుల్లా అన్నారు. భారత్–పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతూ యుద్ధం దిశగా అడుగులు పడుతుండటంపై జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఉపఖండంలో ఉద్రిక్తతలు తగ్గించేందుకు భారత్ మొదట చొరవ చూపించాలని, నాయకత్వ పాత్రను పోషించాలని అన్నారు. సాఫ్ట్ పవర్, శాంతికి కట్టుబడి ఉండటమే భారత్ నిజమైన శక్తి అని చాటిచెప్పేందుకు ఇదే తగిన తరు–ణమని పేర్కొన్నారు. భారత్, పాక్ మధ్య పరస్పర దాడులపై అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ జనరల్ అసిమ్ మునీర్‌కు ఫోన్ చేసి భారత్‌తో పెరిగిన ఉద్రికత్తలను తగ్గించుకోవాలని కోరిన నేపథ్యంలో మెహబూబా ముఫ్తీ తాజా వ్యాఖ్యలు చేశారు. ఇరుదేశాల మధ్య ఉగ్రిత్తల విషయంలో ఒక దశదాటి జోక్యం చేసుకోలేమని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వ్యాఖ్యానించారని, ఇప్పుడు మార్కో రూబియో సైతం పాకిస్థాన్ ఆర్మీ చీఫ్‌ను ఉద్రిక్తతలు తగ్గించుకోవాలని కోరారని ముఫ్తీ తెలిపారు.

## ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు రష్యా అండ

### రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ వెల్లడి

**మాస్కో, మే 10 :** ఉగ్రవాదంపై పోరాడుతున్న భారత్‌కు తమ మద్దతు ఉంటుందని రష్యా మరోసారి స్పష్టం చేసింది. మునుపటి ఒప్పందాల ప్రకారం ఇరు దేశాల మధ్య సహకారం కొనసాగుతుందని తెలిపింది. ఈ క్రమంలో సంప్రదింపుల ప్రక్రియలో ఉన్న మిలిటరీ ఆర్డర్లను వెంటనే అందజేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొంది. భిన్న రూపాల్లో ఉన్న ఉగ్రవాదంపై పోరాడుతున్న మనకు పూర్తి మద్దతు ఇస్తామని రష్యా హామీ ఇచ్చింది. ఇప్పటికే అమల్లో ఉన్న ఒప్పందాల ప్రకారం ఇరు దేశాల మధ్య సహకారం కొనసాగుతుందని రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ పేర్కొన్నారు. రష్యా విజయోత్సవాల్లో ఆయన భారత్ పరతినిధిగా పాల్గొన్నారు. పుతిన్‌నుకలిసి అభినందనలుతెలిపారు. మాస్కో పర్యటన ముగించుకొని భారత్‌కు బయలుదేరిన ఆయన అక్కడ మీడియాతో మాట్లాడారు. మాస్కోలో నిర్వహించిన విక్టరీ డే పరేడ్‌లో భారత్ తరఫున రక్షణశాఖ సహాయమంత్రి సంజయ్ సేథ్ పాల్గొన్నారు. అనంతరం రష్యా రక్షణశాఖ సహాయ మంత్రి అలెగ్జాండర్ ఫోమిన్‌తో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. గతంలో రూపొందించుకున్న నిబంధనలు, వరుస సంప్రదింపుల ద్వారా సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి. సీమాంతర ఉగ్రవాదంపై చేస్తున్న పోరాటానికి మద్దతు ప్రకటించడంపై రష్యాకు భారత్ ధన్యవాదాలు తెలిపింది.

## బెంగుళూరు చేరుకున్న వీరజవాన్ భౌతికకాయం



- నివాళి అర్పించిన మంత్రి సవిత
- నేడు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- హాజరవుతున్న మంత్రులు పవన్, అనిత, లోకేశ్
- ఒక నెల జీతం సాయంగా ప్రకటించిన బాలయ్య

**శ్రీసత్యసాయి, మే 10 :** ఆపరేషన్ సిందూర్‌లో వీరమరణం పొందిన ఆర్మీ జవాన్ మురళీనాయక్ భౌతిక కాయం బెంగుళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. సాయంత్రం జవాన్ స్వస్థలం గోరంట్ల మండలం కల్లితండాకు పార్థీవదేహం చేరుకోనుంది. బెంగళూరు ఎయిర్ పోర్ట్‌లో మురళీ నాయక్ భౌతికకాయానికి మంత్రి సవిత నివాళులర్పించారు. విమానాశ్రయం నుంచి జవాన్ భౌతికకాయాన్ని స్వయంగా మంత్రి సవితతో పాటు–, సత్యసాయి జిల్లా అధికారులు స్వగ్రామానికి తీసుకువస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు కొడికొండ చెక్‌పోస్టు నుంచి జవాన్ భౌతికకాయాన్ని భారీ ర్యాలీతో స్వగ్రామం వరకు తీసుకెళ్లేందుకు పెద్ద ఎత్తున స్థానికులు తరలివస్తున్నారు. జవాన్ మురళీ నాయక్ అంత్యక్రియలు ఆదివారం స్వగ్రామం కల్లితండాలో జరుగనున్నాయి. జవాన్ అంత్యక్రియలకు డిప్యూటీ– సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనిత , మంత్రి నారా లోకేష్ హాజరుకానున్నారు. గుమ్మయ్యగారిపల్లి నుంచి భారీ ర్యాలీని నిర్వహించిన అనంతరం అంత్యక్రియలు నిర్వహించనున్నారు. పాక్ జరిపిన కాల్పుల్లో మరణించిన నేపథ్యంలో అధికారిక, సైనిక లాంఛనాలతో జరిగే అంత్యక్రియలకు డిప్యూటీ– సీఎం, మంత్రులు లోకేష్, అనిత హాజరుకానున్నారు. ముందుగా మురళీ నాయక్ భౌతికకాయానికి నివాళి అర్పించి, కుటు–ంబసభ్యులను పరామర్శించిన అనంతరం అంత్యక్రియల్లో పాల్గొననున్నారు. డిప్యూటీ– సీఎం, మంత్రుల రాక నేపథ్యంలో కల్లితండాలో యుద్ధ ప్రాతిపదికన అంత్యక్రియలకు అధికారులు ఏర్పాట్లు– చేస్తున్నారు. అలాగే అంత్యక్రియల్లో కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, వీఐపీలు పాల్గొననున్నారు. వీఐపీల రాకతో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు– చేస్తున్నారు. వీర జవాన్ మురళీ నాయక్ తల్లిదండ్రులను కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మేనల్లుడు దేవినేని ధర్మతేజ పరామర్శించారు. ఈ సందర్భంగా జవాన్ తల్లిదండ్రులకు ఒక నెల వేతనం ఆర్థిక సాయం చెక్‌ను ధర్మతేజ అందజేశారు. మురళీ నాయక్ కుటు–ంబానికి అన్ని విధాలా అండగా ఉంటామంటూ కుటుంబ సభ్యులకు ఓదార్పునిచ్చారు. అలాగే మురళీనాయక్ కుటు–ంబాన్ని మహారాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి ఉదయ్ సమంత్ పరామర్శించారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్నాథ్ షిండే వీడియో కాల్ ద్వారా మురళీ నాయక్ తల్లిదండ్రులను పరామర్శించారు. వీర జవాన్ విగ్రహాన్ని మురళి నాయక్ జన్మస్థలమైన ముంబైలో ఏర్పాటు– చేస్తామని ఈ సందర్భంగా మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.మరోవైపు ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా జమ్మూ కశ్మీర్ యుద్ధ భూమిలో పోరాడుతూ అసువులు బాసిన తెలుగు జవాన్ మురళీ నాయక్‌కు హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అండగా నిలిచారు. జవాన్ కుటుంబానికి తన వంతుగా ఆర్థిక సాయం అందజేశారు. ఒక నెల జీతాన్ని మురళీనాయక్ కుటుంబానికి ఇస్తున్నట్లు– ప్రకటించారు. ఈనెల 12న మురళీ నాయక్ స్వగ్రామానికి ఎమ్మెల్యే బాలయ్య వ్యక్తిగత కార్యదర్శులు వెళ్లనున్నారు. ఈ సందర్భంగా జవాన్ కుటుంబ సభ్యులను పరామర్శించి.. ఆపై బాలయ్య ప్రకటించిన నగదును వారికి అందిజేయనున్నారు.




## కులగణన నిర్ణయం చరిత్రాత్మకం

### 'ఓబీసీల భవిష్యత్తు నిర్మాణం' రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

**హైదరాబాద్:** ప్రధానిగా నరేంద్రమోదీ ఉండటంతోనే దేశంలో బీసీల కులగణన నిర్ణయం సాధ్యమైందని ఉత్తర్‌ప్రదేశ్ బీసీ సంక్షేమశాఖ సహాయ మంత్రి నరేంద్రకశ్యప్ అభిప్రాయపడ్డారు. బ్యాక్వర్డ్ క్లాస్ సెంటర్ ఫర్ ఎంపవర్‌మెంట్ (బీసీసీఈ) ఆధ్వర్యంలో 'కుల గణన: ఓబీసీల భవిష్యత్తు నిర్మాణంబీ సామాజిక న్యాయం' అంశంపై శనివారం సోమాజిగూడలోని ఓ హోటల్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. బీసీసీఈ డైరెక్టర్ తూళ్ల వీరేందర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నరేంద్ర కశ్యప్ మాట్లాడారు. విద్య, రాజకీయ, ఇతర రంగాల్లోనూ ఓబీసీలు క్రియాశీలకంగా ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ మాట్లాడుతూ.. "మోదీ ప్రధాని అయ్యాక ఓబీసీలకు ప్రాధాన్యం పెరిగింది. పేద ముస్లింలకు భాజపా వ్యతిరేకం కాదు. వారిని బీసీల్లో చేర్చి అందులోని 10శాతం రిజర్వేషన్ కట్టబెట్టడం అన్యాయం' అని పేర్కొన్నారు. అన్ని బీసీ సంఘాలు, మేధావులు ప్రజల్లో విస్తృతంగా చర్చలు జరిపి కులగణనపై సూచనలిస్తే.. కేంద్రం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. కులగణనకు కేంద్రం ముందుకు రావడం ప్రజల్లో ఉన్న ఆకాంక్ష మేరకే తప్ప ప్రతిపక్షాల డిమాండ్‌తో కాదన్నారు. తెలంగాణలో జరిగిన సర్వేలో సంబంధంలేని ప్రశ్నావళితో చాలామంది తమ కులం పేరు చెప్పలేదని, ఇప్పుడు అందరూ నిరభ్యంతరంగా చెప్పాలని కోరారు. తెలంగాణ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, విశ్రాంత ఐఏఎస్ అధికారులు డా.చిరంజీవులు, నరహరి, బీసీ సంఘాల నేతలు వీజీఆర్ నారగోని, సీఎల్ఎన్ గాంధీ, తాడూరి శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, ఓరుగంటి వెంకటేశంగౌడ్, దాసు సురేష్, గుజ్జ సత్యం, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# పాక్‌కు దెబ్బమీద దెబ్బ

- రహిమ్యార్ ఎయిర్‌బేస్‌ను ధ్వంసం చేసిన భారత్
- స్వతంత్ర దేశంగా ప్రకటించకన్న బలూచీ
- వరుస దెబ్బలకు తోడు ఆర్థికంగా కుదేలు



**న్యూఢిల్లీ, మే 10 :** యుద్ధం వల్ల పాకిస్తాన్‌కు తేరుకోలేని దెబ్బ తగులుతోంది. పాక్ ఆర్థికంగా కోలుకోవడానికి ఇంకో వందఏళ్లు పడుతుందని అంటున్నారు. అసలుకే ఆర్థికంగా చితికి పోయిన పాక్ ఈ యుద్ధంతో భారీగా నష్టపోయింది. ఇంకా నష్టపోతుంది కూడా. భారత్ ఎంతో తెలివిగా పాకిస్తాన్ ఆర్థిక మూలాలను దెబ్బ తీస్తోంది. ఏయిర్‌బేస్‌లను టార్గెట్ చేసి ధ్వంసం చేస్తోంది. తాజాగా, దాదాపు 60 ఏళ్ల చరిత్ర కలిగిన రహిమ్యార్ ఏయిర్‌బేస్‌ను భారత్ ధ్వంసం చేసింది. ఈ ఏయిర్‌బేస్ రాజస్తాన్ సరిహద్దు ప్రాంతానికి అతి దగ్గరలో ఉంది. మిలటరీ కార్యకలాపాలతో పాటు సివిల్ ఏవియేషన్‌కు కూడా పాక్ దీన్ని వాడుతోంది. చరిత్రలో ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ ఏయిర్‌బేస్, ఇంటర్‌నేషనల్ ఏయిర్‌పోర్టును భారత్ ధ్వంసం చేసింది. భారత్‌పై దాడి చేసి నష్టాన్నికలిగించామని అబద్దాలు ప్రచారం చేసుకుంటున్న పాక్, తమ దేవంలో జరుగుతున్న నష్టాన్ని కప్పి పు÷–చుకుంటోంది. మరోవైపు స్థానిక ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోంది. ఇప్పటికే పలువురు ఎంపిలు ప్రధాని షెహబాజ్‌ను తిట్టి పోస్తున్నారు. మరోవైపు బలూచీ ఆందోళనలు, దాడులు పాక్‌ను ఊపిరిపీల్చుకోకుండా చేస్తున్నాకు. భారత్‌తో యుద్ధానికి దిగిన పాకిస్థాన్‌కు బలూచిస్థాన్ పక్కలో బల్లెంలా మారింది. బలూచిస్థాన్‌ను స్వతంత్య్ర దేశంగా ప్రకటించుకునే దిశగా బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ' (బీఎల్ఏ), ఇతర వేర్పాటువాద గ్రూప్‌లు అడుగులు వేస్తున్నాయి. తాము స్వాతంత్ర్యం పొందామని బలూచిస్థాన్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని ఐక్యరాజ్యసమితి, ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేశాయి. బలూచిస్థాన్‌లో వరుస దాడులతో పాక్ సైన్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. భారత్‌పై మిస్సైళ్లు, డ్రోన్లతో దాడి చేసేందుకు పాక్ సైన్యం ప్రణాళికలు రచిస్తుంటే.. బలూచిస్థాన్‌లో కీలక ప్రాంతాలపై బీఎల్ఏ పట్టు సాధిస్తున్నది. బాంబుదాడులు, బుల్లెట్లతో విరుచుకుపడుతూ అక్కడ గస్తీ కాస్తున్న పాక్ సైన్యానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. మొత్తంగా ఇటు– తూర్పు ప్రాంతమైన భారత్ నుంచి, అటు– పశ్చిమ ప్రాంతమైన బలూచిస్థాన్ నుంచి జరుగుతున్న దాడులతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. ప్రస్తుతం పాకిస్థాన్ సైనిక సంపత్తి, ఆర్థిక పరిస్థితి, అంతర్జాతీయ సంబంధాలు వంటి అంశాలను బేరీజు వేస్తే.. అతి త్వరలో పాకిస్థాన్ రెండు ముక్కలు కావొచ్చని, బలూచిస్థాన్ ప్రత్యేక దేశంగా అవతరించే అవకాశం ఉన్నదని అంతర్జాతీయ నిపుణులు పేర్కొంటున్నారు. బలూచిస్థాన్‌లో బీఎల్ఏ, రెబల్స్ గ్రూప్స్ కలిసి కొంత కాలంగా పాక్ సైన్యంపై, ప్రభుత్వ ఆస్తులపై వరుసగా దాడులు చేస్తూ ముచ్చెమటలు పట్టిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం బలూచిస్థాన్‌లోని అనేక ప్రాంతాల్లో బీఎల్ఏ, రెబల్స్ దాడులు చేసినట్టు– అక్కడి మీడియా సంస్థలు తెలిపాయి. బలూచిస్థాన్ రాజధాని క్వెట్టాలో గురువారం నాలుగు చోట్ల దాడులు జరిగినట్టు– స్థానిక రేడియో జుంబేష్ ఇంగ్లిష్ తెలిపింది. క్వెట్టా వ్యాప్తంగా పేలుళ్లు, తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించినట్టు– వెల్లడించింది. మేం క్వెట్టాతోపాటు– బలూచిస్థాన్ వ్యాప్తంగా అనేక సైనిక పోస్టులపై దాడులు చేసి స్వాధీనం చేసుకున్నాం అని బీఎల్ఏ తెలిపింది. కెచ్, మస్టంగ్, కచి ప్రాంతాల్లో పాక్ సైన్యంపై ఆరు దాడులు చేసినట్టు– వెల్లడించింది. దాడులకు సంబంధించిన వీడియోలను వేర్పాటు–వాదులు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. బీఎల్ఏ అధికార ప్రతినిధి జియాండ్ బలూచ్ తెలిపిన వివరాల మే–రకు బలూచిస్థాన్‌కు చెందిన ఓ జర్నలిస్ట్ ఎక్స్‌లో ఒక పోస్ట్ పెట్టారు. దీని ప్రకారం.. బలూచిస్థాన్‌కు కెచ్ జిల్లాలోని దస్తక్ ప్రాంతంలో బీఎల్ఏ రిమోట్ కంట్రోల్ ఐఈడీని పేల్చడంతో బాంబు డిస్పోజబుల్ స్కాడ్‌కు చెందిన ఒక సైనికుడు అక్కడికక్కడే మరణించాడు. అదే జిల్లాలోని కెట్గాన్ ప్రాంతంలో పాకిస్థాన్ ఔట్‌పోస్ట్‌పై దాడిచేసి పలువురు సైనికులను హతమార్చారు. జమురాన్ షా డ్యామ్ ప్రాంతంలో ఐఈడీతో పాక్ ఆర్మీ వాహనాలను ధ్వంసం చేశారు. 'బలూచ్ వీరులు ఇప్పుడు నేరుగా పాక్ సైన్యంతో వీధుల్లో పోరాడుతున్నారు. ప్రజలు మాకు సంపూర్ణ మద్దతు పలుకుతున్నారు. మాకు వైమానిక దళ మద్ధతు అవసరం' అని వేర్పాటు–వాదులు ఒక ప్రకటనలో వెల్లడించారు. బలూచిస్థాన్‌లోని పలు ప్రాంతాల్లో స్థానికులు, వేర్పాటు– వా దులు పాకిస్థాన్ జెండాలను తొలగించి బలూచిస్థాన్ జెండాలను ఎగురవేశారు. ఈ ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. బలూచిస్థాన్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని వేర్పాటు–వాదులు విజ్ఞప్తి చేశారు. దేశ భద్రత ఏర్పాట్లకు, అధికారిక పత్రాల తయారీ, పౌరులకు గుర్తింపు కార్డుల జారీకి ఆర్థిక సాయం చేయాలని విన్నవించారు. ఐక్యరాజ్యసమితి శాంతి దళాన్ని తమ ప్రాంతానికి పంపాలని, పాకిస్థాన్ సైన్యం ఆయుధాలను ఇక్కడే వదిలేసి వైదొలిగేలా చర్యలు చేపట్టాలన్నారు. బలూచిస్థాన్‌లో మధ్యంతర ప్రభుత్వాన్ని ఏర్పాటు– చేసి, క్యాబినెట్‌ను ప్రకటిస్తామని తెలిపారు. త్వరలోనే దేశ అవతరణ వేడుకలు నిర్వహిస్తామని, దీనికి మిత్ర దేశాలను ఆహ్వానిస్తామని చెప్పారు. భవిష్యత్తులో ఏర్పడబోయే కొత్త ప్రభుత్వంలో మహిళలకు భాగస్వామ్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బలూచిస్థాన్ ప్రజలు పాక్ జెండాలను తొలగించి, సొంత జెండాలను ఎగురవేయడం మొదలు పెట్టారు. ప్రపంచ దేశాలు పాకిస్థాన్‌లోని తమ దౌత్య కార్యాలయాలను బలూచిస్థాన్‌కు తరలించాల్సిన సమయం వచ్చింది. పాకిస్థాన్‌కు వీడ్కోలు.. బలూచిస్థాన్‌కు స్వాగతం' అని బలూచ్ రచయిత మిర్ యార్ బలూచ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.



## ఆపరేషన్ కగార్‌కు సిందూర్ ఎఫెక్ట్

- తాత్కాలికంగా నిలిచిపోయిన మావోల ఏరివేత
- కర్రెగుట్టల నుంచి బలగాలు వెనక్కి
- సరిహద్దులో వెళ్లేందుకు ఆదేశాలు

**ములుగు, మే 10 :** ఆపరేషన్ కగార్‌పై ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్ పడింది. సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌కు కేంద్రం తాత్కాలిక బ్రేక్ వేసింది. భారత్ – పాకిస్థాన్ వార్ నేపథ్యంలో కేంద్రం సంచలన నిర్ణయం తీసుకుంది. మావోయిస్టులను ఏరివేసేందుకు కర్రెగుట్టలను జల్లెడ పడుతున్న సీఆర్పీఎఫ్ బలగాలు వెనక్కి రావాల్సిందిగా కేంద్రం ఆదేశించింది. దీంతో కర్రెగుట్టల్లో మావోయిస్టుల వేటకు విరామం పడింది. దాదాపు ఐదు వేల మందికి పైగా బలగాలను కేంద్రం వెనక్కి రిప్పిస్తోంది. కర్రెగుట్టల నుంచి బలగాలు వెనక్కి వెళ్తున్నాయి. తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని సీఆర్‌పీఎఫ్ కోబ్రా జవాన్లను తమ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కేంద్ర బలగాలు హుటాహుటిన వెనుతిరుగుతున్నాయి. ములుగు జిల్లాలోని వెంకటాపురం, ఆలుబాక, వీరభద్రవరం పెద్దగుట్ట పరిసరాల్లో మోహరించిన బలగాలకు రిలీవ్ ఇచ్చారు. కేంద్రం ఆదేశాల మేరకు ఆదివారం ఉదయంలోగా భారత్– పాక్ బార్డర్‌కు బలగాలు వెళ్లనున్నాయి. కాగా.. వచ్చే ఏడాది మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ కగార్ దూకుడుగా సాగుతోంది. ఆపరేషన్ కగార్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో భారీగా మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. వారిలో పలువురు అగ్రనేతలు కూడా ఉన్నారు. గత కొద్దిరోజులుగా ఆపరేషన్ కర్రెగుట్టలు పేరుతో మావోయిస్టులను ఏరివేసేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలపై సెర్చ్ కొనసాగిస్తున్నాయి. మావోయిస్టు అగ్రనేతలే టార్గెట్‌గా ఆపరేషన్ కర్రెగుట్టల్లో పెద్ద ఎత్తున కూబింగ్ కొనసాగిస్తున్నారు. 145 ఎకరాల విస్తీర్ణం ఉన్న కర్రెగుట్టల చుట్టూ దాదాపు పదివేల మంది భద్రతా బలగాలు మోహరించి ఉన్నాయి. అలాగే కర్రెగుట్టల్లో బంకర్లను ఏర్పాటు– చేసుకుని మావోయిస్టులు ఉన్నట్లు– గుర్తించిన భద్రతా బలగాలు కర్రెగుట్టలను జల్లడపడుతున్నాయి. గత కొద్దిరోజులుగా జరుగుతున్న కూంబింగ్‌లో పలువురు మావోయిస్టులు తారసపడటంతో ఎన్‌కౌంటర్లు జరిగాయి. చాలా మంది మావోయిస్టులు మ–రణించారు కూడా. అలాగే మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి నలుగురు గ్రౌహౌండ్స్ కానిస్టేబుళ్లు ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టుల కోసం మరింతగా కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో బలగాలను వెంటనే వెనక్కి రావాల్సిందిగా కేంద్రం నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. భారత్–పాక్ యుద్ధం నేపథ్యంలో సీఆర్పీఎఫ్ బలగాను కేంద్రం వెనక్కి రప్పిస్తోంది. దీంతో బార్డర్‌కు వెళ్లేందుకు భద్రతా బలగాలు కర్రెగుట్టలను వీడుతున్నారు.

## శంషాబాద్ పరిధిలో డ్రోన్ల నిషేధం

### సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి

**హైదరాబాద్, మే 10 :** నగరంలోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం పరిధిలో డ్రోన్ల వినియోగంపై నిషేధం విధించారు. విమానాశ్రయానికి 10 కి.మీ. పరిధిలో డ్రోన్లపై నిషేధం విధించినట్లు– సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి వెల్లడించారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు– సీపీ తెలిపారు. డ్రోన్లపై నిషేధం జూన్ 9 వరకు అమల్లో ఉంటుందని చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో బాణసంచా కాల్చడంపై నిషేధం విధించినట్లు– హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా బహిరంగ ప్రదేశాలు, కంటోన్మెంట్ ప్రాంతాల్లో బాణసంచా కాల్చడంపై నిషేధం విధించినట్లు చెప్పారు. ఆకస్మిక శబ్దాలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దని విజ్ఞప్తి చేశారు. బాణసంచా పేలుళ్లను ఉగ్ర కార్యకలాపాలుగా తప్పుగా అర్థం చేసుకునే అవకాశం ఉందన్నారు. భారత్–పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో పౌరులు సహకరించాలని, పోలీసుల ఆదేశాలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

## మేము ఎవరి జోలికి వెళ్లం

- మా జోలికి వస్తే మాత్రం వదిలి పెట్టం
- బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ పోస్ట్



**ముంబై, మే 10 :** పహల్గాం ఘటనకు ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ పెట్టిన పోస్ట్ అందరినీ ఆకట్టుకుంటోంది. సైనికులకు సెల్యూట్ చేస్తూ దీనిపై స్పందిం చారు. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించిన ఇమేజ్‌ను పంచుకున్న రణ్‌వీర్.. ఎవరి పనులు వాళ్లు చేసుకునే వారిని మేం ఇబ్బందిపెట్టం. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా ఇబ్బందిపెట్టాలని మా జోలికి వస్తే మాత్రం వదిలిపెట్టం. మన సాయుధ దళాల ధైర్యానికి సెల్యూట్ అని రాసుకొచ్చారు. ఈ ఆపరేషన్‌లో వ్యూహాత్మకంగా వ్యవహరి స్తోన్నందుకు ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ఆపరేషన్ సిందూర్‌పై టాలీవుడ్, బాలీవుడ్ సెలబ్రిటీ లు ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. చిరంజీవి, అల్లు అర్జున్, ఎన్టీఆర్, అక్షయ్ కుమార్, రితీశ్ దేశ్‌ముఖ్, నిమ్రత్ కౌర్‌లు సైనికుల సేవలను కొనియాడారు. మీ వెంటే మేమున్నామని సోషల్ మీడియాలో పోస్ట్‌లు షేర్ చేశారు. ఇక మరోవైపు రెండు రోజులుగా జమ్మూకశ్మీర్, పంజాబ్‌లోని ప్రాంతాల్లో పాకిస్థాన్ డ్రోన్లతో దాడులు చేస్తోంది. భారత ఆర్మీ వాటిని సమర్థంగా ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో భారత్ – పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## సరిహద్దు ఉద్రిక్తతలతో విద్యార్థుల ఆందోళన

### కేంద్రమంత్రి బండి చొరవతో స్వస్థలాలకు పయనం

**శ్రీనగర్, మే 10 :** భారత్–పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో శ్రీనగర్‌లోని షేర్–ఇ–కశ్మీరీ వ్యవసాయ విజ్ఞాన, సాంకేతిక విశ్వవిద్యాలయంలో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇందులో 300 మందికిపైగా విద్యార్థులు ఉండగా.. వీరిలో పలువురు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు ఉన్నారు. సరిహద్దుల్లో బాంబుల మోతతో ఆందోళన చెందుతున్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. తమను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఏపీ, తెలంగాణ విద్యార్థులు లేఖ రాశారు. దీంతో కేంద్ర మంత్రి తక్షణమే స్పందించారు. జిల్లా కలెక్టర్, వర్శిటీ డీన్‌తో మాట్లాడారు. సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు. దీంతో ఏపీ, తెలంగాణ, తమిళనాడుకు చెందిన మొత్తం 23 మంది విద్యార్థులను బస్సుల్లో శ్రీనగర్ నుంచి దిల్లీకి పంపించారు. అక్కడి నుంచి స్వస్థలాలకు చేరుకోనున్నారు.


## ఉద్రిక్తతలకు తోడు నీటికటకట

### ఎయూ హాస్టళ్లు తాత్కాలిక మూసివేత

**విశాఖపట్టణం, మే 10 :** భారత్–పాకిస్తాన్ మధ్య ఉద్రికత్తలు కొనసాగుతూనే ఉన్నాయి.. ఓవైపు పాకిస్తాన్.. జనావాసాలను టార్గెట్ చేస్తూ కాల్పులు జరుపుతోంది.. మరోవైపు డ్రోన్లతో భారత్‌పై దాడి చేస్తుండగా.. డ్రోన్లను కూల్చివేస్తూనే.. పాక్ కాల్పులను తిప్పికొడుతోంది భారత్.. ఇంకోవైపు.. పాకిస్తాన్‌పై విరుచుకుపడుతోంది.. అయితే, ఈ పరిస్థితుల నేపథ్యంలో విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో శనివారం నుంచి హాస్టళ్లను వర్సిటీ అధికారులు తాత్కాలి కంగా మూసివేశారు. భారత్–పాక్ యుద్ధం కారణంగా విద్యార్థుల భద్రతను దృష్టిలో పెట్టుకుని పరీక్షలు ముగిసిన వారు వెంటనే ఇళ్ల కు వెళ్లిపోవాలని స్పష్టం చేశారు. భద్రతా కారణాలతో పాటు నీటి ఎద్దడి, వార్షిక మరమ్మతుల కోసం కూడా హాస్టళ్లు మూసివేస్తున్నట్టు ఆంధ్రా యూనివర్సిటీ– రిజిస్ట్రార్ ప్రకటించారు.

## పాక్ అరాచకాలకు గట్టిగా సమాధానం చెబుతున్న మోడీ

- రక్షణ దళాలకు స్థైర్యం కలిగించాలని అమ్మవారికి మొక్కులు
- బషీర్ బాగ్ కనకదుర్గమ్మ ఆలయంలో కిషన్ రెడ్డి పూజలు



**హైదరాబాద్, మే 10 :** పాకిస్తాన్ చేసిన అరాచకాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ గట్టిగా సమాధానం చెబుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. నరేంద్రమోదీ నాయకత్వంలో పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి గట్టిగా భారత ఆర్మీ జవాబు చెప్పిందని అన్నారు. భారత సైనికులు ధైర్యంతో, సాహసంతో వీరోచితంగా పాకిస్తాన్‌లోని 9 ప్రాంతాల్లో ఉగ్రవాదుల శిక్షణా కేంద్రాలు, ఉగ్రవాదుల ఇండ్లను మట్టు–బెట్టారని చెప్పారు. పాకిస్తాన్ దుశ్చర్యలకు వ్యతిరేకంగా భారత సైన్యం వీరోచితంగా పోరాటం చేస్తోందని అన్నారు. భారతదేశం మీద జరిగిన ఉగ్రవాదుల దాడికి గానూ పాకిస్తాన్ క్షమాపణ చెప్పాల్సింది పోయి.. మన దేశంలోని చాలా ప్రాంతాల్లో, పౌర నివాసాలపై, సైనికులకు సంబంధించిన కేంద్రాలపై దాడులు చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల నిర్మూలన లక్ష్యంగా పోరాటం చేస్తున్న భారత సైనికులకు ఆత్మస్థయిర్యం, శక్తి, విజయం కలగాలని శనివారం బషీర్‌బాగ్ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో భారతదేశానికి మద్దతుగా భక్తులు నినాదలు చేశారు. జై శ్రీ రామ్.. జై రామ్ లక్ష్మణ్ జానకి.. జై బోలో హనుమాన్‌కి.. జై భవానీ.. జై శివాజీ నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. దేశ భద్రత కోసం పోరాడుతున్న యోధుల రక్షణకు అమ్మవారి ఆశీర్వాదం కలగాలని కిషన్‌రెడ్డి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పహల్గామ్‌లో అమాయకులైన 26 మంది భారత పౌరులను పాకిస్తాన్ ఉగ్రవాదులు అత్యంత కిరాతకంగా కాల్చిచంపారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చాలా సంవత్సరాలుగా భారతదేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేయాలని పాకిస్తాన్ కుయుక్తులు పన్నుతోందని ధ్వజమెత్తారు. మన దేశ సమగ్రత, సమైక్యతను దెబ్బతీయాలని, దేశ అభివృద్ధిని అడ్డుకోవాలని పాకిస్తాన్ చాలా ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. గతంలో భారత సైనికులు, పౌరులను కిరాతకంగా పాకిస్తాన్ ఉగ్రవాదులు హత్యచేశారని మండిపడ్డారు. హైదరాబాద్‌లో కూడా లుంబినీ పార్కు, కోఠిలోని గోకుల్ చాట్, దిల్‌సుఖ్‌నగర్‌లోని సాయిబాబా ఆలయ పరిసరాల్లో పాకిస్తాన్ ఉగ్రవాదులు దాడులు జరిపి చాలామందిని పొట్టనబెట్టు–కున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మన దేశ అమాయకులైన ప్రజలపై పాకిస్తాన్ ఉగ్రవాదులు కాల్పులు జరుపుతున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మండిపడ్డారు. మన దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు కులాలు, మతాలు, ప్రాంతాలు, భాషలకు అతీతంగా అందరూ ఏకమై ముక్తకంఠంతో పాకిస్తాన్ దుశ్చర్యలను ఖండిస్తున్నారని చెప్పారు. భారత సైనికులకు అండగా నిలబడ్డారని తెలిపారు. దేశ భద్రత కోసం పోరాటం చేస్తున్న భారత సైనికులకు మద్దతుగా కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రతి గ్రామం, మండలం, జిల్లాలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, సామూహిక ర్యాలీలు నిర్వహించాలని తెలుగు రాష్ట్రాల ప్రజలకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. భారత సైనికులకు మరింత ఆత్మస్థైర్యం కల్పించేలా ప్రజలు సంఘీభావాన్ని తెలియజేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

## అమయాకులను ఊచకోత కోయమని ఇస్లాం చెప్పిందా?

- ఇస్లాం పేరుతో ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాక్
- భారత్‌లో మత విద్వేషాలకు పాక్ కుట్ర
- పహల్గామ్ దాడికి భారత్ ధీటైన జవాబిస్తోంది
- ఉర్దూ జర్నలిస్టుల కార్యక్రమంలో ఓవైసీ హెచ్చరిక



**న్యూఢిల్లీ, మే 10 :** పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారతదేశ వ్యాప్తంగా పాకిస్థాన్‌పై ఆగ్రహ జ్వాలలు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే భారత్.. ఆపరేషన్ సింధూర్‌ని చేపట్టి పాక్‌లో ఉన్న ఉగ్రవాద స్థావరాలపై దాడి చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌పై ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఓవైసీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఇస్లాం పేరుతో పాక్ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని ఆయన మండిపడ్డారు. బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉర్దూ జర్నలిస్ట్ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఒవైసీ పాల్గొన్నారు. భారత్‌ను మతప్రాతిపదికన విభజించాలని పాక్ ప్రయత్నిస్తోందని అన్నారు. భారత్‌లో 23 కోట్ల మందికిపైగా ముస్లింలు ఉంటున్నారని.. హిందూ, ముస్లింల మధ్య ఘర్షణను పాక్ కోరుకుంటుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్విజాతి సిద్ధాంతాన్ని మా పూర్వీకులు తిరస్కరించారని ఓవైసీ అన్నారు. ద్విజాతి సిద్ధాంతంపై ఏర్పడిన పాకిస్థాన్.. ఆఫ్ఘానిస్థాన్‌పై ఎందుకు దాడి చేస్తోందని, ఇరాన్ సరిహద్దుల్లో ఎందుకు బాంబులు వేస్తోందని, ఆఫ్ఘన్లు, ఇరానియన్లు ముస్లింలు కాదా? ఆయన ప్రశ్నించారు. పాకిస్తాన్ మాటిమాటికి మజాక్ చేస్తోందని, పాకిస్తాన్ దాడి చేస్తే భారత్ వెనక్కి తగ్గదని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. అమాయకులను, చిన్న పిల్లలను చంపమని ఇస్లాం చెప్పలేదన్నారు. భారత్‌లోని హిందువులు, ముస్లింల మధ్య విద్వేషాలు సృష్టించేందుకు పాకిస్తాన్ ప్రయత్నిస్తోందని, భారత ముస్లింలు దేశం కోసం ప్రాణాలు ఇవ్వడానికి కూడా సిద్ధంగా ఉన్నారని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. ఇస్లాం పేరుతో పాకిస్తాన్ మారణహోమం సృష్టిస్తోందని, పహల్గామ్‌లో అతికిరాతకంగా అమాయక ప్రజలను హతమార్చిందని విమర్శించారు. అందుకు ప్రతీకారంగా ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనికులు సరైన సమాధానం ఇస్తున్నారని, పాక్ భారీ మూల్యం చెల్లించక తప్పదని అన్నారు. దేవుడి దయ వల్లే మనమందరం భారత్‌లో జన్మించామని, పవిత్ర మాసంలో చిన్నపిల్లలు, అమాయకులను చంపే పాక్‌కు ఇస్లాం పేరు పలికే అర్హత లేదని అన్నారు. మాయకులను, చిన్నపిల్లలను చంపాలని ఇస్లాం చెప్పలేదని, ఇస్లాం పేరుతో పాక్ అసత్య ప్రచారం చేస్తోందని మండి పడ్డారు. పాక్ దాడులపై భారత్ వెనక్కి తగ్గేది లేదని, భారత ముస్లింలు దేశం కోసం ప్రాణాలు అర్పిస్తారని అన్నారు. పాకిస్తాన్ ఆర్మీ మనదేశంలోని సామాన్యులను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతోందని, దానికి తగిన మూల్యం చెల్లిచుకుంటుందని ఒవైసీ అన్నారు. భారత జవానులకు మద్దతుగా మనమందరం ఉండాలని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. చచ్చే వరకు భారత భూమి కోసమే బ్రతకాలని ఎమోషనల్ అయ్యారు. ఈభూమ్మీద పుట్టడం మన అదృష్టమని అన్నారు. పాకిస్తాన్ ఆర్మీ జనాలను టార్గెట్ చేస్తూ దాడులకు పాల్పడుతుందని, దానికి తగిన మూల్యం చెల్లించుకుంటుందని ఎంపీ అన్నారు. పాకిస్తాన్ దాడి చేస్తే భారత్ ఏమాత్రం వెనక్కి తగ్గదు. ఇస్లాం పేరుతో పాకిస్తాన్ మారణహోమం సృష్టిస్తుంది. అమాయకులను, చిన్న పిల్లలను చంపే పాకిస్తాన్‌కు ఇస్లాం పేరు పలికే అర్హత లేదు. అమ్మ కడుపులో నుండి ఈ భూమిపై పడినప్పుడు.. చచ్చే వరకు ఈ భూమి కోసమే బ్రతకాలి' అని ఎంఐఎం పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ అన్నారు.



## కాశ్మీర్ ప్రజలకు అండగా ఉంటాం

- మృతుల కుటుంబాలకు పదిలక్షల పరిహారం
- కాశ్మీర్ సిఎం ఒమర్ అబ్దుల్లా వెల్లడి

**శ్రీనగర్, మే 10 :** గత రెండు రోజుల నుంచి జమ్మూకశ్మీర్ సరిహద్దు ప్రాంతాలపై పాక్ జరుపుతున్న దాడుల్లో దాదాపు 20మంది పౌరులు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు తమ ప్రభుత్వం ఎప్పటికీ మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేయడంతో.. పాక్ కూడా సరిహద్దు ప్రాంతాల్లో ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. నియంత్రణ రేఖ వెంట పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులకు తెగబడుతోంది. కశ్మీర్‌లోని శ్రీనగర్, రాజౌరి, పూంఛ్, పఠాన్ కోట్ ప్రాంతాల్లో పాక్ డ్రోన్‌లతో దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో జమ్మూకశ్మీర్ ప్రభుత్వ అధికారి రాజ్‌కుమార్ థప్పా సహా దాదాపు 20మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా..పదుల సంఖ్యలో గాయపడ్డారు. పౌరులు, ప్రభుత్వ ఉన్నతాధికారి మృతి పట్ల జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కరోజు ముందే తాను అధ్యక్షత వహించిన ఆన్‌లైన్ సమావేశంలో రాజ్‌కుమార్ పాల్గొన్నారని.. ఇంతలోనే రాజౌరిలోని ఆయన ఇంటిపై జరిగిన దాడిలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు. శనివారం వేకువజామున కూడా భారత్‌పై పాకిస్థాన్ సైన్యం దాడులకు పాల్పడింది. రాత్రి నుంచే సరిహద్దు రాష్ట్రాల్లో కొన్నిచోట్ల బాంబుపేలుళ్లు వినిపించడంతో అధికారులు అప్పటికప్పుడు విద్యుత్తు సరఫరా నిలిపివేసి 'బ్లాకౌట్' పాటించారు. శ్రీనగర్, పఠాన్ కోట్ ప్రాంతాల్లో ఉదయం కూడా పేలుళ్ల శబ్దాలు వచ్చినట్లు– స్థానికులు పేర్కొన్నారు. కాగా పాక్ దాడులను భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు సైరన్లు మోగిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో మరోసారి శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో భారీగా పేలుళ్లు సంభవించినట్లు– శబ్దాలు వచ్చినట్లు– అధికారులు పేర్కొన్నారు.

# గోబెల్స్ ప్రచారాన్ని నమ్ముకున్న పాక్ !



భారత్‌తో పోరాడే శక్తి లేకపోవడంతో ఇప్పుడు పాకిస్థాన్ అబద్ధాల ప్రచారంలో దూసుకుపోతోంది. యుద్ధంలో తామేదో విజయం సాధించి, భారత్‌పై పైచేయి సాధించామని ప్రపంచానికి తెలియచేసి మార్కులు కొట్టేయాలన్న తపనలో అబద్ధాలను నమ్ముకుంది. అయితే పాక్ కుయుక్తులు తెలిసిన ప్రపంచదేశాలు వీటిని నమ్మకున్నా... ఫేక్ వార్తలను ప్రచారం చేస్తోంది. జర్మనీ నియంత వెంట ఉన్న గోబెల్స్‌ను మించి ప్రచారం చేస్తోంది. గోబెల్స్ ఉంటే ఆయన ఆశ్చర్య పోయేలా ప్రచారాలను పేలుస్తోంది. జన్మన్ నియంత హిట్లర్‌ను ముంచినట్లే ఇప్పుడు పాక్‌ను కూడా ఈ ప్రచారాలు ముంచడం ఖాయం. ఇకపోతే పాక్‌కు మద్దతుగా ఏ ఒక్కదేశం ముందుకు రావడం లేదు. అలాగే టర్కీ వచ్చినా దాని పాత్ర నామమాత్రమే. రెండురోజుల యుద్ధానికే పాక్‌కు చుక్కలు కనిపిస్తున్నాయి. అనవసరంగా తోక కాల్చుకున్నట్లుగా ఇప్పుడు పాక్ పరిస్థితి ఏర్పడింది. భారత్ ప్రతిదాడులతో పాక్ కకావికలం అవుతోంది. అసలు యుద్ధం ముందున్నది. దీంతో పాక్ దిమ్మతిరిగేలా భారత్ సమాధానం ఇవ్వనుంది. ఇవన్నీ పాక్ పాలకులకు, అక్కడి సైన్యానికి తెలుసు. అయితే ప్రజలను నమ్మించాలి. నమ్మించలేక పోతే ప్రజలు తిరుగుబాటు చేస్తారు. క్రికెట్ ఓడిపోతేనే అక్కడి ప్రజలు రాళ్లతో కొడతారు. అలాంటి యుద్ధమంటే ఆషామాషీ కాదు. అ÷–దుకే భారత్ బలగాలను దెబ్బ తీసామని, విమానాశ్రయాలు కూల్చామని, భారత్ యుద్ధవిమానాలను కూల్చేశామని అబద్ధాలు ప్రచారం చేస్తోంది. దీనిని భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తోంది. అసలు వాస్వాలను ప్రపంచానికి తెలియచేస్తోంది. భారత్ ఆపరేషన్ సిందూర్ నిర్వహిస్తున్న నేపథ్యంలో పాకిస్థాన్ తప్పుడు ప్రచారంతో సోషల్‌మీడియాలో ఇలా వక్రబుద్ధిని చాటుకుంటున్నది. దాయాది చేస్తున్న అసత్య ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం తిప్పికొడు తున్నది. సామాజికమాధ్యమాల్లో ప్రసారమవుతున్న వార్తల్లో నిజానిజాలను ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ ద్వారా తేటతెల్లం చేస్తున్నది. శుక్రవారం మీడియాలో పలు అంశాలు ప్రచారం కాగా, వాటిపై పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ చేసి, దేశప్రజలకు వాస్తవాలకు నివేదించింది. పాకిస్థాన్‌తోపాటు పలు మీడియా సంస్థలు కూడా పాత ఫొటోలు, వీడియోలను ప్రస్తుత యుద్ధానికి సంబంధించినవిగా చిత్రీకరిస్తూ అసత్యప్రచారానికి పూనుకుంటున్నది. దీనిపై భారత్ ముందస్తుగా స్పందిస్తూ వాస్తవాలు, పారదర్శకతతో తప్పుడు సమాచారానికి చెక్ పెడుతూనే ఉన్నది.

ఆర్గాన్ నిజం

నిజానికి భారత్ ప్రతిదాడితో పాక్‌లో అనేక స్థావరాలు దెబ్బ తిన్నాయి. నాలుగు ఫైట్ జెట్లను భారత దళాలు కూల్చేశాయి. లాహోర్ విమాన వ్యవస్థను కుప్పకూల్చింది. ఇవన్నీ బయటకు రాకుండా పాక్ నానా తంటాలు పడుతోంది. ఇందుకోసం అబద్ధాలను, అర్ధసత్యాలను ప్రచారం చేస్తోంది. వీటిని భారత రక్షణ శాఖ ఫోటోలతో సహా ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ ప్రపంచాన్ని అప్రమత్తం చేస్తోంది. అలాగే భారతదేశ ప్రజలు ఆందోళనకు, భావోద్వేగాలకు గురికాకుండా చూస్తున్నది. సందేహాలకు తావులేకుండా చేస్తున్నది. అంతేకాదు ప్రజలకు సైతం నకిలీ వార్తలను ఎలా గుర్తించాలో అవగాహన కల్పించే ప్రచారాలకు శ్రీకారం చుట్టింది. పాకిస్థాన్ వైమానికదళం శ్రీనగర్ వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుందని, పలు జెట్ విమానాలను కూల్చడంతోపాటు–, భారత సైనికులను పట్టుకుందని, ఈ దాడిలో భారత్ తీవ్రంగా నష్టపోయిందని పాకిస్థాన్ మీడియా చానళ్లు ప్రచారం చేశాయి. పాక్ మంత్రులు సహా ఉన్నతాధికారులు ఆ కంటెంట్‌ను ప్రచారం చేశారు. భారత్ దీనిపై వెంటనే స్పందించింది. రియల్ టైమ్ ఫ్యాక్ట్‌చెకింగ్ ద్వారా ఆ వీడియో మూలాలను గుర్తించింది. పాక్ అసత్య ప్రచారానికి చెక్ పెట్టింది. వాస్తవానికి ఆ దృశ్యాలు 2024 ప్రారంభంలో పాకిస్థాన్‌లోని ఖైబర్‌లో జరిగిన మత ఘర్షణలకు సంబంధించినవిగా తేటతెల్లం చేసింది. తమదేశంలోనే జరిగిన దాడిని భారత్‌లో జరిగిన దాడిగా నమ్మించే ప్రయత్నం పాక్ చేసింది. భారత బ్రిగేడ్ ప్రధాన కార్యాలయాన్ని ధ్వంసం చేసినట్టు పాకిస్థాన్ మరో పుకారును సృష్టించింది. దానిని కూడా భారత్ తేటతెల్లం చేసింది. సెప్టెంబర్ 2024లో రాజస్థాన్‌లోని బార్మర్‌లో ఎంఐజీ 29 జెట్ క్రాష్ అయింది. ఆ పాత చిత్రాన్నే వక్రీకరించి పాకిస్థాన్ అనుకూల సోషల్ మీడియా అసత్య ప్రచారానికి తెరతీసింది. దానిని కూడా భారత్ ఆధారాలతో బయటపెట్టింది. కశ్మీర్‌లో కనీసం 3 భారతీయ జెట్‌లు కూలిపోయాయని చైనా డైలీ ప్రచారానికి పూనుకుంది. అయితే భారత్ దానిలో నిజానిజాలను బయట పెట్టింది. చైనా డైలీ ప్రచారం చేసిన చిత్రం 2019 నాటి ఒక సంఘటనకు సంబంధించిందని ఆధారాలతో బయటపెట్టింది.

జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పేరిట ఫేస్‌బుక్‌లో దుండగులు ఒక ఫేక్ అకౌంట్‌ను సైతం సృష్టించారు. పాకిస్థాన్ రహస్యంగా సైబర్ అటాక్స్ చేస్తున్నదని, పౌరులు మెసేజ్‌లను క్లిక్ చేయవద్దని తెలుపుతూ ఆ అకౌంట్‌లో ఒక పోస్టును పెట్టారు. భారత్ వెంటనే దీనిపై స్పందించింది. అజిత్ దోవల్‌కు ఫేస్‌బుక్ అకౌంటే లేదని తేల్చిచెప్పింది. నకిలీ ప్రొఫైల్ అని వెల్లడించింది. ముజఫరాబాద్‌లో సుఖోయ్ 30ఎంకేఐ విమానం కూలిపోయిందని, అందులో ఒక భారతీయ పైలట్ సజీవంగా ఉన్నాడని పాకిస్థాన్ సోషల్ మీడియా హ్యాండిల్స్ ప్రచారానికి పూనుకున్నాయి. అయితే అది అవాస్తమని భారత్ తేల్చింది. భారత వైమానిక దళానికి చెందిన ఈ సుఖోయ్ 2014 అక్టోబర్14 మహారాష్ట్రలోని పూణే– అహ్మద్‌నగర్ హైవే సమీపంలోని కుల్వాడి గ్రామంలోని ఉంద్రేవస్తి వద్ద కూలిపోయింది. దానిని తాజా యుద్ధానికి సంబంధించిందంటూ పాక్ వక్రీకరించింది. దానిని పాక్ ఆర్మీ కూల్చినట్లుగా ప్రాచారం చేసుకుంది. ఆ పోస్టును షేర్ చేయవద్దని భారత్ స్పష్టంచేసింది. జమ్ము వైమానికదళ స్థావరంలో భారీగా వరుస పేలుళ్లు జరిగాయని కూడా పాక్ ప్రచారానికి తెరతీసింది. దాన్ని కూడా భారత్ తిప్పికొట్టింది. పాక్ ప్రచారం చేస్తున్న ఫొటో ఆగస్టు 2021లో కాబూల్ విమానాశ్రయంలో జరిగిన పేలుడుకు సంబంధించినదని బహిర్గతం చేసింది. తప్పుడు సమాచారంతో మోసపోవద్దని, కంటెంట్‌ను షేర్ చేసే ముందు వాస్తవాలను తెలుసుకోవాలని పౌరులకు సూచించింది. జలంధర్‌లో జరిగిన డ్రోన్ దాడికి సంబంధించిన వీడియోను ప్రజల్లో భయాందోళనలను సృష్టించడానికి విస్తృత్తంగా ప్రచారం చేస్తున్నారు. అయితే అది ఎప్పుడో పొలాల్లో జరిగిన అగ్నిప్రమాదానికి సంబంధించిన వీడియో అని తేల్చింది. అదేవిధంగా పాకిస్థాన్ సైన్యం ఒక భారతీయ సైనికపోస్టును నాశనం చేసిందని, అందుకు సంబంధించినదిగా చెప్తూ ఓ వీడియో వైరల్ చేసింది. అది అసత్యమని పీఐబీ గుర్తించింది. భారత సైన్యంలో 20 రాజ్ బెటాలియన్ అనే యూనిట్ లేదని, ఆ వీడియో ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రచారం చేస్తున్నారని తెలిపింది. భారతదేశంపై పాకిస్థాన్ ప్రతీకారంగా క్షిపణి దాడి చేసిందనే సోషల్ మీడియాలో ఓ వీడియో చక్కర్లు కొడుతున్నది. అయితే అది కూడా అసత్యమని పీఐబీ నిర్ధారించింది. షేర్ చేసిన వీడియో 2020 సంవత్సరంలో లెబనాన్‌లోని బీరుట్‌లో జరిగిన పేలుడుకు సంబంధించినదని తేల్చిచెప్పింది. జమ్ముకశ్మీర్‌లోని రాజౌరిలో ఆర్మీ బ్రిగేడ్‌పై ఫిదాయీన్ దాడి జరిగిందనేది కూడా అసత్యమని పీఐబీ నిర్ధారించింది.

11-05-2025 — ఎడిటర్

# అబద్ధాల ప్రచారంలో ఆరితేరిన పాక్

- జనావాసాలు, ప్రార్థనా మందిరాలు లక్ష్యంగా దాడులు
- రెండు రోజులుగా రెచ్చగొట్టేలా పాక్ చర్యలు
- భారత్ ప్రతిదాడులు మాత్రమే చేస్తోంది
- నియంత్రణ రేఖ వెంబడి కాల్పులకు తెగబడుతున్న పాక్
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన రక్షణశాఖ



**న్యూఢిల్లీ, మే 10 :** పాకిస్తాన్ అబద్దాలు ప్రచారం చేస్తూనే.. జనావాసాలు, ప్రార్థనా మందిరాలు లక్ష్యంగా దాడులు చేస్తోందని, అయితే వీటిన భారత్ దళాలు తిప్పికొట్టాయని భారత రక్షణశాఖ వెల్లడించింది. విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్త్రీ, కల్నల్ సోఫియా ఖురేషీ, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్‌లు ఆపరేషన్ సింధూర్‌పై ఢిల్లీలో మీడియా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. శనివారం ఉదయం జరిగిన ఈ మీడియా సమావేశంలో మిస్త్రీ మాట్లాడుతూ.. ' గత రెండు రోజుల నుంచి పాకిస్తాన్ రెచ్చగొట్టే విధంగా ప్రవర్తిస్తోంది. పాకిస్తాన్ రెచ్చగొట్టే చర్యలకు భారత్ కేవలం ప్రతిస్పందిస్తోంది. పాకిస్తాన్ దాడులను అడ్డుకుంటోంది.. తిప్పికొడుతోంది' అని అన్నారు. అనంతరం కల్నల్ సోఫియా ఖురేషి మాట్లాడుతూ.. ' పశ్చిమ భాగం వైపు పాకిస్తాన్ దాడులకు పాల్పడుతోంది. భారత సైనికులు లక్ష్యంగా డ్రోన్లు, లాంగ్ రేంజ్ ఆయుధాలతో దాడులు చేస్తోంది. నియంత్రణ రేఖ వెంబడి కూడా కాల్పులకు తెగబడుతోంది. మిస్సైల్స్‌తో కూడా దాడులకు ప్రయత్నించింది. వాటిని ఆర్మీ విజయవంతంగా ధ్వంసం చేసింది. భారత ఏయిర్ బేస్‌లపై దాడులకు యత్నించింది. ఉదమ్ పూర్, పఠాన్ కోట్, ఆదమ్ పూర్‌లతో పాటు మరికొన్ని చోట్ల కాల్పులకు తెగబడింది. పలువురు సైనికులు గాయపడ్డారని అన్నారు. వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ మాట్లాడుతూ.. పాకిస్తాన్ తప్పుడు ప్రచారాలు చేస్తోంది. ఇండియన్ ÷ూ–400 సిస్టమ్‌ను.. సిర్సా, సూరత్ ఘర్‌లోని ఏయిర్ ఫీల్డ్స్‌ను ధ్వంసం చేసినట్లు– ప్రచారం చేస్తోంది. పాకిస్తాన్ చేస్తున్నవన్నీ తప్పుడు ప్రచారాలు. అందులో ఎలాంటి సందేహం లేదు' అని అన్నారు. పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోందని ఆర్మీ ప్రతినిధి సోఫియా ఖురేషీ పేర్కొన్నారు. పశ్చిమ సరిహద్దుల్లో పాక్ నిరంతరం దాడులు చేస్తోంది. డ్రోన్లు, దీర్ఘశ్రేణి ఆయుధాలు, లాయిటరింగ్ మ్యూనిషన్, ఫైటర్ జెట్లను వాటి.. భారత మిలిటరీ స్థావరాలపై దాడులు చేస్తోంది. చాలా ముప్పులను భారత్ తిప్పికొట్టింది. కానీ, 26 చోట్ల పాక్ ఆయుధాలు గగనతలంలోకి చొచ్చుకొచ్చాయి. అవి ఉధంపూర్, భుజ్, పఠాన్‌కోట్, భటిండా వాయుసేన స్థావరాల్లోని పరికరాలను దెబ్బతీసి, సిబ్బందిని గాయపర్చాయి. తెల్లవారుజామున 1.40 సమయంలో పాక్ హైస్పీడ్ మిసైల్స్‌తో పంజాబ్‌లోని వాయుసేన స్థావరాలపై దాడులు చేసింది. శ్రీనగర్, అవంతిపుర, ఉధంపుర్‌లో వైద్య కేంద్రాలపై దాడి చేసింది. ఇది రెచ్చగొట్టే చర్య అని కచ్చితంగా తెలుస్తోంది. దీనికి తగినట్లు ప్రతిస్పందిస్తూ.. భారత దళాలు పాక్‌లోని మిలిటరీ స్థావరాలు, రాడార్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్లు, రాడార్లపై దాడులు చేసింది. వీటిల్లో రఫీకీ, మురిద్, చక్లాల, రహీమ్ యార్ ఖాన్, సుక్కుర్, చునియాన్ స్థావరాలు ఉన్నాయి. ఫైటర్ జెట్లతో అత్యంత కచ్చితంగా లక్ష్యాలు ఛేదించే ఆయుధాలు వాడి ఈ దాడులు నిర్వహించాము. పస్రూర్‌లో రాడార్ కేంద్రం, సియాల్ కోట్‌లోని ఏవియేషన్ బేస్‌ను ధ్వసం చేశాము. ఈ దాడుల సందర్భంగా పౌరులు ప్రాణాలు పోకుండా చాలా జాగ్రత్తలు తీసుకొన్నాం. పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోంది. ఇది పరిస్థితిని మరింత దిగజార్చే ప్రమాదకర చర్యని పేర్కొన్నారు. ఇదే అంశాన్ని వ్యోమికా సింగ్ అంతర్జాతీయ మీడియా కోసం ఆంగ్లభాషలో వెల్లడించారు. భారత స్థావరాలు సురక్షితంగా ఉన్నాయని టైమ్ స్టాంప్‌లు ఉన్న వీడియోలు, ఫొటోలను ప్రదర్శించారు. విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ శిర్సా, సూరత్‌ఘర్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేశామని పాక్ చెప్పడం పూర్తిగా తప్పు. దీంతోపాటు– ఆదంపుర్‌లోని ఎస్–400 , బ్రహ్మోస్ మిసైల్ డిపో, పలుచోట్ల ఎయిర్‌ఫీల్డ్‌లను ధ్వంసం చేసినట్లు– తప్పుడు ప్రచారాలు చేస్తోందన్నారు.

# తప్పుడు వార్తలతో పాక్ హల్‌చల్

- ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్న భారత్
- తప్పుడు ప్రచారాలకు చైనా సైదోడు




**న్యూఢిల్లీ, మే 10 :** ఆపరేషన్ సిందూర్ ఎఫెక్ట్‌తో పాకిస్తాన్ విలవిలలాడిపోతోంది. ఏం చేయాలో, ఎలా దెబ్బకొట్టాలో తెలీక.. చివరకు తప్పుడు ప్రచారానికి తెర తీస్తోంది. దీనికి తన మిత్ర దేశమైన చైనా సపోర్టు కూడా తీసుకుంది. సాధారణ ప్రజలపై తాము దాడులు చేయడం లేదని పాకిస్థాన్ బుకాయింపులను భారత ఆర్మీ తిప్పికొట్టింది. జమ్ములోని నివాస ప్రాంతాలు, ఆలయాలపై పాక్ నిరంతరం దాడులకు తెగబడుతోందని కేంద్రం పేర్కొంది. అందుకు సాక్ష్యంగా వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. జమ్మూకశ్మీర్‌లోని శంభూ దేవాలయం ధ్వంసమైనట్లు రక్షణ శాఖ ఫొటోలు, వీడియోను విడుదల చేసింది. రాత్రంతా డ్రోన్లతో దాడులు చేస్తూనే ఉందని.. భారత ఆర్మీ వాటిని సమ–ర్థవంతంగా ఎదుర్కొన్నట్లు– పేర్కొంది. దేశ సార్వభౌమత్వాన్ని, సమగ్రతను కాపాడేందుకు సాయుధ బలగాలు కృతనిశ్చయంతో సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేసింది. పశ్చిమ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం కొనసాగుతున్నది. దాయాది పాకిస్థాన్ డ్రోన్ దాడులకు పాల్పడుతున్నది. సరిహద్దు వెంట కవ్వింపు చర్యలకు దిగుతూ.. దాడులు చేస్తున్నది. శనివారం ఉదయం కూడా డ్రోన్ అటాక్ జరిగింది. తెల్లవారుజామున 5 గంటలకు.. పాక్‌కు చెందిన డ్రోన్లు భారీ సంఖ్యలో అమృత్‌సర్‌లోని ఖాసా కంటోన్మెంట్‌లో కనిపించాయి. తక్షణమే భారతీయ సైన్యం స్పందించింది. ఎయిర్ డిఫెన్స్ యూనిట్లు ఆ డ్రోన్లను కూల్చివేసినట్లు ఇండియన్ ఆర్మీ ప్రకటించింది. దానికి సంబంధించిన వీడియోను ఆర్మీ విడుదల చేసింది. ఇకపోతే పాక్ తప్పుడు ప్రచారాలకు చైనా దోహదపడుతోంది. పాక్, చైనా రెండూ కలిసి భారత గగనతల రక్షణ వ్యవస్థ ఎస్–400 పై తప్పుడు ప్రచారానికి తెగబడ్డాయి.. సోషల్ మీడియా వేదికగా పాకిస్తాన్ పోస్టు చేస్తున్న తప్పుడు ప్రచారాలను చైనా ప్రచారంలోకి తెస్తోంది..భారత్ దాడులతో ఉక్కిరిబిక్కిరవుతున్న పాకిస్తాన్ ఎలాగైనా కసి తీర్చుకోవాలనే అక్కసుతో ఏవేవో కుటిల ప్రయత్నాలు చేస్తోంది. సరిహద్దుల వెంబడి కాల్పులకు తెగబడడం, డ్రోన్‌లో దాడులు చేయడం వంటి ప్రయత్నాలు చేస్తోంది. అయితే ఇండియన్ ఆర్మీ వాటిని దీటుగా ఎదుర్కొంటోంది. అయితే ఈ క్రమంలో పాకిస్తాన్ విష ప్రచారానికి సిద్ధమైంది. భారత్ మిలిటరీ స్థావరాలపై దాడి చేశామంటూ ఒకసారి, పాక్ సైబర్ సైన్యం దాడిలో భారత్ పవర్‌గ్రిడ్ 70శాతం నిర్వీర్యమైపోయిందని మ–రోసారి.. ఇలా తప్పుడు వార్తలు పోస్టు చేస్తోంది. అయితే అ వార్తలన్నీ ఫేక్ న్యూస్ అంటూ భారత వార్తాసంస్థ స్పష్టం చేస్తూ వచ్చింది. ఈ క్రమంలో తాజాగా, భారత గగనతల రక్షణ వ్యవస్థ ఎస్–400పై దాడి చేశామంటూ మరో వార్తను ప్రచారం చేసింది. భారత శక్తిమంతమైన క్షిపణి రక్షణ వ్యవస్థను పాక్‌కు చెందిన జేఎఫ్–17 యుద్ధ విమానంతో కూల్చేశామంటూ పాక్ ప్రభుత్వ రంగ మీడియా సంస్థ పేర్కొంది. అయితే ఈ వార్తలను చైనా ప్రభుత్వ రంగానికి చెందిన మీడియా ప్రచారంలోకి తెచ్చింది. అలాగే అజర్ బైజన్‌కు చెందిన మరో సంస్థ కూడా ఈ వార్తను వైరల్ చేసింది. ఈ వార్తలపై భారత ఆర్మీ అధికారులు స్పందించారు. పాక్ చేస్తున్న ప్రచారం తప్పు అని భారత సైనికాధికారులు తెలియజేశారు. ఎస్–400.. అనేది అత్యాధునిక రక్షణ వ్యవస్థ అని చెప్పొచ్చు. దీని రాడార్ రేంజి సుమారు 600 కిలోమీటర్ల వరకు ఉంటుంది. ఇందులో మొత్తం మూడు భాగాలు ఉంటాయి. క్షిపణి లాంచర్లు, శక్తివంతమైన రాడార్, కమాండ్ సెంటర్. ఇది విమానాలు, క్రూయిజ్ క్షిపణులతో పాటూ వేగంగా కదిలే ఇంటర్మీడియట్ రేంజ్ బాలిస్టిక్ క్షిపణులను కూడా ఢీకొట్టగలదు. ఈ రక్షణ వ్యవస్థను ప్రపంచంలో ఇప్పటివరకు రష్యా, చైనా, టర్కీలు వినియోగిస్తున్నాయి.

# భారత్-పాక్‌ల మధ్య సయోధ్య కుదురుస్తాం

## పెద్దన్న పాత్ర కోసం చైనా తహతహ

**న్యూఢిల్లీ, మే 10 :** భారత్– పాకిస్థాన్ ల మధ్య సమస్యకు ముగింపు పలికేందుకు అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని చైనా పేర్కొంది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో బీజింగ్ ఈమేరకు పేర్కొనడం గమనార్హం. ఇరుదేశాలు సంయమనం పాటించాలని చైనా విదేశాంగ శాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. భారత్– పాక్‌ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తత పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం. శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాలు సమయమనం పాటించాలని కోరుతున్నాం. శాంతియుత మార్గాలతో సమస్యలను పరిష్కరించుకోవాలి. ఉద్రిక్తతలను తీవ్రతరం చేసే చర్యలను తగ్గించుకోవాలని సూచిస్తున్నాం. ఈ ఉద్రిక్తతలను తగ్గించాలని అంతర్జాతీయ సమాజం కూడా ఆశిస్తోంది. ఈ సమస్య ముగింపునకు అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని బీజింగ్ పేర్కొంది. ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'పేరుతో పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాల లక్ష్యంగా దాడులు చేసింది. దీంతో భారత్– పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమయ్యాయి.

# జనావాసాలపై దాడులతో రెచ్చగొడుతున్న పాక్

- ఢిల్లీ లక్ష్యంగా పాక్ క్షిపణి ప్రయోగం
- హతాఫ్-2 మిస్సైల్‌ను అడ్డుకున్న భారత్
- హర్యానాలోని సిర్సా వద్ద కూల్చివేత
- శ్రీనగర్ ఎయిర్‌పోర్టుపైనా దాడికి యత్నం

**న్యూఢిల్లీ, మే 10 :** ఒక పక్క భారత దళాల ధాటికి విలవిలలాడుతున్నప్పటికీ.. పాకిస్థాన్ తన వక్ర బుద్ధి చూపిస్తూనే ఉంది. భారత్ పై మిస్సైళ్లతో దాడికి పాల్పడుతూ రెచ్చగొడుతోంది. జనావాసాలు లక్ష్యంగా దాడులకు పాల్పడుతూ రెచ్చొట్టే చర్యలకు దిగుతోంది. ఢిల్లీ, శ్రీనగర్‌తో పాటు, సరిహద్దు వెంబగి గ్రామాలపై దాడులకు తెగబడుతోంది. ఢిల్లీపై దాడి చేయడమే లక్ష్యంగా చేసిన దాడిని భారత్ సైన్యం ధీటుగా తిప్పికొట్టింది. పాకిస్థాన్ డ్రోన్లను మన సైన్యం ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్నా.. మళ్ళీ క్షిపణులు ప్రయోగిస్తోంది. తాజాగా ఢిల్లీని టార్గెట్ చేసుకున్న పాక్.. శనివారం ఫతా 2 క్షిపణి ప్రయోగించింది. అయితే.. ఫతా 2 క్షిపణిని భారతదళాలు కూల్చేసాయి. హర్యానాలోని సిర్సా సమీపంలో భారత వైమానిక రక్షణ దళాలు ఆ క్షిపణిని అడ్డుకుని ధ్వంసం చేసినట్లు సమాచారం. ఫతా 2 క్షిపణి ఉపరితలం నుండి ఉపరితలానికి 400 కిలోమీటర్ల రేంజ్ తో ఉంటుందని తెలుస్తుంది. శనివారం తెల్లవారుజామున, రావల్పిండి లోని నూర్ ఖాన్, పంజాబ్‌లోని చక్వాల్‌లోని మురిద్, షోర్కోట్‌లోని రఫీకితో సహా నాలుగు పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై భారత దళాలు దాడి చేసినట్లు సమాచారం. పాకిస్తాన్ వైమానిక స్థావరాలపై దాడి జరిగినట్లు ఆ దేశ డైరెక్టర్ జనరల్ ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌదరి వెల్లడించారు. ఎల్ఓసీ వెంబడి 26 డ్రోన్లు కనిపించాయని.. వీటిలో అనుమానిత సాయుధ డ్రోన్లు ఉన్నాయి. బారాముల్లా, శ్రీనగర్, అవంతిపోరా, నగ్రోటా, జమ్మూ, ఫిరోజ్‌పూర్, పఠాన్‌కోట్, ఫాజిల్కా, లాల్‌గఢ్ జట్టా, జైసల్మేర్, బార్మర్, భుజ్, కుర్బెట్ మరియు లఖీ నాలా ఉన్నాయి. విచారకరంగా, ఫిరోజ్‌పూర్‌లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడికి పాల్పడ్డట్టు ప్రభుత్వం తెలిపింది. భారత్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడులకు తెగబడుతున్న పాకిస్థాన్ తాజాగా శ్రీనగర్‌లో మరోసారి భారీ పేలుళ్లు సంభవించినట్లు ఆర్మీ అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్ విమానాశ్రయం సమీపంలో ఉదయం 11.45 గంటల ప్రాంతంలో రెండు భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని తెలిపారు. ఈ పేలుళ్ల కారణంగా ప్రజలు భయాందోళనకు గురయ్యారని.. విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అన్నారు. పేలుళ్ల శబ్దం వినిపించిన వెంటనే పలు ప్రాంతాల్లో సైరన్లు మోగించి.. ప్రజలను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. అవంతిపురం సమీపంలో ఐదుసార్లు భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో క్షిపణి లాంటి వస్తువు పడినట్లు– గుర్తించామన్నారు. శనివారం తెల్లవారు జామున శ్రీనగర్ విమానాశ్రయంపై.. ఎయిర్ బేస్‌పై డ్రోన్లతో దాడి చేయగా.. సైన్యం వాటిని తిప్పికొట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో పాక్ వరుస దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో, బాల్కనీల్లో ఉండకుండా ఇళ్లల్లోనే ఉండాలని హెచ్చరించారు. పంజాబ్‌లోని బఠిండాలో అధికారులు రెడ్ అలర్ట్ విధించారు. శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో పేలుళు సంభవిస్తుండడంతో దానితో సహా ఉత్తర, పశ్చిమ భారత్‌లోని 32 విమానాశ్రయాలను ఈనెల 15 వరకు మూసివేస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. భారత్ సరిహద్దుల్లో పాక్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయని భారత సైన్యం వెల్లడించింది. అమృత్ సర్ ఖాసా కంటోన్మెంట్‌పైకి పాక్ డ్రోన్‌లు ప్రయోగించిందని, పాక్ డ్రోన్లను వచ్చినవి వచ్చినట్లు సమర్థంగా కూల్చివేశామని స్పష్టం చేసింది. సాధారణ పౌరులపై దాడులు ఆమోదనీయం కాదని పేర్కొంది. ఎలాంటి దాడులనైనా భారత సైన్యం దీటుగా ఎదుర్కొవడానికి సిద్ధంగా ఉందని బదులిచ్చింది.

# భారత్ దాడితో పాక్‌లో వణుకు

- సైనికదాడి ఆపితే మేమూ దిగివస్తాం
- పాక్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ వెల్లడి

**ఇస్లామాబాద్, మే 10 :** భారత్ తమపై దాడి చేస్తే ఎదురుదాడికి దిగుతామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన పాక్ ఇప్పుడు మాట మార్చేసింది. పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్ మీడియాతో మాట్లాడుతూ.. భారత్ తమపై చేస్తున్న సైనిక దాడిని ఇక్కడితో ఆపితే తాము కూడా ఉద్రిక్తతలు తగ్గించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాకిస్తాన్ విదేశాంగమంత్రి ఇషాక్ దర్ ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ దాడులు ఆపితే తాము ఆపుతామని ఇషాక్ దర్ స్పష్టం చేశారు. రెండు దేశాల మధ్య ఉద్రక్తతల నేపథ్యంలో తాము తగ్గింపునకు సిద్ధంగా ఉన్నామని, అయిత భారత్ దాడులు ఆపితే తాము తగ్గుతామని పేర్కొన్నారు. ఇదే విషయాన్ని అమెరికాకు స్పష్టం చేశామని వివరించారు. ఇరుదేశాల మధ్య దాడుల వల్ల పాక్ ఆర్థిక పరిస్థితి కుదేలవ్వడం, ప్రజల పరిస్థితులు అధ్వానంగా మారే ప్రమాదం ఉండడంతో.. ఈ యుద్ధ వాతావరణాన్ని రూపుమాపడం కోసం న్యూదిల్లీతో చర్చలు జరపడానికి ఇస్లామాబాద్ సిద్ధంగా ఉందని పాక్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. భారత్–పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితులు చేయి దాటకముందే దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇరుదేశాలకు సూచించారు. ఈ నేపథ్యంలో పాక్ విదేశాంగశాఖ మంత్రి ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. గురువారం రాత్రి నుంచి పాక్ భారత సరిహద్దు ప్రాంతాల్లో దుస్సాహసానికి ఒడిగడుతూనే ఉంది. బారాముల్లా నుంచి భుజ్ వరకు 26 ప్రాంతాల పైకి వరసగా డ్రోన్లు ప్రయోగించింది. ముఖ్యంగా శ్రీనగర్ విమానాశ్రయాన్ని, అవంతీపోరా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని డ్రోన్లను ప్రయోగిస్తూ.. విఫలయత్నిం చేస్తుండగా, దాయాది చర్యలను భారత సైన్యం తిప్పి కొడుతోంది. శనివారం మరోసారి జమ్మూ, ఫిరోజ్‌పుర్, పఠాన్‌కోట్, జైసల్మేర్, బాడ్‌మేడ్, భుజ్ తదితర ప్రాంతాలపై వీటిని మళ్లీ పంపేందుకు ప్రయత్నించగా భారత సైనికులు వాటిని కూల్చివేశారు.

ప్రాంతీయం



# రైతుల సహకారంతో పైప్ లైన్

- 3 రోజులలో మస్తానీకుంటకు నీరు విడుదల
- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించిన మంత్రి తుమ్మల

**ఖమ్మం, రఘునాథపాలెం, ఆర్గాన్ న్యూస్, మే 10 :** మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా మూడు రోజులలో మస్తానీ కుంటకు నీరు విడుదల చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మంత్రి రఘునాథపాలెం మండలం గడ్డికుంట తండా వద్ద గల గ్రావిటీ 5 కెనాల్, బావోజితండా వద్ద గల రేగులకుంట చెరువు సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ మంచుకొండ ఎత్తిపోతల పథకం ట్రయల్ రన్ ద్వారా చెరువులకు నీటి విడుదల చేపడుతున్నామని తెలిపారు.రేగుల కుంట చెరువు నుండి నీరు సర్ ప్లస్ అయి నల్లకుంట చెరువు, మల్లెపల్లికు చేరుకుంటున్నాయని అన్నారు. 3 రోజుల వ్యవధిలో మస్తానీకుంట, మంచుకొండకు నీరు విడుదల చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

## 66.33 కోట్లతో లిఫ్ట్

రూ. 66.33 కోట్ల ఖర్చుతో మంచుకొండ లిఫ్ట్ ఇర్రిగేషన్ ప్రాజెక్ట్ చేపట్టామన్నారు. తక్కువ ఖర్చుతో అధికంగా ఆయకట్టు సాగు పనులకు ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తూ, మంచుకొండ ఎత్తిపోతల పథకాన్ని యుద్ధప్రాతిపదికన పూర్తికి చర్యలు తీసుకున్నామన్నారు. ఈ ప్రాజెక్ట్ తో 2400 పైగా ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. కొత్త పనులను చేపట్టి, ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. రైతుల సహకారంతో పైప్ లైన్ వేయడం పూర్తిచేస్తున్నట్లు, రాబోయే వానాకాలం పంట సీజన్ నుండి మంచుకొండ ఎత్తిపోతల పథకం క్రింద సాగు నీరు సరఫరా చేస్తామని మంత్రి అన్నారు. ఈ పర్యటనలో మంత్రి వెంట జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, ఇర్రిగేషన్ ఇఇ అనన్య, డిఇ ఝాన్సీ, ఏడిఏ వెంకటేశ్వర రావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# రైల్వే స్టేషన్ పనులు ఇంకెప్పుడు పూర్తి చేస్తారు..?

- ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి అసంతృప్తి
- భద్రాచలం రోడ్డు స్టేషన్ పనుల జాప్యంపై ఆగ్రహం
- త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు

**కొత్తగూడెం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 10 :** భద్రాచలం రోడ్డు ( కొత్తగూడెం) రైల్వే స్టేషన్ పనులు పూర్తి చేయడంలో జరుగుతున్న జాప్యంపై ఖమ్మం ఎంపీ రామ-సహాయం రఘురాం రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శనివారం ఆయన ఈ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేశారు. అనుకున్న సమయంలో పనులు జరగకపోవడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని రైల్వే ఉన్నతాధికారులకు ఫోన్ చేసి వారి దృష్టికి తీసుకెళ్లారు. కాంట్రాక్టర్ తో మాట్లాడి పనులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని ప్రశ్నించారు ఇకనైనా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీ వెంట మాజీ జడ్పి చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్, యూత్ కాంగ్రెస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు చీకటి కార్తీక్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఆళ్ళ మురళి, ఊకంటి గోపాల్ రావు, మాజీ ఏఎంసి చైర్మన్ రాంబాబు మరియు తదితరులు పాల్గొన్నారు.



# త్రివేణి విద్యార్థులను అభినందించిన ఎస్పి రోహిత్ రాజ్

**కొత్తగూడెం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 10 :** 2025 పదవ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన త్రివేణి విద్యార్థులను కొత్తగూడెం ఎస్పి బి. రోహిత్ రాజు సి.ఐ. వెంకటేశ్వరరావు అభినందించినారు. పాఠశాల ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు చేసిన ఉత్తమ కృషిఫలితంగా ఈ ఫలితాలు సాధించినట్లు త్రివేణి - కృష్ణవేణి విద్యాసంస్థల అధినేత గొల్లపూడి జగదీష్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ సింగ్ తెలిపారు. ఎస్పి బి. రోహిత్ రాజు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన చదువుల వలన ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని దీనికి త్రివేణి పాఠశాల కృషిఫలితమే అని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి విజయాలు మరిఎన్నో సాధించాలని తెలిపారు. సి.ఐ. వెంకటేశ్వర రావు మాట్లాడుతూ విజయాలు వచ్చినప్పుడు పొంగిపోకుండా విజయాన్ని నిరంతర ప్రవాహంవలె కొనసాగిస్తూ విజయాలు సాధించాలని తెలిపారు. భద్రాది కొత్తగూడెంలో త్రివేణి పాఠశాలకు సంభందించిన ఎస్.ఎస్.సి. పరీక్షకు హాజరైన విద్యార్థులకు 600 గాను 593 మార్కులు ఆర్. రిషికశ్రీ, 586 మార్కులు వై. హనూజ మనస్వి, 583 మార్కులు పి. సాత్విక, 581 మార్కులు ఎస్.దీపాహస్మిత, భద్రాది కొత్తగూడెంలో త్రివేణి విద్యార్థులు 590 దాటిన విద్యార్థులు 1, 580 దాటిన విద్యార్థులు 5గురు, 570 దాటిన విద్యార్థులు 16 మంది, 560 దాటిన విద్యార్థులు 28 మంది, 500 దాటిన విద్యార్థులు 174 మంది విద్యార్థులు సాదించారని జి.పి.ఎ అయిన మార్కులలోనైన త్రివేణి విద్యార్థులే మందంజలో ఉంటారని గొల్లపూడి జగదీష్ తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులపట్ల త్రివేణి డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, సి.ఆర్.ఓ. కాట్రగడ్డ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్స్ వై.వి. సురేష్, శ్రీనివాస్సింగ్, వైస్. ప్రిన్సిపాల్ సౌజన్య, ఇంచార్జ్ యం.హనుమంత రావు వి.శ్రీకాంత్ అభినందనలు తెలియజేసారు.

# అశ్వారావుపేటను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

- వెనుకబడిన ప్రాంతంలో నిత్య వెలుగులు
- భారీగా సబ్ స్టేషన్ల నిర్మాణాలకు శంకుస్థాపనలు
- పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- రెవిన్యూ మంత్రి పొంగులేటి
- ఎంపీ రామసహాయం, ఎమ్మెల్యేలు



**అశ్వారావుపేట, ఆర్గాన్ న్యూస్, మే 10:** అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట మండలం పరకాల గండిలో రూ. 2.24 కోట్లతో అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం లో రూ. 3.10కోట్లతో, తిరుమలకుంటలో రూ. 3.15కోట్లతో, కావడిగుండ్లలో రూ. 2.24కోట్లతో, అశ్వారావుపేట పట్టణం లో రూ. 2.53కోట్లతో నూతనంగా చేపట్టబోయే 33/11 కెవి సబ్ స్టేషన్ ల శంకుస్థాపనకు, అదేవిధంగా రూ. 24.46కోట్ల అంచనా వ్యయంతో 33కెవి ఫీచర్ల ఏర్పాటు పనులకు శ్రీకారం చుట్టే కార్యక్రమం అశ్వారావుపేట నియోజకవర్గంలోని పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ ఆవరణలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి , స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినా రాయణ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ తో కలిసి తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి పొంగులేటి మాట్లాడుతూ... అశ్వారావుపేట నియోజకవర్గం కొన్ని దశాబ్దాల కాలంగా వెనుకబడి ఉంది...అలాంటి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్నదే కాంగ్రెస్ ధ్యేయం... అందులో భాగంగానే ఉప ముఖ్యమంత్రి చొరవతో కరెంట్ వెలుగులు నింపేందుకు ఈ రోజు విద్యుత్ సబ్ స్టేషన్ ల ఏర్పాటుకు శంకుస్థాపన చేసుకుంటున్నాం అన్నారు.

## వైఎస్ఆర్ హయాంలో వెలుగులు

వైఎస్సార్ హయాంలో ప్రతీ తండాకు, ప్రతీ గ్రామానికి నాణ్యమైన కరెంట్ తో పాటు ఉచితంగా కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ దే గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాదిరిగానే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నాణ్యమైన కరెంట్ ఇచ్చేందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటుంది.

## అప్పుల ఊబిలోకి నెట్టిన బిఆర్ఎస్

ఎనిమిదో అద్భుతం కాళేశ్వరం కడుతున్నాం అని చెప్పి రాష్ట్రాన్ని దోచుకున్న ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర సంక్షేమాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది. ఐనప్పటికీ వాటన్నిటిని తట్టుకుని వారు చేసిన తప్పిదాలను సరిచేస్తూ ఎన్నికల్లో ఇచిన ప్రతీ హామీని నెరవేరుస్తూ వస్తున్నాం ఎవరికీ ఉపయోగపడని ధరణిని పక్కన పెట్టి ప్రతీ ఒక్కరికీ ఉపయోగ పడేలా భూ భారతి చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా అమల్లోకి తీసుకువచ్చాం. విద్యా, వైద్య రంగాలకు పెద్ద పీట వేస్తున్నాం నిరుద్యోగ యువతకు ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 50వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చాం. రాజీవ్ యువ వికాస్ పేరుతో త్వరలోనే ప్రతీ నిరుద్యోగికి ఉపాధి కల్పించేందుకు లోన్లు ఇవ్వడం జరుగుతుంది. గత ప్రభుత్వంలో కోళ్ల ఫారాల్లో, పాడుబడిన రైస్ మిల్లుల్లో ఉన్న గురుకులాలను పక్కన పెట్టి ఇంటిగ్రేటెడ్ గురుకులాల పేరుతో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో వేల కోట్ల రూపాయలతో గురుకులాల ఏర్పాటుకు శంకుస్థాపన చేసుకోవడం జరిగింది.

## మనసుంటే మార్గం ఉంటుంది...

పేదవాడి కళ్లలో చిరునవ్వు చూడాలని, కాస్త ఇబ్బందులు ఎదురు అయినా ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చే ప్రయత్నం చేస్తున్నాం. కచ్చితంగా ఇచ్చిన మాట ప్రకారం రైతుని రాజును చేశాం. రుణమాఫీని సక్రమంగా అమలు చేశాం, రైతు బంధు ఇచ్చాం. వర్షాకాలంలో సన్నాలకి బోనస్ ఇచ్చాం... యాసంగిలో కూడా ఇస్తాం. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన 8లక్షల 19వేల కోట్ల రూపాయలకు మన ప్రభుత్వం ప్రతీ నెల రూ. 6500 కోట్లు అసలు, మిత్తి కడుతూ వస్తున్నాం.

## పేదవాడికి ఏది ముందు అవసరమో అది ఇస్తున్నాం

మొదటి విడతలో ఇందిరమ్మ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 4.50లక్షల ఇళ్లు ఇవ్వడం జరుగుతుంది. ఐటిడిఎ పరిధిలో ఉన్న నియోజకవర్గాల్లో కోటా కంటే ఎక్కువ ఇళ్లు కూడా ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. గత ప్రభుత్వం చేసింది గోరంత చెప్పుకున్నది కొండంత.. మనం కొండంత చేసి గోరంత చెప్పుకుంటున్నాం. ఐ అండ్ పీఆర్ ద్వారా రూ. 1052కోట్ల రూపాయలను అసత్యపు ప్రచారానికి గత బీఆర్ఎస్ పాలకులు అక్రమంగా వినియోగించుకున్నారు. పదిహేను, పదహారు నెలల నుంచి ఏ విధమైన పాలనను మన ప్రభుత్వం అందిస్తుందో రాబోయే మూడున్నర సంవత్సరాల్లో కూడా సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి నేతృత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలు అదే విధమైన మంచి సుపరిపాలన అందిస్తారని మనవి చేస్తున్నాను అని పేర్కొన్నారు.

# చిరునోముల,మోటమర్రి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

## పాల్గొన్న తహసీల్దార్లు రాళ్లబండి రాంబాబు, అనిశెట్టి పున్నం చందర్



**బోనకల్, ఆర్గాన్ న్యూస్, మే 10 :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూభారతి చట్టం అమల్లో భాగంగా బోనకల్ మండలం లో పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులు శనివారం మండల పరిధిలోని చిరునోముల, మోటమర్రి గ్రామాలలో తహసిల్దార్ అనిశెట్టి పున్నమి చందర్ అధ్యక్షతన నిర్వహించారు.మోటమర్రి గ్రామంలో మధిర తహసిల్దార్ రాళ్లబండి రాంబాబు పాల్గొనగా, చిరునోముల గ్రామంలో బోనకల్ తాసిల్దార్ అనిశెట్టి పున్నమి చందర్ పాల్గొన్నారు. ఈ సదస్సుల లో వారు మాట్లాడుతూ చిరునోముల గ్రామంలో 85 మంది, మోటమర్రి గ్రామంలో 160 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నట్టు తెలిపారు. దరఖాస్తుదారులకు రసీదులు అందజేశామని, దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి రైతుల భూ సమస్యలకు పరిష్కారం చూపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ కర్నాటి కోటేశ్వరరావు, గిరిదావర్లు మఠం నవీన్ కుమార్,జంగగూడెం మైథిలి, రెవెన్యూ సిబ్బంది ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కొత్తగూడెంలో ఎంపీ రామసహాయం విస్తృత పర్యటన

## కాంగ్రెస్ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు



**కొత్తగూడెం, ఆర్గాన్ న్యూస్, మే 10 :** ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి శనివారం కొత్తగూడెం నియోజకవర్గంలో ముమ్మరంగా పర్యటించారు. 16వ డివిజన్ లో పాల సత్య నారాయణ రెడ్డి నానమ్మను పరామర్శించారు. ఇటీవల అస్వస్థతకు గురైన మాజీ జడ్పీటీసీ పరం జ్యోతిరావు ను పరామర్శించారు. చుంచుపల్లి లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. రైతులకు అండగా ఉంటానని అభయమిచ్చారు. బాబు క్యాంప్ కాలనీలో గొల్ల శ్రీను నివాసం వద్ద, సుజాతనగర్ మండలం రాఘవపురం గ్రామంలో నాగార్జున నివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఈ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆపరేషన్ సింధూర్‌కు ఉపాధి హామీ కూలీల సంఘీభావం

## అమర జవాన్ల ఆత్మ శాంతికి మౌనం



**కారేపల్లి, ఆర్గాన్ న్యూస్, మే 10 :** ఉగ్రవాదాన్ని అణచడానికి భారత ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ ను నిర్వహిస్తున్న సైన్యానికి కారేపల్లి మండల పరిధిలోని మాణిక్యారం గ్రామానికి చెందిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కూలీలు శనివారం పనిచేస్తున్న ప్రదేశం వద్ద జాతీయ జెండాలను చేత బట్టుకొని సంఘీభావం ప్రకటించారు జమ్ము కాశ్మీర్ లో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గోరంట్ల మండలం కల్లితండా గ్రామానికి చెందిన జవాన్ మురళీ నాయక్ మద్నూర్ మండల కేంద్రం పక్కన మహారాష్ట్ర బార్డర్ దేగ్లూర్ నగరానికి చెందిన జవాన్ సచిన్ యాదవ్ వనంజే లకు నివాళులర్పించి వారి ఆత్మ శాంతికి రెండు నిమిషాలు మౌనం పాటించి, వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు ఈ సందర్భంగా ఉపాధి హామీ సీనియర్ మేట్ కారేపల్లి మండల సీనియర్ మేట్ల సంఘం అధ్యక్షుడు భూక్యా లక్ష్మణ్ మాట్లాడుతూ ఉగ్రవాదం హేయమైన చర్య అని ఉగ్రవాదాన్ని అణచడానికి భారత సైన్యం చేస్తున్న కృషికి సెల్యూట్ చేస్తున్నామన్నారు కార్యక్రమంలో టీమ్ మేట్లు చాగంటి వెంకటేశ్వర్లు (చిన్న) పోలేపల్లి రవి భూక్యా కోటయ్య,రమేష్ ప్రసాద్ హర్దు రాంబాబు గణేష్ తరుణ్ అశోక్ సక్రు వాల్యా సైదా వాచ్య చిన్న వాచ్య ధారావత్ పాపా ఈదర కోటేశ్వరరావు పోతర్ల నాగయ్య మోతుకూరి రామారావు కునుసోత్ వెంకట్రామ్ జయమ్మ కల్పన కవిత లక్ష్మి పద్మ రాధ ఉపాధి హామీకూలీలు పాల్గొన్నారు.



# జూపెడ వరి కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసిల్దార్

**తిరుమలాయపాలెం, ఆర్గాన్ న్యూస్, మే 10:** మండలంలోని జూపాడు ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ రెవిన్యూ ఖమ్మం ఆదేశాల మేరకు శనివారం మండల తహసిల్దార్ సుధీర్ సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రైతులతో మాట్లాడుతూ అందరూ తమ ధాన్యం తప్పనిసరిగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలి మరియు కొనుగోలుకు నాణ్యత ప్రమాణాలు ఉండే విధంగా చూసుకోవాలి నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగానే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలని తెలిపారు. అదేవిధంగా కొనుగోలు కేంద్రాల నిర్వహకులు నాణ్యత ప్రమాణాలు కలిగిన రైతుల ధాన్యాన్ని వరుస క్రమంలో మిల్లులకు తరలించి చిన్న పెద్ద సన్నకారు రైతులకు సమాన అవకాశాలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి అని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐకెపి నిర్వాహకులు పలువురు రైతులు ప్రభుత్వ అధికారులు పాల్గొనడం జరిగింది.



# సింగరేణి కార్మికులకు అండగా నిలుస్తాం


- ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి
- సింగరేణి ప్రధాన కార్యాలయం సందర్శించి.. డైరెక్టర్ (పా)తో సమీక్ష

**కొత్తగూడెం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 10 :** నల్ల బంగారం వెలికితీస్తూ..శ్రమిస్తున్న సింగరేణి కార్మికులకు అండగా నిలుస్తామని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి అభయమిచ్చారు. శనివారం కొత్తగూడెం లోని సింగరేణి ప్రధాన కార్యాలయానికి వెళ్లి.. ఆ సంస్థ డైరెక్టర్ (పా) కే. వెంకటేశ్వర్లు, జీఎం, ఇతర ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో వైద్యుల కొరత లేకుండా చూడాలని, కార్మికులకు విధి నిర్వహణలో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రభుత్వ పరంగా సింగరేణికి పూర్తి సహకారం ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో.. కాంగ్రెస్ జిల్లా నాయకులు, ఐఎన్టీయూసీ నాయకులు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# వినూత్న ప్రచారం.. యువతకు సందేశం !

**తిరుమలాయపాలెం ఆర్గాన్ న్యూస్, మే 10 :** మద్యం వద్దు ఆరోగ్యం ముద్దు అంటూ సూర్యాపేట జిల్లా మద్దిరాల మండలం గోరంట్ల మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ వినూత్న ప్రచారం నిర్వహించారు మండల పరిధిలోని పిండిప్రోలు వారాంతపు సంతలో మాదకద్రవ్యాలపై శనివారం ఫ్లెక్సీలో కరపత్రాలతో యువత మేలుకో డ్రగ్స్ ను తరిమేద్దాం విజయం సాధిద్దామని కోరుతూ రద్దీ ప్రాంతాల్లో మైక్ లో ప్రచారం నిర్వహించారు యువతను సన్మార్గంలో నడిపించేందుకు తన వంతు గా జాతర జరిగే సంతాలలో ఆయా ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ తాత రవీందర్ సొంటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# 28 మందిపై రౌడీషీట్ ఎత్తివేత

## మార్పు కోసమే ఈ ప్రయత్నం : డిఎస్పీ తిరుపతి రావు

**మహబూబాబాద్, మే 10, ఆర్గాన్ న్యూస్ :** మహబూబాబాద్ డివిజన్ పరిధిలో సత్ప్రవర్తన కలిగిన ప్రశాంతవంతమైన జీవితం గడుపుతున్న 28 మంది రౌడీ షీటర్లపై రౌడీషీట్ ను మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాలమేరకు తొలగించినట్లుగా డిఎస్పీ తిరుపతి ప్రకటించారు. మహబూబాబాద్ డివిజన్ పరిధిలో సత్ప్రవర్తన కలిగిన వున్నవారిపై రౌడీ షీట్ల తొలగించపు మేళా మహబూబాబాద్ తోన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించారు. ఇందులో ప్రశాంవంతమైన జీవితంతో పాటు ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలపాలలో పాల్గోకుండా సాధారణ జీవితాన్ని గడుపుతున్న రౌడీ షీటర్లను గుర్తించి వారిపై రౌడీ షీట్ తొలగించేందుకుగాను జిల్లా పరిధిలో రౌడీషీట్ల తోలగింపు మేళాను ఏర్పాటు చేశారు .అధికారులు నెల రోజుల పాటు కసరత్తు చేసి రౌడీ షీట్ల తొలగించడం జరిగింది.సత్ప్రవర్తన కలిగిన వారిపై రౌడీ షీట్లను ఎత్తివేశామని ఎస్పీ తెలిపినట్లుగా డిఎస్పీ వివరించారు. ఈ కార్యక్రమం లో టౌన్ సీఐ దేవేందర్ డోర్నకల్ సీఐ రాజేష్ బయ్యారం సీఐ రవి ఎస్.ఐ తిరుపతి రూరల్ ఎస్.ఐ దీపిక పాల్గొన్నారు.

ప్రాంతీయం

## పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

**కరీంనగర్, ఆర్గాన్ న్యూస్, మే 10 :** రాష్ట్ర మహిళాభివృద్ధి జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హైదరాబాదులోని దుర్గాబాయి దేశ్ముఖ్ మహిళా సాంకేతిక శిక్షణ కేంద్రంలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ బాలికలు తల్లి లేదా తండ్రి కోల్పోయిన బాలికలు ఇతర కారణాలతో నిరాశ్రయులైన వారు చిల్డ్రన్ హోమ్ మహిళా సంస్థల్లో పెరిగిన బాలికలు అక్రమ రవాణాకు గురైన బాధిత బాలికలతో పాటు దివ్యాంగ బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు వివిధ కోర్సుల్లో ఉన్న 240 సీట్లలో వీరందరికీ 70శాతం సీట్లు రిజర్వ్ చేస్తారని తెలిపారు దరఖాస్తులను ఈనెల 20 చివరి తేదీ అయినప్పటికీ దరఖాస్తులను హైదరాబాద్ పంపించాల్సి ఉన్నందున ఈ నెల 16 లోగా కరీంనగర్ జిల్లా పరిషత్ కార్యాలయం రెండవ అంతస్తులోని బాలల పరిరక్షణ విభాగం కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు ఇతర వివరాలకు 9490881098 నెంబర్లలో గాని నేరుగా కార్యాలయంలో గాని సంప్రదించాలని కోరారు.

# కీలక ఖనిజాల అన్వేషణ

- విస్తృత అవకాశాలు ఉన్న ఖనిజ అన్వేషణకు సంసిద్ధంగా ఉండండి
- సంప్రదాయేతర ఇంధన వనరులలోనూ సింగరేణి సత్తా చాటాలి
- సింగరేణి భవిష్యత్తు విస్తరణపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష



**గోదావరిఖని, ఆర్గాన్ న్యూస్, మే 10 :** బొగ్గు రంగంలో అగ్రస్థానంలో ఉన్న సింగరేణి రానున్న రోజుల్లో క్రిటికల్ మినరల్స్, సంప్రదాయేతర ఇంధన వనరుల రంగంలో ప్రవేశించి తన సత్తాను చాటాలని, 136 సంవత్సరాల మైనింగ్ అనుభవాన్ని ఉపయోగించుకొని సంస్థ భవిష్యత్తుకు సుస్థిర ప్రణాళికలు రూపొందించుకోవాలనిహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సింగరేణి భవిష్యత్తు విస్తరణ ప్రాజెక్టులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్షించారు. గ్రాఫేట్, లిథియం, కాపర్ తదితర ఖనిజాలకు రానున్న రోజుల్లో మంచి డిమాండ్ ఉన్న నేపథ్యంలో వాటి అన్వేషణకై ఉన్న అవకాశాలన్నింటినీ అందిపుచ్చుకొని ముందుకు వెళ్లాలని నిర్దేశించారు. ఇందుకోసం ఇప్పటికే కన్సల్టెంట్ ఏజెన్సీలను నియమించుకొని ముందుకు వెళుతుండటంపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ విషయంలో అనుభవజ్ఞులైన అధికారుల ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటు చేసుకొని ముందుకు వెళ్లాలని సూచించారు. అలాగే సంప్రదాయేతర ఇంధన వనరుల వినియోగం పెరుగుతున్నందున సింగరేణి ప్రాంతాల్లోనూ, దేశంలోని ఇతర ప్రాంతాలలో అందుబాటులో ఉన్నహా అవకాశాల అన్వేషణకు సమగ్ర ప్రణాళికలతో ముందుకు సాగాలన్నారు. అలాగే రాజస్థాన్ తో చేసుకున్న అవగాహన ఒప్పందం మేరకు విద్యుత్,హసోలార్ ప్లాంట్ ఏర్పాట్లపై కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎనర్జీ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సింగరేణి సిఎండి ఎన్ బలరాం నాయక్, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్, సింగరేణి ఎగ్జక్యూటివ్ డైరెక్టర్ సుభాని పాల్గొన్నారు.

## అర్జీ.1 ఏరియాలో మెగా జాబ్ మేళా

- డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క ఆదేశాలతో
- జాబ్ మేళాలో పాల్గొంటున్న 100 ప్రైవేట్ కంపెనీలు
- ఆర్జీ 1 జిఎం డి. లలిత్ కుమార్



**గోదావరిఖని,ఆర్గాన్ న్యూస్, మే 10 :** గోదావరిఖని మరియు పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశములు కల్పించుటకు తెలంగాణా రాష్ట్ర డిప్యూటి సిఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశానుసారం - సింగరేణి సిఎం.డి ఎన్. బలరాం సూచనల మేరకు రామగుండం ఏరియ వన్ లో 18.మే 2025, ఆదివారం రోజున "మెగా జాబ్ మేళా" కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించుటకు ఈరోజు ఆర్జీ 1 జిఎం డి.లలిత్‌కుమార్ అధ్యక్షతన సమావేశ హాలు నందు ఉన్నత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించటం జరిగింది. ఈ సందర్భంగా జియం తెలియజేస్తూ తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనలో భాగంగా తలపెట్టిన "మెగా జాబ్ మేళా" కార్యక్రమానికి తేది.18మే2025, ఆదివారం రోజున నిర్వహించుటకు సంబందించిన పనుల గురించి, చేపట్టవలసిన ప్రణాళికల గురించి అధికారులతో సమీక్షా నిర్వహిచడం జరిగింది. ఇట్టి "జాబ్ మేళా" కు సంబందించి హైదరాబాదుకు చెందిన 80 నుండి 100 ప్రైవేటు కంపెనీలు పాల్గొనటం జరుగుతుందని తెలిపారు. ఈ కంపెనీలలో వివిధ రకాల ఉద్యోగ అవకాశాలకు సంబందించి కంపెనీల యొక్క ప్రతినిధులు పాల్గొనటం జరుగుతుందని తెలిపారు. ఇట్టి కంపెనీలలో పని చేయుటకు ఆసక్తి అర్హత కలిగిన నిరుద్యోగ యువతను ఎంపిక చేసి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించుటకు త్వరలో ఇంటర్వ్యు ఆధారంగా ఎంపిక చేసి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతందని తెలిపారు. ఇట్టి "మెగా జాబ్ మేళా" నిర్వహణకు సంబందించిన అన్ని రకాల వసతులు, ఏర్పాట్లను పకడ్బందింగా నిర్వహించాలని ఎక్కడ కూడా ఇబ్బందులు కలుగకుండా సజావుగా జరుగు విధంగా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని జియం శ్రీ లలిత్ కుమార్ గారు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారి చేసారు. కావున ఆసక్తి గల నిరుద్యోగ యువతి యువకులు పదవ తరగతి లోపు లేదా పదవ తరగతి నుండి పిజి, సాంకేతిక విద్య మరియు ఇతర పై చదువులు చదివిన వారు 2 పాస్ పోర్ట్ సైజ్ పొటోలు, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాఫిలతో అర్జీ .1 జివిటిసి నందు తేది.16.05.2025 లోపు ధరఖాస్తులను స్వయంగా అందజేయగలరని జియం గారు తెలియజేసారు. ఇతర వివరాలకు సెల్ నెం. 9491144252 నెంబరుకు సంప్రదించగలరు. ఈ కార్యక్రమంలో డిజియం పర్సనల్ కిరణ్ బాబు, అధికారులు ఆంజనేయులు, శివ నారాయణ, కర్ణ, వర ప్రసాద్, డాక్టర్ అంబిక, రవీందర్ రెడ్డి, లక్ష్మి రాజం, ధనలక్ష్మి బాయి, శ్రావణ్ కుమార్, అశోక్ రావు, రాజేశ్వర్ రావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బాంబు స్క్వాడ్ బృందాల తనిఖీలు

- కలత చెందుతున్న కార్మిక క్షేత్ర వాసులు
- ప్రజల రద్దీ గల ముఖ్యమైన ప్రదేశాలలో బాంబు స్క్వాడ్ బృందాల తనిఖీలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్



**గోదావరిఖని, ఆర్గాన్ న్యూస్, మే 10 :** భారత సరిహద్దు లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ, పెద్దపెల్లి డిసిపి కరుణాకర్ ఆదేశాల మేరకు గోదావరిఖని ఏసిపి యం రమేష్ పర్యవేక్షణలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేన రెడ్డి ఆధ్వర్యంలో గోదావరిఖని వన్ టౌన్ పరిధిలో గల గోదావరిఖని బస్టాండ్ , మెడికల్ కళాశాల, హాస్పిటల్, సింగరేణి ఏరియా హాస్పిటల్, జిఎం ఆఫీస్, కోర్ట్ పరిసరాలు మరియు ముఖ్యగా ఎక్కువ జన సంచారం తో రద్దీగా ఉండే ప్రాంతాలలో బాంబు డిస్పోజల్ టీమ్ మరియు డాగ్స్ స్క్వాడ్ బృందాలతో లగేజ్ మరియు పార్సిల్ లను, బ్యాగ్ లను తనిఖీలు నిర్వహించడం జరిగింది. ఇప్పటివరకు గోదావరిఖని చరిత్రలో ఏనాడు కూడా బాంబ్స్ కాగిలా తనిఖీలు ముంబానంగా చేపట్టకపోవడంతో ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పడం వల్ల ప్రజలు ఒక రకమైన కలత కలవరం మొదలైంది కానీ రామగుండం పోలీస్ కమిషనర్ అప్పుడు ముందస్తు బంధవస్తులో భాగంగా ఈ తనిఖీలు చేపట్టడం ఒక ప్రధాన చర్చిని అంశమైంది. ఇట్టి తనిఖీలలో గోదావరిఖని ఏసిపి ఏం రమేష్ మరియు వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి స్వయంగా పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఏసీపి మాట్లాడుతూ... ప్రజల రక్షణ, భద్రత చర్యలలో భాగంగా డాగ్ మరియు బాంబు స్క్వాడ్ లతో తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులను గమనిస్తే, వస్తువులు కనిపిస్తే, సందేహాస్పదంగా ఉన్న వాహనాల సమాచారాన్ని పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వాలని అన్నారు. భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని ఏసీపి తెలిపారు. ఇట్టి తనిఖీ లలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు భూమేష్ రమేష్ శ్రీనివాసులు, కోటేశ్వర్, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## పార్టీ సంస్థాగత నిర్మాణానికి పాటుపడదాం

- బీజేపీ జిల్లా సంఘటన-సంరచన ప్రభారీ పాపారావు పిలుపు
- జిల్లా అధ్యక్షులు కోటేశ్వరరావుతో కలిసి సమావేశం

**ఖమ్మం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 10:** భారతీయ జనత పార్టీ సంస్థగత నిర్మాణానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేద్దామని ఆ పార్టీ జిల్లా సంఘటన సంరచన ప్రభారీ పొనుగోడు పాపారావు పిలుపునిచ్చారు. బీజేపీ సంఘటన-సంరచన కార్యక్రమం పార్టీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు అధ్యక్షతన శనివారం ఖమ్మం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి పాపారావు ముఖ్య అతిధిగా హాజరై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసారు. దేశంలో బీజేపీ నేతృత్వంలో ఇప్పటికే చారిత్రాత్మక కార్యక్రమాలు జరుగుతున్నాయని, ఆపరేషన్ సిందూర్ అందుకు నిదర్శనం అన్నారు. దేశ అభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోడీ సంరచన నిర్వహిస్తున్నారని, ఆయనను ఆదర్శంగా తీసుకొని పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని కోరారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పని చేసి నియోజకవర్గ, మండల కమిటీలతో పాటు బూతు లెవల్ కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని, తద్వారా రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఈవీ. రమేష్ సన్నే ఉదయ్ ప్రతాప్ ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గం లోని అన్ని మండలాల అధ్యక్షులు ముఖ్య నేతలు తదితరులు పాల్గొన్నారు.



## శిక్షలు పడినప్పుడే, ప్రజలలో పోలీసులపై నమ్మకం పెరుగుతుంది

- యన్.బి.డబ్ల్యూ ఎగ్జిక్యూషన్ పై దృష్టి సారించాలి
- ఎన్.డి.పి.యస్ కేసులలో నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడేలా చూడాలి
- కోర్టు డ్యూటీ అధికారులకు పలు సూచనలు చేసిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే10 :** సంగారెడ్డిలో శనివారం నాడు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం, కోర్టు డ్యూటీ అధికారులతో సమీక్ష నిర్వహించారు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి కేసులో నిందితులకు శిక్ష పడే విధంగా చూడాలని తప్పు చేసిన వారు చట్టం నుండి తప్పించుకోవడానికి వీలులేదని న్యాయస్థానం ముందు నిందితులకు శిక్ష పడినప్పుడే ప్రజలలో పోలీసులపై నమ్మకం పెరుగుతుంది అన్నారు. చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్స్ ఎగ్జిక్యూట్ చేయాలని అన్నారు. ముఖ్యంగా ఎన్.డి.పి.యస్ కేసులలో నిందితులకు తప్పనిసరిగా శిక్ష పడేలా చూడాలని అన్నారు. సైబర్ నేరాలకు సంభందించి హోల్డ్ చేయబడిన డబ్బులు బాధితులకు అందేవిధంగా సంభందిత బ్యాంక్ లకు ఆదేశాలు జారీ చేసేవిధంగా చూడాలని అన్నారు. ఈ నెల 14వ తేది వరకు జరగనున్న స్పెషల్ లోక్ అదాలత్ నందు రాజి కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్నీ కేసులలో కక్షిదారులు రాజీ కుదుర్చుకునేల చూడాలని అన్నారు. కోర్ట్ డ్యూటీ అధికారులు ఇటు పోలీసు శాఖకు అటు న్యాయ శాఖకు వారధిగా ఉంటూ కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్ నందు జిల్లాను మొదటి వరుసలో ఉంచాలని అన్నారు. సమావేశం నందు అదనపు ఎస్పీ శ్రీనివాస్ రావ్ డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ రమేష్ కోర్ట్ లైజనింగ్ అధికారి సత్యనారాయణ డీసీఆర్బీ సిబ్బంది కోర్ట్ డ్యూటీ అధికారులు తదితరులు ఉన్నారు.

## దశాబ్ది ఉత్సవాలు.. ఉత్సాహంగా సాగిన నడక పోటీలు



**బెల్లంపల్లి, ఆర్గాన్ న్యూస్, మే 10 :** తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని పాత బెల్లంపల్లిలోని నీలగిరి ప్లాంటేషన్లో శనివారం ఐదు కిలోమీటర్ల నడక పోటీలు నిర్వహించారు. వనంలో మనం.. ఆరోగ్యం కోసం నడక అనే పిలుపుతో అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సాగిన ఈ పోటీలను కాగజ్ నగర్ డివిజనల్ మేనేజర్ శ్రీ శ్రావణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పచ్చని చెట్ల మధ్య నడక పోటీలో ఆరోగ్యంతో పాటు మానసిక ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. ఈ నడక పోటీలకు పాత బెల్లంపల్లి సోమ గూడెం ప్రాంతాలకు చెందిన వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ నడక పోటీలలో ఎస్ కిరణ్ ప్రథమ స్థానం, సిహెచ్ అఖిల్ ద్వితీయ స్థానం, జంపన్ తిరుపతి తృతీయ స్థానం విజేతలుగా నిలిచారు. పోటీల్లో ప్లాంటేషన్ మేనేజర్లు బి సునీత బెల్లంపల్లి రేంజ్, గోగు సురేష్ కుమార్ మంచిర్యాల రేంజ్, ఎడ్ల లక్ష్మణ్ కాగజ్నగర్ రేంజ్, డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ జె సురేష్, పాత బెల్లంపల్లి మాజీ సర్పంచ్ జయ రామస్వామి స్థానిక పెద్దలు కందుల సదానందం, మేకల పవన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఇన్స్పెక్టర్ వెంకన్నను మర్యాద పూర్వకంగా కలిసిన బీ.పి నాయక్



**ఆర్గాన్ న్యూస్ బోనకల్ :** ఇటీవల బోనకల్ ఎస్ హెచ్ ఓ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన పొదిలి వెంకన్న ను బోనకల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బీపీ నాయక్ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పలు సమస్యలపై పోలీస్ స్టేషన్ కి వచ్చే బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని కోరారు. అనంతరం బీపీ నాయక్ చేస్తున్న సామాజిక కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్న వెంకన్న బీపీ నాయక్ ను అభినందించారు.

## మన్నెంపల్లి చిరుతల కళాకారుల ప్రపంచ రికార్డు ప్రదర్శన

- వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గ్రామ కీర్తి
- కళాకారులను సత్కరించిన మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్



**మానకొండూర్, ఆర్గాన్ న్యూస్, మే 10:** తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి గ్రామానికి చెందిన 15మంది చిరుతల కళాకారులు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఇంటర్నేషనల్ ప్రదర్శనలో పాల్గొని గ్రామ కీర్తిని చాటారు గురువారం జరిగిన ఈ ప్రదర్శనలో రాష్ట్రవ్యాప్తంగా 600మంది కళాకారులు పాల్గొనగా మన్నెంపల్లి కళాకారులు తమ ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షించారు శనివారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కళాకారులను మాజీ ఉపసర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ శాలువాలతో సత్కరించి అభినందించారు ప్రాచీన కళల సంరక్షణ కళాకారుల గుర్తింపు కోసం తనవంతు సాయం అందిస్తానని హామీ ఇచ్చారు అనంతరం కళాకారులు అనిల్ గౌడ్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కళాకారులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## పలు కార్యక్రమాలలో మాజీ ఎమ్మెల్యే కందాళ

**తిరుమలయపాలెం, ఆర్గాన్ న్యూస్, మే 10 :** పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి తిరుమలాయపాలెం మండలంలో జరిగిన పలు కార్యక్రమాలకు హాజరయ్యారు. గతంలో కాకరవాయి గ్రామంలో నిర్మిస్తున్న కాటమయ్య గుడి నిర్మాణానికి, ఆయన ఐదు లక్షలు విరాళాలు అందజేయగా, ఇటీవల కాలంలో గుడి నిర్మాణం పూర్తి కావడంతో,గుడి ప్రారంభానికి గౌడ కులస్తులు ఉపేందర్ రెడ్డి ని ఆహ్వానించరు. సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి, గుడిని ప్రారంభించి పూజలో పాల్గొన్నారు. గ్రామంలో కాటమయ్య గుడి ప్రారంభం కావడంతో గౌడ కులస్తులు పండుగను వైభవంగా జరుపుకుంటున్నారు. అనంతరం ఇటీవల కాలంలో రఘునాధపాలెం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గౌని మల్లయ్య మాతృమూర్తి పరమపదించగా, వారి నివాసానికి వెళ్లి ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు భాష బోయిన వీరన్న, ఉపాధ్యక్షుడు బానోత్ రవి (ఆర్మీ రవి), మండల నాయకులు కొప్పుల ఉపేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మంచా నాయక్, మాజీ సర్పంచ్ లు, లంజపల్లి వెంకన్న, వీరబోయిన శ్రీను, సంకీర్తన రెడ్డి, షేక్ చందు, నరేందర్ రెడ్డి,మాడుకొండ రాజా, మాజీ ఎంపీటీసీ వాలురి ప్రసాద్ రావు, మాజీ సర్పంచ్ జోగుపర్తి వెంకటేశ్వర్లు, బొల్ల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## టీ.జీ.ఆర్.జెసి ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన డిఆర్ఓ



**కరీంనగర్, ఆర్గాన్ న్యూస్, మే 10 :** కరీంనగర్ జిల్లాలోని పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో శనివారం తెలంగాణ రాష్ట్ర గురుకుల జూనియర్ కళాశాల ప్రవేశ పరీక్ష జరిగింది వివేకానంద విద్యానికేతన్ లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర గురుకుల జూనియర్ కళాశాలల ప్రవేశ పరీక్ష కేంద్రాన్ని జిల్లా రెవిన్యూ అధికారి వెంకటేశ్వర్లు సందర్శించారు ప్రవేశ పరీక్ష పై తీసుకున్న చర్యల గురించి విద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు తెలంగాణ రాష్ట్ర గురుకుల జూనియర్ కళాశాలలు ఉండగా 360 సీట్లు ఉన్నాయి 8,400 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాశారు డిఆర్ఓ వెంట అసిస్టెంట్ ఎగ్జామినేషన్ కమిషనర్ సంధ్య ఉన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

### మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు

**నేలకొండపల్లి,ఆర్గాన్ న్యూస్, మే 10 :** నేలకొండపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు. వివిధ గ్రామాల లబ్ధిదారులు మొత్తం 51 మందికి సుమారు16 లక్షలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న పలు అభివృద్ధి పథకాలు ప్రజలందరికి దక్కేల కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపడుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు అన్నారు.. రాబోయే కాలంలో ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు చేపడుతుందని రాబోయే పంచాయతీ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కాంగ్రెస్ పార్టీ చేపట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకపోవాలని పిలుపునిచ్చారు. అదే కాకుండా ప్రతి కార్యకర్త ఒక సైనికునిగా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బచ్చలకూరి నాగరాజు, బొడ్డు బొందయ్య, మామిడి వెంకన్న, ఎస్కే మదర్, కొత్తపల్లి సుబ్బయ్య, కొర్లకుంట నాగేశ్వరావు ఎస్కే సుభాన్ ఆరికట్ల గురవయ్య కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమమే ఐజెయు లక్ష్యం



**వనపర్తి, ఆర్గాన్ న్యూస్ ప్రతినిధి, మే 10 :** తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమం కోసం టి యు డబ్ల్యూ జే (ఐజేయు) రాష్ట్రంలోని అతిపెద్ద జర్నలిస్టు యూనియన్ పెద్దపీట వేస్తూ ముందుకు సాగుతుంది. దాదాపు 67 సంవత్సరాల చరిత్ర కలిగిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ సుదీర్ఘకాలం జర్నలిస్టుల సమస్యలపై రాజీలేని పోరాటాలు కొనసాగిస్తూ జర్నలిస్టుల హక్కులను డిమాండ్లను సాధించుకోవడంలో ముందంజలో ఉంది. తెలంగాణ రాష్ట్రంలో విడతలవారీగా ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమానికి మంజూరు చేసిన 42 వేల కోట్ల రూపాయలకు బ్యాంకుల నుంచి వస్తున్న వడ్డీని జర్నలిస్టుల కుటుంబాలకు ఖర్చు చేయడం విశేషం. ఫిక్స్ డిపాజిట్ ద్వారా జర్నలిస్టుల సంక్షేమ నిధి వడ్డీ డబ్బులను దాదాపు ఇప్పటివరకు 22 కోట్ల రూపాయలను వివిధ కారణాల చేత విధి నిర్వహణలో మరణించిన జర్నలిస్టు కుటుంబాలు వివిధ ప్రమాదాలతో గాయపడ్డ కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించడమే కాక మరణించిన జర్నలిస్టు కుటుంబంలో భార్యకు నెలకు 3,000 పెన్షన్ ఐదు సంవత్సరాల పాటు చెల్లిస్తూ జర్నలిస్టుల పిల్లలకు ట్యూషన్ ఫీజు కింద ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు నెలకు వెయ్యి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించడం టి యు డబ్ల్యూ జె (ఐ జే యు) అంతిమ లక్ష్యంగా పనిచేయడం జర్నలిస్టు కుటుంబాలలో వెలుగులు నింపుతుంది.

### మధు సేవలు మరువలేనివి

తెలంగాణ టియుడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు విరాసత్ అలీ ఆదేశాల మేరకు రాష్ట్ర కార్యదర్శి గుంద్రాతి మధు గౌడ్ రాష్ట్రంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు బాధ్యతగా భరోసా కల్పిస్తూ ధైర్యాన్ని నింపడంలో ఆయన కృషి పలువురు జర్నలిస్టులు అభినందిస్తున్నారు. గత పది సంవత్సరాల నుంచి జర్నలిస్టుల సమస్యలు మరుగున పడిపోయాయని ఇటీవల రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత అసెంబ్లీ ఎన్నికల్లో జర్నలిస్టుల సమస్యలను ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టినప్పటికీ ఇప్పటికీ అమలు చేయకపోవడం వల్ల టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాసత్ఆలీ.తో పాటు రాష్ట్ర కార్యదర్శి గుంద్రాతి మధు గౌడ్ శక్తి వంచన లేకుండా కృషి చేస్తూ తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి సమక్షంలో రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో పలు జర్నలిస్టు సమస్యలపై చర్చించారు. అంతే కాదు రాష్ట్రంలో దాదాపు 38 మంది జర్నలిస్టు కుటుంబాలు ఇటీవల వివిధ కారణాల చేత మరణించడం, కొంతమంది జర్నలిస్టులు అనారోగ్యాలకు గురైన కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేయించడంలో టియుడబ్ల్యూజే యూనియన్ పాత్ర కీలకం ముఖ్యంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పడి 16 నెలల సమయం గడిచినా కూడా జర్నలిస్టుల న్యాయమైన సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి దృష్టికి యూనియన్ నాయకులు తీసుకపోవడం హర్షించదగ్గ విషయం.

### సమస్యల గొంగళి

రాష్ట్రంలో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులను ఇప్పటివరకు ఇవ్వకపోవడం గతంలో ఉన్న కార్డులను రెన్యువల్ పేరుతో కాలయాపన చేస్తున్నారని అదేవిధంగా అర్హులైన జర్నలిస్టు కుటుంబాలకు ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు మంజూరు చేయాలని మంత్రి దృష్టికి తీసుకపోవడం జరిగింది. తెలంగాణ ప్రెస్అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పై మంత్రికి వినతి పత్రాన్ని కూడా ఇచ్చారు. నేటి సమాజంలో జర్నలిస్టుల వృత్తి అత్యంత కీలకమైనప్పటికీ గత ప్రభుత్వాల అసమర్థత వల్ల జర్నలిస్టుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ప్రాణాలను లెక్కచేయకుండా తమ వృత్తి ధర్మాన్ని న్యాయంగా జీతభత్యాలు లేకుండా నిర్వర్తిస్తూ ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉన్నది ఉన్నట్లు లేనిది లేనట్లు పత్రికల ద్వారా టీవీ ప్రసారాల ద్వారా తెలియజేయడంలో జర్నలిస్టుల పాత్ర ప్రశంసనీయం ముఖ్యంగా గ్రామీణ మండల కేంద్రాలలో నియోజకవర్గాలలో పనిచేస్తున్న జర్నలిస్టులు అనేక ఆటుపోటులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అలాంటి జర్నలిస్టుల ను ఆదుకోవడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్) ఈ రాష్ట్రంలో ఏకైక జర్నలిస్ట్ యూనియన్ గా పేరు పొందుతుంది. ఎంతోమంది జర్నలిస్టులు ఆణిముత్యాలుగా పనిచేస్తూ తమ జీవితాలను తమ వృత్తికి అంకితం చేస్తున్న జర్నలిస్టుల పట్ల మానవత దృక్పథంతో ఆదుకోవడంలో జర్నలిస్టు సంఘం (ఐ జేయు) కే దక్కింది.

### ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఇప్పటివరకు 12 మంది జర్నలిస్టులకు ఆర్థిక సహాయం రాష్ట్ర కార్యదర్శి మధు గౌడు కృషి పట్టుదల తో ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవడం విశేషం. దశాబ్దాల కాలం నుంచి జర్నలిస్టుల పై జరుగుతున్న దాడులకు అరికట్టేందుకు నిరోధక హై పవర్ కమిటీ తో పాటు వర్కింగ్ జర్నలిస్ట్ వెల్ఫేర్ ఫండ్ కమిటీ . వెజ్ బోర్డు సిఫారసులను పర్యవేక్షించే త్రైమాక్షిక కమిటీని తక్షణమే ఏర్పాటు చేయాలని యూనియన్ నాయకులు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయారు. దేశంలో ఇతర రాష్ట్రాలలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో ఐజేయు యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు అద్భుతంగా అమలవుతున్నాయి. అందువల్లనే తెలంగాణ లో జర్నలిస్టుల సంక్షేమం బేష్ గా ఉందని చెప్పవచ్చు.

### మీకోసం మేమున్నాం

హైదరాబాదులో రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేతులు మీదుగా ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ఐజెయు అధ్యక్షులు విరాసత్ అలీ. ప్రధాన కార్యదర్శి కె .రామ్ నారాయణ .రాష్ట్ర కార్యదర్శి గుంద్రాతి మధు గౌడ్. శ్రీకాంత్ రెడ్డి. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేష్ చిన్న మధ్యతరహా పత్రికల సంఘం అధ్యక్షులు యూసుఫ్ బాబు. తదితర జర్నలిస్ట్ బృందం కలిసి జర్నలిస్టు కుటుంబాలకు ఆర్థిక సహాయం చెక్కులను పంపిణీ చేశారు. అనుక్షణం మీకోసం మేమున్నాం అంటూ తెలంగాణ ఐ జెయూ జర్నలిస్టు సంఘం జర్నలిస్టుల కష్టాలలో నష్టాలను తెలుసుకొని పరిష్కరించడంలో తమకంటూ చాటిలేరని ముందుకు సాగడం గర్వించదగ్గ విషయం ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు రాబోయే రోజుల్లో జర్నలిస్టుల కోసం టి యు డబ్ల్యూ (జేఐయు) కృషి చేయాలని తెలంగాణలోని జర్నలిస్టు లోకం కోరుకుంటుంది.



## ఘనంగా శివ కేశవ ఆలయం 25వ వార్షికోత్సవ వేడుకలు

**మందమర్రి, ఆర్గాన్ న్యూస్, మే 10 :** మందమర్రి పట్టణ అంగడి బజార్ లోని శ్రీశ్రీశ్రీ శివ కేశవ సంజీవ ఆంజనేయ స్వామి దేవాలయ రజితోత్సవ వేడుకలు అత్యంత ఘనంగా భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. శివ కేశవ సంజీవ ఆంజనేయ స్వామి దేవాలయ 25 వ వార్షికోత్సవ ఉత్సవాలను శుక్రవారం నుండి శనివారం వరకు అత్యంత వైభవంగ నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు దిలీప్ శుక్ల శర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ శ్రీ శ్రీ శ్రీ శివ కేశవ సంజీవ ఆంజనేయ స్వామి దేవాలయం యొక్క 25 వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 9వ తేదీ నుంచి పదవ తేదీ వరకు నిర్వహించడం జరిగిందని ప్రతిరోజు ప్రత్యేక పూజలు కార్యక్రమాలు నిర్వహిస్తూ అనంతరం మహా అన్నప్రసాద వితరణ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈనాటి ఆలయ రజితోత్సవ ఉత్సవ వేడుకలకు హాజరైన భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించామని, భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు అయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించిన ఆలయ కమిటీకి, భక్తులకు శుభాభివందనాలు తెలియజేశారు.



## చట్టాలపై అవగాహన సదస్సు

- తెలంగాణ న్యాయవాదుల కోసం
- భారతీయ అడ్వకేట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజనాలు

**మంచిర్యాల, ఆర్గాన్ న్యూస్, మే 10 :** మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ స్టేట్ లెవెల్ ప్రొఫెషనల్ క్లాస్సెస్ ఫర్ అడ్వకేట్స్ కార్యక్రమాన్ని శనివారం రోజున మంచిర్యాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమం మే 10 ,11 రెండు రోజులు తెలంగాణ న్యాయవాదుల కోసం, చట్టాలపై వారికి అవగాహన క్లాసులు నిర్వహించడం కోసం మంచిర్యాల లోని సుచిత్ర ఫంక్షన్ హాల్ లో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ స్టేట్ ఇంచార్జ్ కొలిపాక సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. దీనిలో భాగంగా అన్ని జిల్లాల న్యాయవాదులు పాల్గొనడం జరిగింది. భారతీయ అడ్వకేట్స్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు.తధానంతరం అదిలాబాద్ జిల్లా జడ్జి ప్రభాకర్ రావు కి ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా బార్ ప్రెసిడెంట్ జగన్ వైస్ ప్రెసిడెంట్ భుజంగరావు శైలజ ఏమాజీ రాజేష్ గౌడ్ రంజిత్ గౌడ్ రమేష్ మల్లారెడ్డి దత్తాత్రేయ తిరుపతి రవీందర్ ప్రదీప్ చంద్ర రాంభౌ అలేఖ్య నటేశ్వర్ శ్రీకాంత్ తదితర సీనియర్ జూనియర్ మహిళ న్యాయవాదులు పాల్గొన్నారు.




## పద్మశాలి సంఘం సభ్యత్వ నమోదు

**మందమర్రి, ఆర్గాన్ న్యూస్, మే 10:** మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణం మార్కెట్ ప్రాంతంలో గల పద్మశాలి సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. గత అధ్యక్ష పదవి కాలం ముగిసిన సందర్భంగా మరల అధ్యక్ష ఎన్నికల కొరకై ప్రణాళిక సిద్ధం చేయుట కొరకు పద్మశాలి కుల బాంధవుల, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అడహాక్ కమిటీ ఏర్పాటు చేశారు. ప్రస్తుత ఆడ హాక్ కమిటీ ఆధ్వర్యంలో మార్కెట్ ప్రాంతంలోని అన్ని వార్డులలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా మార్కెట్ ఏరియా లోనీ వ్యాపార సముదాయాలలో గల పద్మశాలి కుల బాంధవులను కలిసి వారి యొక్క సభ్యత్వ నమోదును కమిటీ సభ్యులు చేపట్టారు. కమిటీ సభ్యులు పిట్టల సుధాకర్, బత్తుల సతీష్ బాబు మాట్లాడుతూ కుల సభ్యులు ఎవరైనా ఇంకా సభ్యత్వ నమోదు చేసుకోనట్లయితే మార్కెట్ ప్రాంతంలో గల కళ్యాణ్ సూపర్ మార్కెట్ వద్ద నమోదు చేసుకో గలరనీ తెలిపారు. అధ్యక్ష పదవి ఎన్నిక కొరకు తేదీ త్వరలో ఖరారు చేస్తామని ఈలోగా సభ్యత్వ నమోదు కార్యక్రమం పూర్తి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన వ్యాపారి

- నమ్మించారు.. ఖాతా ఖాళి చేశారు
- అపరిచిత కాల్స్ ద్వారా రూ.96,482 నష్టం




**ఆర్గాన్ న్యూస్, మందమర్రి, మే 10 :** సైబర్ నేరగాల చేతిలో ఓ వ్యాపారి భారీగా నష్టపోయాడు. వ్యాపారికి సైబర్ నేరగాళ్లు పదేపదే చరవాణి ద్వారా సంప్రదింపులు జరపగా, వారి మాయలో పడి వారిని అనుసరించిన సదరు వ్యాపారి నష్టాన్ని చదివి చూశాడు. ప్రతిరోజూ ఎక్కడో చోట సైబర్ మోసానికి ఎవరో ఒకరు బలవుతూనే ఉన్నారు. సైబర్ మోసాలపై అవగాహన కొంచెం ఉన్న ఏమరపాటు నిర్లక్ష్యంతో డబ్బులు పోతా ఉంటాయి. ఈ తరహా మోసాలపై ప్రజల్లో ఒకింత అవగాహన తక్కువగా ఉండటంతో ఎవరో ఒకరు బలవుతూనే ఉన్నారు. వివరాల్లోకి వెళితే... ఈ నెల 7వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు ఒక ట్రేడర్స్ ఓనర్ కి ఫోన్ చేసి మాకు 25 రేకులు కావాలి మరుసటి రోజున పంపాలి అన్నారు , మళ్ళీ మే 8 రోజున ఫోన్ చేసి రేకులు అమౌంట్ పంపుతాము అని వాట్సాప్ ద్వారా ఒక స్కానర్ పంపి ఒక రూపాయి పంపమన్నారు. పంపిన తర్వాత రెండు రూపాయలు వచ్చాయి, ఇలాగే మీకు రేకుల అమౌంట్ మొత్తము వస్తాయని ఇది ఆర్మీ మిషన్ అని ఆర్మీ వాళ్ళ ద్వారా డబ్బులు వస్తాయని రెండు మూడు లింకులు పంపి వాటిని ఓపెన్ చేయమని చెప్పినారు, దానికి ట్రేడర్స్ ఓనర్ ఓపెన్ చేసినాడు తర్వాత ఎలాంటి డబ్బులు రిటన్ రాకపోవడంతో, తన అకౌంట్ నుండి డబ్బులు పోయినట్టు మెసేజ్లు రావడంతో తాను సైబర్ క్రైమ్ మోసానికి గురైనట్టు ఆ వ్యాపారి గ్రహించి, 1930 సైబర్ క్రైమ్ నెంబర్ కు ఫోన్ చేసి వెంటనే ఫిర్యాదు చేయగా, ప్రాథమిక దర్యాప్తు అనంతరం ప్రకారం ఈరోజు కేసు నమోదు చేసినట్టు మందమరి ఎస్సై రాజశేఖర్ తెలిపారు.

**పోలీసుల సూచనలు**

- స్పందించే ముందు సమాచారాన్ని ధృవీకరించుకోవాలి.
- అనుమానాస్పద లింకులను క్లిక్ చేయరాదు.
- నగదు లావాదేవీలను బ్యాంకుల ద్వారా నిర్ధరించుకోవాలి.
- అనుమానాస్పద కాల్స్ మరియు నెంబర్లపై సైబర్ క్రైమ్ పోర్టల్ ద్వారా రిపోర్ట్ చేయాలి.
- అధిక రాబడి పతకల పట్ల జాగ్రత్తగా ఉండాలి.
- కేవైసీని వ్యక్తిగతంగా అప్డేట్ చేయాలి.
- వ్యక్తిగత వివరాలను ఎవరితో పంచుకోవద్దు.
- సైబర్ క్రైమ్ బారిన పడినట్లయితే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.



## ముగిసిన సబ్ జూనియర్ నెట్ బాల్ సెలక్షన్స్

**నాగార్జున సాగర్, ఆర్గాన్ న్యూస్, మే 10 :** నాగార్జునసాగర్ హిల్ కాలనీ సెయింట్ జోసెఫ్ హై స్కూల్ లో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ నెట్ బాల్ సెలక్షన్స్ ఈరోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యా యి .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు రామకృష్ణారెడ్డి , కాంగ్రెస్ పార్టీ ఓబిసి నాయకులు ఉంగరాల శ్రీనివాస్ పాల్గొని సెయింట్ జోసెఫ్ అఫ్ హై స్కూల్ హెచ్ఎం సిస్టర్ లలిత తో కలిసి ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి సబ్ జూనియర్ నెట్ బాల్ సెలక్షన్స్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు విద్యతో పాటు క్రీడల్లో కూడా రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని కోరారు. నల్లగొండ జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ జె కిరణ్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన నెట్ బాల్ సెలక్షన్స్ కు 80 మంది క్రీడాకారులు హాజరుకాగా వారిలో నుంచి అండర్ 16 బాలికల విభాగంలో జే సుప్లవి రాజ్, ఎండి సభానూర్, బి కీర్తన, బి మహేశ్వరి, ఎస్కే రిజ్వానా, బి కరుణ, ఎస్.కె మహేకె, జె దీక్షిత, ఆర్ సింధు, ఏ ఐశ్వర్య, సింధు, పూజ బాలుర విభాగంలో పృధ్విరాజ్, వెంకట సాయి, నిఖిలేష్, నజీ ర్ ,మధు, చైతన్య, సత్యసాయి, కళ్యాణ్, సాత్విక్, కమల్ తేజ్, కృష్ణ ,బాలు నల్లగొండ జిల్లా స్థాయి సబ్ జూనియర్ నెట్ బాల్ కు సెలెక్ట్ అయ్యారని, సెలెక్ట్ అయిన క్రీడాకారులు ఈ నెల 16, 17, 18 తేదీలలో జనగాం జిల్లా బతుకమ్మ కుంట క్రీడా మైదానంలో జరిగే స్టేట్ లెవెల్ సబ్ జూనియర్ పోటీలలో పాల్గొంటారని ఉమ్మడి నల్లగొండ జిల్లా నెట్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ జె కిరణ్ కుమార్ తెలిపారు.

## ప్రజా సమస్యలపై 17న కార్పొరేషన్ ముట్టడి

- సంవత్సరాలు గడుస్తున్నా హామీలు అమలు పరచడం లేదు
- సిపిఎం నగర కార్యదర్శి వై విక్రమ్



**ఖమ్మం ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 10 :** కొన్ని సంవత్సరాలుగా పేదలకు కొత్త పెన్షన్లు , రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు ఇవ్వడం రాష్ట్ర ప్రభుత్వం మర్చిపోయింది అని, పోరాటాలు చేస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ తెలిపారు. శనివారం ఖమ్మం అర్బన్ మండల కమిటీ సమావేశం సుందరయ్య భవన్ లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ప్రధానమైన రోడ్లు ఎన్ ఎస్ టీ రోడ్, పి ఎస్ టీ రోడ్, రైల్వే స్టేషన్ రోడ్, డిపో రోడ్, ఖిల్లా రోడ్ తదితర ప్రధానమైన రోడ్లు విస్తరణకు కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు అని, రహదారులు ఇరుకు కావడంతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు బాగా పెరిగాయని విమర్శించారు. పారిశుద్ధ్యం, స్మశాన వాటికలు, వీధిలైట్లు, డ్రైనేజీ వ్యవస్థ, బస్తీ దవాఖానాలు, వంతెన లు, కోతుల, కుక్కల బెడద తదితర ప్రజా సమస్యలు ప్రజలను తీవ్ర ఇబ్బంది పెడుతున్నాయి అని ఆరోపించారు. ఖమ్మం శివారు ప్రాంతాల్లో అభివృద్ధి కి తగిన నిధులు కేటాయింపులో అధికారులు నిర్లక్ష్యంగా వున్నారు అని విమర్శిస్తున్నారు. ఖమ్మం నగరంలో ప్రజా సమస్యలపై సర్వేలు నిర్వహించి ఈ నెల 17న ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయాన్ని వేలాది మంది లబ్దిదారులతో ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మీరా సాహిబ్, అర్బన్ మండల కార్యదర్శి ఉపేందర్, కృష్ణయ్య, నాగేశ్వరరావు, జనార్ధన్, వెంకన్న, మధు, జాన్ బి పాల్గొన్నారు.

## మసాజ్ ముసుగులో వ్యభిచారం



**మేడిపల్లి :** మసాజ్ ముసుగులో వ్యభిచార కేంద్రాన్ని నడుపుతున్న సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... అంబర్పేట నివాసి అయినా ఏరువ పల్లవి మేడిపల్లి మండలం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో గత కొంతకాలంగా షుగర్ బ్యూటీ స్పా పేరుతో మసాజ్ సెంటర్ ను నిర్వహిస్తున్నారు. కాగా, మసాజ్ పేరుతో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారంతో ఏ హెచ్ టి టీం తో కలిసి మసాజ్ సెంటర్ పై పోలీసులు రైడ్ చేయగా ఏడుగురు మహిళలు, ఒక పురుషున్ని అదుపులోకి తీసుకొని రిమాండ్ చేశామని, బాధితులను హోమ్ కు తరలించామని మేడిపల్లి పోలీసులు తెలిపారు




## మిర్యాలగూడ పట్టణ అభివృద్ధిపై ఏక్ నజర్

**మిర్యాలగూడ ప్రతినిధి, ఆర్గాన్ న్యూస్, మే 10 :** ఈరోజు మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్‌తో కలిసి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. గతంలో చేపట్టిన ప్రస్తుతం చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. అందులో భాగంగా.. పట్టణం లోని రామచంద్రగూడెం వై జంక్షన్ తడకమల్ల క్రాస్ రోడ్స్ వద్ద ప్రమాదకరంగా మారిన ఫౌంటెన్ లను పరిశీలించి తగు సూచనలు చేశారు. నూతనంగా మంజూరైన ఫ్లై ఓవర్లు నిర్మించాల్సిన ప్రదేశాలను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. అనంతరం హనుమాన్ పేట ఫ్లైఓవర్ కింద చిరు వ్యాపారుల కొరకు నిర్మించ తలపెట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను పరిశీలించి మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కళాభారతి ఆడిటోరియంలో మున్సిపల్ మరియు రెవిన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పట్టణంలో నెలకొన్న పలు సమస్యలను వీడియో ప్రెజెంటేషన్ ద్వారా కలెక్టర్ కు వివరించారు. నియోజకవర్గ సమస్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమస్యలను వివరించిన మొట్టమొదటి ఎమ్మెల్యే మీరే అంటూ కలెక్టర్ బత్తుల లక్ష్మారెడ్డి ని అభినందించారు. దానితోపాటు అభివృద్ధి పనుల పేరిట గతంలో జరిగిన అవినీతిని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. వీటిపై కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ.. అవినీతిపై పూర్తి విచారణ చేపడతామని పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పట్టణం లో ప్రధానంగా డంపింగ్ యార్డ్ తో సమీపకాలనీ ప్రజలు పడుతున్న తీవ్ర ఇబ్బందులను తొలగించేందుకు.. సుదూర ప్రాంతంలో అధునాతన ట్రీట్మెంట్ ప్లాంట్ తో కూడిన డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ మున్సిపల్ కాంప్లెక్స్ ఆర్టీసీ కాంప్లెక్స్ ఏరియా లలో రోడ్డు వెడల్పు కు ఇబ్బందికరంగా మారి న్యాయపరమైన చిక్కులను తొలగించేందుకు స్థానిక అధికారులు పూర్తి వివరాలతో ప్రతిపాదనను పంపినట్లయితే లీగల్ సెల్ ద్వారా సమస్యల పరిష్కారం కొరకు కృషి చేస్తామన్నారు. అనంతరం మిర్యాలగూడ సబ్ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మాణం జరుపుకుంటున్న ఎత్తిపోతల పథకాల పనుల పురోగతిపై సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి కుందూరు జైవీర్ రెడ్డి ఎమ్మెల్సీ శంకర్ నాయక్ లతో కలసి కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

# మధుమేహానికి వేసవి గండం



వేసవిలో విహార యాత్రలకు వెళ్లాలని ఎవరికి ఉండదు? కానీ మధుమేహం గలవారికిది కాస్త ఇబ్బంది కలిగించొచ్చు. వీరికి వేడి వాతావరణంలో ఇంకాస్త త్వరగా ఒంట్లో నీటిశాతం తగ్గే (డీహైడ్రేషన్) అవకాశముంది. తగినంత నీరు తాగకపోతే రక్తంలో గ్లూకోజు మోతాదులు పెరగొచ్చు. దీంతో మూత్రం మరింత ఎక్కువగానూ రావొచ్చు. ఇది మరింత నీటిశాతం తగ్గటానికీ దారితీస్తుంది. మధుమేహుల్లో రక్తనాళాలు, నాడులు దెబ్బతినటం వంటి సమస్యలతో చెమట గ్రంథులు సరిగా పనిచేయకపోవచ్చు. అందువల్ల శరీరం అంతగా చల్లబడదు. అలాగని పూర్తిగా నిరాశ పడాల్సిన పనిలేదు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే యాత్రలను ఆస్వాదించొచ్చు.

- దాహం వేయకపోయినా సరే. నీరు ఎక్కువగా తాగాలి. ఒంట్లో నీటిశాతం తగ్గకుండా ఉండటానికిది చాలా ముఖ్యం. కెఫీన్‌తో కూడిన కాఫీ, కూల్‌డ్రింకులు, శక్తి పానీయాలు, మద్యం తాగొద్దు. ఇవి నీరు బయటకు వెళ్లేలా చేస్తాయి. దీంతో గ్లూకోజు మోతాదులు పెరుగుతాయి.
- వేడికి గ్లూకోజు మోతాదులు పెరుగుతూ, తగ్గుతూ వస్తుంటాయి. అలాగే అధిక ఉష్ణోగ్రతలు శరీరం ఇన్సులిన్‌ను వాడుకునే తీరును మార్చేస్తాయి. కాబట్టి మిగతా రోజుల్లో కన్నా తరచూ గ్లూకోజు మోతాదులను పరీక్షించుకోవాలి. ఇన్సులిన్ వాడేవారు అవసరాన్ని బట్టి మోతాదులను నిర్ణయించుకోవాలి.
- ఎండ బాగా కాసే సమయంలో.. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల మధ్యలో వీలైనంతవరకూ నీడ పట్టున్నే ఉండేలా చూసుకోవాలి. ఏసీ అందుబాటులో ఉంటే ఇంకా మంచిది.
- వదులైన, లేత రంగు దుస్తులు ధరించాలి. నూలు దుస్తులైతే మేలు. ఇవి శరీరానికి బాగా గాలి తగిలేలా చూస్తాయి.
- సౌకర్యవంతమైన, సరైన సైజు షూ, సాక్స్ ధరించాలి. ఇవి పాదాలు దెబ్బతినకుండా కాపాడతాయి.
- ఎండ తక్కువగా కాసే ఉదయం, సాయంత్రం వేళల్లోనే వ్యాయామాలు చేయాలి. లేదా నీడలోనైనా చేయొచ్చు.
- గ్లూకోజు బిళ్లలు, పళ్లరసాల వంటివి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలి కూడా. ఎప్పుడైనా ఉన్నట్టుండి గ్లూకోజు పడిపోతే వీటిని తీసుకుంటే వెంటనే మోతాదులు పెరుగుతాయి.
- ఇన్సులిన్‌ను చల్లటి, ప్రత్యేకమైన పెట్టెలోనే భద్రపరచుకోవాలి. లేకపోతే వేడికి ఇన్సులిన్ చెడిపోవచ్చు.
- యాత్రలకు వెళ్లే ముందే డాక్టర్‌ను సంప్రదించి మందులను మార్చుకోవాల్సిన అవసరముందేమో తెలుసుకోవాలి.
- నీరు మాత్రమే కాదు..
- ఒకరు సగటున రోజుకు 2 లీటర్ల నీరు తాగాలి. మధుమేహులకు ఇది మరింత ముఖ్యం కూడా. ఇదొక్కటే కాదు.. ఇతరత్రా ద్రవాలూ తీసుకోవచ్చు.
- పలుచటి మజ్జిగ తీసుకోవచ్చు.
- నిమ్మ లేదా టోమాటో రసం (చక్కర లేకుండా) తాగొచ్చు.
- పుదీనా/తులసి/జీరా నీళ్లు తాగొచ్చు.
- పీచు దండిగా ఉండే ఆకుకూరలు, క్యాబేజీ వంటివి ఎక్కువగా తీసుకోవటం మంచిది.
- రక్తంలో గ్లూకోజు నియంత్రణలో ఉన్నప్పుడు ఓ పుచ్చకాయ ముక్క తినొచ్చు.
- కేలరీలు తక్కువగా ఉండే కీర దోసను సలాడ్, రైతాలో కలిపి తీసుకోవచ్చు. దీన్ని చక్కెర లేని లస్సీలో అయినా కలపొచ్చు.
- రోజూ గుమ్మడి, పొట్లకాయ, సొరకాయ, కాకర కూడా తీసుకోవచ్చు.
- ప్రయాణం చేస్తున్నప్పుడు అన్నిసార్లూ పోషక నిపుణులు సూచించిన ఆహారం అందుబాటులో ఉండకపోవచ్చు. కాబట్టి పొట్టుతీయని గోధుమ బ్రెడ్డు, పలు ధాన్యాల బ్రెడ్డు, అటుకుల వంటివి వెంట తీసుకెళ్లటం మంచిది. వేపుళ్లు పరిమితం చేసుకోవాలి. చువ్వల మీద కాల్చిన పదార్థాలు తినకపోవటమే మంచిది. ఇవి రుచిగానే ఉండొచ్చు గానీ బాగా మాడినవి క్యాన్సర్ కారకంగా పరిణమించొచ్చు. మైదా, పాలిష్ పట్టిన బియ్యం కన్నా పొట్టుతో కూడిన గోధుమ పిండి, దంపుడు బియ్యం ఉపయోగించటం మేలు. తక్కువ కేలరీలతో కూడిన రకరకాల కూరగాయలు, ఆకుకూరలతో పళ్లాన్ని ఇంద్రధనుసు రంగులో ఉండేలా చూసుకోవాలి.

# మనం తినే మామిడి పండ్లు సురక్షితమేనా?



## చైనా పౌడర్‌తో మామిడి పండ్లను మగ్గిస్తున్న వ్యాపారులు

## కార్బైడ్ ద్వారా పండించిన పండ్లు తింటే ఆరోగ్యానికి హాని అంటున్న డాక్టర్లు

## అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి






కాయలను పండ్లుగా మార్చే పౌడర్ ఇది

**మేడ్చల్, ఆర్గాన్ న్యూస్**

ప్రస్తుతం మార్కెట్లో దొరుకుతున్న మామిడి పండ్లు సురక్షితమైన అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సహజ సిద్ధంగా కాకుండా కృత్రిమ పద్ధతికి అలవాటు పడిన వ్యాపారులు త్వరగా పండ్లను పండించేందుకు చైనా నుండి దిగుమతి చేసుకున్న ఇథలిన్ పౌడర్ను ను వాడడం వల్ల కాయలు కొన్ని గంటల్లోనే పండ్లుగా మార్చి విక్రయిస్తున్నారన్నా ఆరోపణలు ఉన్నాయి. ఈ పండ్లను తింటే సురక్షితమైన అంటూ ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కార్బైడ్ ద్వారా పండించిన పండ్లను తింటే ఆరోగ్యానికి హాని కలుగుతుందని డాక్టర్లు స్పష్టం చేస్తున్నారు. అయినా వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా సహజ సిద్ధమైన పళ్ళను కాకుండా కృత్రిమ పద్ధతిలో పండించిన పళ్ళను జనాలకు అంటగడుతూ జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్కెట్లో ఇంత జరుగుతున్న అధికారులలో మాత్రం చలనం లేదు. అధికారుల అలసత్యమే వ్యాపారులు బలంగా మార్చుకొని అక్రమ దందాకు తెర లేపుతున్నారు.

### చైనా పౌడర్ నిషేధం..

చైనా పౌడర్లో కార్బైడ్ ఉందన్న విషయం గతంలో ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులు ప్రకటించారు. కార్బైడ్ ను పూర్తిస్థాయిలో నిషేధించాలని హైకోర్టు సైతం ఉత్తర్వులను జారీ చేసింది.కానీ కార్బైడ్ ద్వారా మిగ్గించిన పండ్లను తింటే ఆరోగ్యానికి హానికరమని డాక్టర్లు ఒకపక్క చెప్తున్నప్పటికీ వ్యాపారులు మాత్రం ధనార్జనే ధ్యేయంగా కృత్రిమ పద్ధతిలో మామిడి పండ్లను మాగబెట్టి ప్రజలకు అంటగడుతున్నారు. పండ్లలో రారాజు అయినా మామిడి పండ్లను కొందరు వ్యాపారులు కలుషితం చేస్తున్నారు. నోరూరించే మామిడి పండ్లను తినడానికి జనాలు పోటీపడతారు. వేసవికాలం వచ్చింది అంటే చాలు నోరూరించే మామిడి పండ్ల కోసం ఎదురుచూస్తారు. అయితే దీనిని కొందరు వ్యాపారస్తులు తమకు అనుకూలంగా మార్చుకుంటూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలన్న దురుద్దేశంతో వ్యాపారస్తులు అడ్డదారిని తొక్కుతున్నారు. కాయలను కొన్ని గంటల్లోనే పండ్లుగా మార్చాలన్న ఉద్దేశంతో అడ్డదారులు తొక్కుతున్నారు. గంటల్లో పండ్లుగా మార్చాలన్న సంకల్పంతో నిషేధిత చైనా పౌడర్ ను వాడుతూ ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి

### కృత్రిమ పద్ధతితో మాగబెట్టిన పండ్లతో ప్రమాదం

కృత్రిమ పద్ధతిలో మాగబెట్టిన మామిడి పండ్లను తింటే ఆరోగ్యానికి హానికరమని ే ప ం ు ం చెప్పడానికి ఇష్టపడని ఓ ప్రముఖ డాక్టర్ పేర్కొన్నారు. సహజ సిద్ధమైన మామిడి పండ్లకు రసాయనాలతో మాగాపెట్టిన మామిడిపండ్ల మధ్య తేడా చాలా ఉంటుందని, కొన్ని గంటల్లోనే కాయల ను పండ్లు గా మార్చాలని దురాశతో కొందరు వ్యాపారులు నిషేధిత చైనా పౌడర్ ను వాడడం వల్ల జబ్బుల బారిన పడాల్సి వస్తుందన్నారు. రసాయనాలతో పండించిన పండ్లను తింటే ముఖ్యంగా చిన్నపిల్లలు జబ్బుల బారిన పడే ప్రమాదం ఉందని తెలిపారు.

### ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

సహజ సిద్ధంగా కాకుండా కృత్రిమ పద్ధతిలో మామిడి కాయలను పండ్లుగా మార్చి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారస్తులపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రత్యేక దృష్టి సాధించాలని ప్రజలు కోరుతున్నారు. ఫుడ్డు సేఫ్టీ అధికారుల నిర్లక్ష్యం వల్లే వ్యాపారులు రెచ్చిపోతూ చైనా పౌడర్ లాంటి రసాయనాలను మామిడి కాయలపై ప్రయోగించి ప్రజల ఆరోగ్యాలతో ఆడుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మామిడికాయలను మగ్గించడానికి కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు, నిషేధిత రసాయనాలను వినియోగిస్తున్నారనేది బహిరంగ రహస్యం. ఈ విషయంపై ఫుడ్ సేఫ్టీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

## జాతీయరక్షణ నిధికి ఒక నెల జీతం విరాళం

### స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటన



**అమరావతి, మే 10 :** దేశ రక్షణ కోసం పోరాడుతున్న వీరజవాన్లకు సంఘీభావంగా తన ఒక నెల వేతనం (రూ.2,17,000) జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇస్తున్న ట్లు- ఎపి అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ... ఉగ్రవాద నిర్మూలనలో భారత సాయుధ దళాలు ప్రదర్శిస్తున్న ధైర్యసాహసాలు దేశ ప్రజలందరికీ గర్వకారణంగా నిలుస్తున్నాయని అన్నారు. భారతదేశం సాయుధ దళాలు చేస్తున్న ధైర్యసాహసాలు ప్రతి భారతీయునిలో గర్వాన్ని కలిగిస్తున్నాయని తెలిపారు. దేశ రక్షణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న వీర జవాన్లకు సంఘీభావం తెలిపారు. తన నెల జీతాన్ని జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చినట్లు- స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. ఈ మేరకు తన నెల జీతం రూ.2,17,000లను ఆన్ లైన్ ద్వారా జాతీయ రక్షణ నిధికి ట్రాన్స్ఫర్ చేసినట్లు-.. రిసిప్ట్‌ను కూడా ఆయన విడుదల చేశారు.

## సరిహద్దు ఉద్రిక్తతలతో రైల్వే స్టేషన్ల భద్రత పెంపు

**హైదరాబాద్, మే 10 :** భారత్ - పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో రైల్వే ప్రయాణికుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ వెల్లడించారు. ప్రయాణికుల భద్రతతో పాటు ఆస్తులపైనా ప్రత్యేక దృష్టి పెట్టామని అన్నారు. అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టామని అన్నారు. నగరంలోని ప్రధాన రైల్వేస్టేషన్‌లైన సికింద్రాబాద్, కాచిగూడలో భారీగా భద్రతను పెంచినట్లు తెలిపారు. సీసీ కెమెరాల సంఖ్యను సైతం పెంచి పర్యవేక్షణ చేస్తున్నట్లు శ్రీధర్ పేర్కొన్నారు. భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో భద్రత కారణాల దృష్ట్యా దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాలను మూసి వేయడంతో రైల్వేస్టేషన్లకు ప్రయాణికుల తాకిడి పెరిగిందన్నారు. దీంతో భద్రత కోసం ప్రత్యేక బలగాలను మోహరించినట్లు- చెప్పారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడిపిస్తున్నామని సీపీఆర్వో శ్రీధర్ వెల్లడించారు.

## గ్రానైట్ పలకల లారీ బోల్తా : ముగ్గురు మృతి

**గుంటూరు, మే 10 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం వద్ద రోడ్డు ప్రమాదం చోటు-చేసుకుంది. గ్రానైట్ పలకల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడడంతో ముగ్గురు కూలీలు చనిపోయారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి మృతదేహాలను బాపట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతులు మార్టూరుకు చెందిన పాలపర్తి శ్రీను(25), తాళ్లూరి ప్రభుదాస్(37), నూతలపాడుకు చెందిన తమ్మలూరి సురేం(26)గా గుర్తించారు. మార్టూరు నంపచి గుంటూరుకు వెళ్తుండగా ఈ రోడ్డు ప్రమాదం చోటు-చేసుకుంది.

## పలు జిల్లాల్లో తేలికపాటి వర్షాలు

**హైదరాబాద్, మే 10 :** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మూడు రోజుల పాటు- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే రెండు లేదా మూడు డిగ్రీలు తక్కువ ఉండే అవకాశం ఉందని వెల్లడించింది. పలు జిల్లాల్లో ఈరోజు ఉరుములు, మెరుపులతో పాటు- గంటకు 30 కి.మీ. నుంచి 40 కి.మీ.ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు(శ) పడతాయని సూచించింది. రానున్న రెండు రోజులు కూడా గంటకు 40 కి.మీ. నుంచి 50 కి.మీ.ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడతాయని హెచ్చరించింది.

### దేశభద్రత కోసం తీసుకునే

## నిర్ణయానికి కట్టుబడిఉంటాం

### కాల్పుల విరమణను స్వాగతించిన సిఎం చంద్రబాబు

**అమరావతి, మే 10 :** భారత్- పాకిస్థాన్ మధ్య కాల్పుల విరమణ ప్రకటన శుభపరిణామమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఉద్రిక్తతల సమయంలో ప్రాణాలు కోల్పోయిన వారి విషయంలో సంతాపం వ్యక్తం చేశారు. దేశ భద్రత కోసం కేంద్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నా మద్దతు తెలపాలని.. దేశమే ముందు అనేది అందరి నినాదం కావాలని పిలుపునిచ్చారు. దేశానికి కష్టమొస్తే సంఘటితంగా ఉండాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని స్పష్టం చేశారు. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న అతిపెద్ద సమస్య ఉగ్రవాదం. దేశ రక్షణ కోసం జరిగిన వీరోచిత పోరాటంలో అగ్నివీర్ మురళీనాయక్ వీరమరణం పొందటం బాధాకరం. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటూ.. ఎవరు మనపైకి వచ్చినా ఉపేక్షించేది లేదు. ప్రజాస్వామ్యంలో అభిప్రాయభేదాలు ఉన్నా.. దేశ సమగ్రత విషయంలో అందరం ఏకతాటిపైకి రావడం గొప్ప విశేషం. మత విద్వేషాలు లేని రాష్ట్రం మన ఆంధ్రప్రదేశ్ అని చంద్రబాబు అన్నారు.

## పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణం మంజూరు

### తీవ్రంగా వ్యతిరేకించిన కాంగ్రెస్




**గౌహతి, మే 10 :** పాక్‌కు ఐఎంఎఫ్ రుణం ఇవ్వడాన్నికాంగ్రెస్ తప్పు పట్టింది. భారత్ అభ్యంతరం చెబుతున్నా పట్టించుకోకుండా రుణం ఇవ్వడం సరికాదని కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా భారత్ 'ఆపరేషన్ సిందూర్'తో గట్టిగా బదులు తీర్చుకుంది. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. ఇలాంటి తరుణంలో పాకిస్థాన్‌కు రుణం ఇవ్వకూడదని భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ అంతర్జాతీయ ద్రవ్య నిధి ఐఎంఎఫ్ నుంచి 1 బిలియన్ డాలర్ల నిధులు (దాదాపు రూ.8,540 కోట్లు) మంజూరయ్యాయి. ఎక్స్టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ కింద ఈ మొత్తాన్ని ఇవ్వడానికి ఐఎంఎఫ్ ఆమోదం తెలిపింది. దీనిపై కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగొయ్ స్పందించారు. పాక్‌కు ఐఎంఎఫ్ రుణం ఇవ్వడం షాక్‌కు గురి చేసిందన్నారు. 'పహల్గాం దాడి తర్వాత కూడ 1 బిలియన్ డాలర్ల రుణం ఆమోదించడం షాకింగ్‌గా అనిపించడంతో పాటు నిరాశకు గురిచేసింది. ఈ రుణం పాకిస్థాన్‌లో శాశ్వత సైనిక పాలనకు దారితీసేందుకే దోహదం చేస్తుంది' అని గౌరవ్ గొగొయ్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ కూడా ఈ విషయంపై స్పందించారు. పాకిస్థాన్‌కు ఐఎంఎఫ్ రుణానికి వ్యతిరేకంగా భారత్ ఓటు- వేయాలని ఏప్రిల్ 29న కాంగ్రెస్ డిమాండ్ చేసిందన్నారు. కానీ, భారత్ ఓటింగ్‌కు దూరంగా ఉందన్నారు. మోదీ ప్రభుత్వం వెనక్కి తగ్గిందని, ఓటింగ్‌లో పాల్గొని వ్యతిరేకంగా ఓటు- వేస్తే బలమైన సందేశం వెళ్లేదన్నారు. ఈ నేపథ్యంలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ నాయకులు జైరాం రమేశ్, పవన్ ఖేరాలకు కౌంటర్ ఇచ్చారు. వీరు పాకిస్థాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి బెయిలౌట్‌పై ప్రచారంలో మునిగి తేలుతున్నారని ఆరోపించారు. తప్పుడు సమాచారంతో దేశ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు.

# ఫేక్ ప్రచారం మానుకుంటే మంచిది

### జగన్ విమర్శలపై మండిపడ్డ లోకేశ్



**అమరావతి, మే 10 :** ప్రభుత్వ సొమ్ముతో కుట్టుమిషన్లను కొని పసుపు రంగు వేసి అందిస్తున్నారంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి నారా లోకేష్ ఫైర్ అయ్యారు. వైసీపీకి మంత్రి గట్టిగా కౌంటర్ ఇచ్చారు. వైసీపీ హయాంలో జనం సొమ్ము దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. జనం సొమ్మును కాజేయాలనే ఆలోచన తమకు లేదని స్పష్టం చేశారు. తాను ఎమ్మెల్యేగా లేని సమయంలో కూడా మంగళగిరి ప్రజలకు స్వయం ఉపాధికి ఆర్థిక సాయంతో చేయూతనందించానని.. అందంతా తన సొంత నిధులతో చేసినట్లు చెప్పుకొచ్చారు. ఇకనైన ఫేక్ ప్రచారాలు మానుకో అంటూ జగన్‌పై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా మంత్రి లోకేష్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్ అధికారంలో ఉన్న ఐదేళ్లు ప్రజలని గాలికి వదిలేసి, జనం సొమ్ము దోచుకోవడమే పనిగా పెట్టు-కున్నారని మండిపడ్డారు. అప్పుడు నేను ఎమ్మెల్యేనీ కూడా కాను. ప్రజల కోసమే పుట్టిన తెలుగుదేశం పార్టీ నాయకుడిగా, నా మంగళగిరి నియోజక వర్గ ప్రజలకు స్వయం ఉపాధికి చేయూత నందించాలని నిర్ణయించుకున్నాను. మహిళలు, చేనేతలు, స్వర్ణకారులు, చిరువ్యాపారులకు అవసరమైన సామాగ్రి, ఆర్థిక సాయంతో చేయూతనందించాను. వీటన్నింటికీ నా సొంత నిధులు వెచ్చించాను. కుల, మత అంతరాలు పాటించకుండా... తమ కాళ్లపై తాము నిలబడాలనుకునే మహిళామణులు వేలాది మందికి స్త్రీశక్తి పేరుతో ఉచితంగా శిక్షణ ఇచ్చాము. ట్రైనింగ్ పూర్తయ్యాక సర్టిఫికెట్లు-, ఉచితంగా టైలరింగ్ మిషన్, మెటీ-రియల్ అందజేశానని చెప్పుకొచ్చారు. మంగళగిరి స్త్రీ శక్తి కేంద్రం 2022,జూన్20న ప్రారంభించాం. ఈ కేంద్రం ఇప్పటి వరకూ 43 బ్యాచుల్లో 2226 మంది శిక్షణ పూర్తిచేసుకోగా, వీరందరికీ మిషన్లు అందజేశాం. తాడేపల్లిలో స్త్రీ శక్తి కేంద్రం 2023, ఫిబ్రవరి 1న ప్రారంభమైంది. ఇక్కడ 17 బ్యాచుల్లో శిక్షణ తీసుకున్న 666 మందికి మిషన్లు ఉచితంగా ఇచ్చాం. దుగ్గిరాలలో 2023 ఏప్రిల్ 10న ఆరంభించిన స్త్రీశక్తి కేంద్రంలో 16 బ్యాచుల్లో 616 మంది -ట్రైనింగ్ పూర్తి చేసుకోగా, వీరందరికీ మిషన్లు పంపిణీ చేశాం. ఇప్పటి వరకూ 3508 మందికి శిక్షణ పూర్తిచేసి, ఉచితంగా నాణ్యమైన కుట్టు- మిషన్లు అందజేశాం. ఇవన్నీ నా జేబులోంచి తీసిన డబ్బులు, నా ఖాతాల నుంచి వెచ్చించిన సొమ్ములు కాబట్టే...శుభానికి సంకేతమైన నా పార్టీ పసుపు రంగు మిషన్లు ఇచ్చాను. జనం సొమ్ముతో పెట్టిన పథకాలకు నీలా పార్టీ రంగులు, నీ పేర్లు పెట్టు-కోవాలనే యావ మాకు లేదు. నీ అబద్ధం తాత్కాలికం. మా నిజం శాశ్వతం. ఇకనైనా ఫేక్ ప్రచారాలు మానుకోవాలని మంత్రి లోకేష్ ట్వీట్ చేశారు.

# ఈ యేడాది ముందుగానే రుతు పవనాలు

### 27న కేరళను తాకనున్న నైరుతి : ఐఎండి



**న్యూఢిల్లీ, మే 10 :** నైరుతి రుతుపవనాలు ఈసారి మే 27న కేరళను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ఐఎండీ శనివారం తెలిపింది. నైరుతి రుతుపవనాలు ప్రవేశించాక జులై 8 నాటికి భారత్ వ్యాప్తంగా విస్తరిస్తాయి. సాధారణంగా ప్రతి ఏడాది జూన్ 1 లేదా ఆ తర్వాత రుతుపవనాలు కేరళలోకి ప్రవేశిస్తాయి. దీంతో వర్షాకాలం ప్రారంభమైందని భావిస్తాం. అయితే 2009లో నైరుతి రుతుపవనాలు మే 23నే ప్రవేశించాయి. ఆ తర్వాత మళ్లీ ఇప్పుడు అంచనాల కంటే చాలా ముందుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తున్నాయి. సెప్టెంబరు 17న రుతుపవనాల ఉపసంహరణ ప్రారంభమవుతుంది. ఆ తదుపరి నెల 15 నాటికి ఇది ముగుస్తుంది. ఈసారి వర్షపాతం సాధారణం కంటే అధికంగా నమోదు అవుతుందని ఐఎండీ ఏప్రిల్ నెలలోనే తెలిపింది. సాధారణం కంటే తక్కువగా వర్షపాతం కురిసే ఎల్‌నినో పరిస్థితులు లేవని చెప్పింది. భారత్‌లో 52 శాతం నికర సాగు భూమికి వానలే ఆధారం. భారత్‌లోని వ్యవసాయ ఉత్పత్తిలో దీని నుంచి 40 శాతం దిగుబడి వస్తుంది. ఇండియాలో ఆహార భద్రతతో పాటు- ఆర్థిక స్థిరత్వానికి నైరుతి రుతు పవనాలది ప్రధాన పాత్ర. 'నాలుగు నెలల రుతుపవన కాలంలో (జూన్ నుంచి సెప్టెంబర్ వరకు) భారతదేశంలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. దీర్ఘకాలిక సగటు- 87 సెంమీలో 105 శాతం వర్షపాతం నమోదవుతుందని అంచనా వేశాం' అని అధికారులు అప్పట్లో ప్రకటించారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణంగా భారతదేశంలో దాదాపు 87 సెంమీ వర్షం పడుతుంది. దీనిని దీర్ఘకాలిక సగటు- అంటారు. ఈ సంవత్సరం మాత్రం మొత్తం వం-ర్షపాతం 87 సెంమీలో 105 శాతం ఉంటు-ందని అంచనా వేశారు. అంటే 91.35 సెంమీ వర్షపాతం పడుతుందని అంచనా వేసినట్లు- లెక్క. దేశ వ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైన జలాశయాలను తిరిగి నింపడానికి నైరుతి రుతుపవనాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.

# ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర ప్రమాదం

### ఇద్దరు వ్యక్తుల సజీవ దహనం




**హైదరాబాద్, మే 10 :** నగర శివారు ఔటర్ రింగ్ రోడ్డుపై శనివారం ఘోర ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న వాహనాన్ని ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మంటలు చెలరేగి రెండు వాహనాలు కాలిపోయాయి. కారులో ఉన్న ముగ్గురిలో ఇద్దరు సజీవ దహనం కాగా మరో వ్యక్తిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు-చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...నగరంలోని బహుదూర్ పూర్ తాడ్బన్, హెచ్‌బి కాలనీకి చెందిన వ్యాపారవేత్త దీపేష్ రితేష్ కుమార్ అగర్వాల్ కుమారుడు దీపేష్ అగర్వాల్ (23) తన స్నేహితులను కలిసి వస్తానని చెప్పి కారులో బయలుదేరాడు. విజయనగర్ కాలనీ విటిసికి చెందిన సంచయ్ మల్వాని (22), మాసాపేట్‌కు చెందిన ప్రియాన్ష్ మిట్టల్ (23)తో కలిసి వారు శంషాబాద్ వైపు నుండి ఘట్‌కేసర్ వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో తెల్లవారుజామున అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, గండిచెరువు బ్రిడ్జి సమీపంలో ఔటర్‌పైకి రాగానే ఎలాంటి సిగ్నల్స్ లేకుండా ఆగి ఉన్న వాహనాన్ని వీరు ప్రయాణిస్తున్న కారు బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మంటలు చెలరేగాయి. దాంతో రెండు వాహనాలు మంటలో పూర్తిగా దగ్ధమయ్యాయి. కారు ఉన్న ముగ్గురిలో దీపేష్ అగర్వాల్, సంజయ్ మల్వాని అక్కడిక్కడే సజీవ దహనం కాగామరో స్నేహితుడి ప్రియాన్ష్ మిట్టల్ తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఎల్‌బినగర్ కామినేనికి తరలించారు.అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని ధృవీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అందాల పోటీలపై అక్కసు ఎందుకో

- రాష్ట్రప్రతిష్టను దెబ్బతీస్తున్న కవిత
- భువనగిరి ఎంపి చామల విమర్శలు



**హైదరాబాద్, మే 10 :** రాష్ట్ర ప్రతిష్టను ఎమ్మెల్సీ కవిత దెబ్బ తీయాలని చూస్తున్నారని భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. మిస్ వరల్డ్ పోటీలపై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఈ మేరకు శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రతి అంశాన్ని రాజకీయం చేయాలని చూస్తున్నారన్నారు. తెలంగాణ ప్రభుత్వం కేవలం ఒక ఫెలిసేటేటర్ మాత్రమేనని ఆయన అన్నారు. రాష్ట్రం చాలా సేఫెస్ట్ ప్లేస్ అని, తెలంగాణలో పెట్టు-బడులు పె-÷-టటొ-చ్చని, తెలంగాణలో ఇంత పెద్ద ఈవెంట్ చేయాలన్న ఉద్దేశ్యంతోనే నాలుగు నెలల క్రితం తెలంగాణను ఈ ఈవెంట్ కోసం ఎంపిక చేశారని ఆయన తెలిపారు. తెలంగాణ మీద నమ్మకంతో ఇక్కడ ఈవెంట్ పెట్టు-కున్నారన్నారు. ఈ రోజు మిస్ వరల్డ్ లిమిటె-డ్ అనే కంపెనీ ఇక్కడ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆ కంపెనీ ఏదైనా నిర్ణయం తీసుకొని ఈ ఈవెంట్‌ను పోస్ట్ ఫోన్ చేయాలనుకుంటే తెలంగాణ ప్రభుత్వం వారికి సహకరిస్తుందని, వాళ్లు పోటీ-లు నిర్వహించాలని అనుకున్నప్పుడు మనం వాటిని పోస్ట్ పోన్ చేయలేమని ఆయన స్పష్టం చేశారు. 105 దేశాల నుంచి మిస్ వరల్డ్, మిస్ కంట్రీ-స్ వచ్చి ఇక్కడ మిస్ వరల్డ్ పోటీ-ల్లో పాల్గొంటు-న్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే వాళ్లతో పాటు- వాళ్ల కుటు-ంబ సభ్యులు మొత్తం కలిపి ఒక మూడు నుంచి నాలుగు వందల మంది డెలిగేట్స్ తెలంగాణలో ఉన్నారని ఆయన చెప్పారు. వీళ్లతో పాటు- ఈవెంట్ నడిపించే స్పాన్సర్షిప్ చాలా మంది ఇక్కడే ఉన్నారని, వాళ్లు తీసుకోవాల్సిన నిర్ణయమని ఆయన చెప్పుకొచ్చారు. రాజకీయం చేయాలన్న దురుద్దేశం నుంచి దూరంగా ఉండి వాస్తవాలు మాట్లాడాలని ఎంపి చామల ఎమ్మెల్సీ కవితకు ఆయన సూచించారు.

## కాల్పుల విరమణలో డీజీఎంవోదే కీలక పాత్ర

### తొలుత డీజీఎంవోల మధ్యే సంప్రదింపులు

**న్యూఢిల్లీ, మే 10 :** మనదేశంలో కాల్పుల విరమణ ఒప్పందాలు, సరిహద్దు ఉద్రిక్తతల వేళ డీజీఎంవోదే కీలక పాత్ర. రెండు దేశాల మధ్య ఘర్షణాత్మక వాతావరణం ఏర్పడినప్పుడు తొలుత డీజీఎంవోల మధ్యే సంప్రదింపులు కొనసాగుతాయి. ఉద్రిక్తతలు తగ్గించడం, ఆయా దేశాల ఉద్దేశాలను వివరించడం, సాధ్యమైనవాటిని తక్షణమే పరిష్కరించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తారు. పహల్గాంలో ఉగ్రదాడి తర్వాత నియంత్రణ రేఖ వెంట పాక్ సైన్యం కవ్వింపు చర్యలకు పాల్పడింది. ఆ సమయంలో భారత్-పాక్ డీజీఎంవోలు హాట్‌లైన్‌లో మాట్లాడుకున్నారు. కాల్పుల విరమణను ప్రస్తావించిన భారత్.. దాయాది దేశాన్ని హెచ్చరించినట్లు రక్షణశాఖ అప్పట్లో పేర్కొంది. పహల్గాం ఉగ్రదాడి అనంతరం భారత్ చేపట్టిన ప్రతీకార దాడులతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరయ్యింది. ప్రతిదాడులు చేసేందుకు దాయాది దేశం యత్నించినప్పటికీ.. భారత బలగాల దెబ్బకు తోకముడిచింది. చివరకు ఉద్రిక్తతలు తగ్గించాలని పాక్ కోరడంతో అందుకు భారత్ అంగీకరించగా.. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చింది. ఈ వ్యవహారంలో సైన్యంలోని డీజీఎంవో స్థాయి అధికారులు కీలకంగా వ్యవహరించారు. పరిస్థితులు తీవ్ర రూపం దాల్చుతున్న వేళ వీరి మధ్య పరస్పర అవగాహనతో ఉద్రిక్తతలకు తాత్కాలికంగా తెరపడినట్లయ్యింది. సైనిక కార్యకలాపాల పర్యవేక్షణ, సమన్వయం చేసుకోవడంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలటరీ ఆపరేషన్స్ లదే పాత్ర కీలకం. సైన్యంలో సీనియర్ అధికారి స్థాయిలో ఉండే వీరు సైనిక ఆపరేషన్లలో వ్యూహాత్మక, కార్యాచరణను అమలు చేస్తుంటారు. ఆర్మీ చీఫ్‌తో నేరుగా సంప్రదింపులు జరుపుతూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందిస్తుంటారు. ప్రత్యర్థులపై దాడులు, శత్రుమూకలను దీటుగా ఎదుర్కొనే సైనిక ఆపరేషన్లకు వ్యూహాలు రచిస్తుంటారు. బలగాలను సిద్ధం చేయడం, రంగంలోకి దించడం వంటి విధులతో పాటు శాంతి పరిరక్షణలోనూ కీలకంగా వ్యవహరిస్తారు. సంయుక్త ఆపరేషన్‌ల సమయంలో వివిధ విభాగాల అధిపతుల మధ్య సంధానకర్తగా ఉంటారు. అటు నిఘా వ్యవస్థలతోనూ సమన్వయం చేసుకుంటూ వ్యూహాలు రచిస్తారు.



## ఆపరేషన్ సిందూర్‌లో

# కీలక ఉగ్రవాదులు హతం

### వివరాలు వెల్లడించిన రక్షణశాఖ వర్గాలు

**న్యూఢిల్లీ, మే 10 :** ఆపరేషన్ సిందూర్‌లో జైష్-ఎ-మొహమ్మద్, లష్కరే తోయిబా ఉగ్ర సంస్థలకు సంబంధించిన కీలక ఉగ్రవాదులను భారత ఆర్మీ మట్టుబెట్టినట్లు అధికార వర్గాలు తెలిపాయి. మే 7వ తేదీ బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల సమయంలో ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లోని లష్కరే తోయిబా, జైషేతోపాటు- తొమ్మిది ఉగ్రవాద శిబిరాలపై భారత ఆర్మీ దాడి చేసింది. భారత దాడుల్లో 100మందికి పైగా ఉగ్రవాదులు మరణించినట్లు- అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే, చనిపోయిన వారిలో లష్కరే తోయిబా, జైషే ఉగ్రసంస్థల్లో కీలకంగా ఉన్న ముదస్సర్ ఖాదియన్ ఖాస్, హాఫీజ్ ముహమ్మద్ జమీల్, మొహమ్మద్ యూసుఫ్ అజార్, ఖలీద్ (అబు ఆకాషా), మొహమ్మద్ హసన్ ఖాన్ అనే ఐదుగురు ఉగ్రవాదులు ఉన్నారని వర్గాలు తెలిపాయి. ఇందులో మొహమ్మద్ యూసుఫ్ అజార్.. జైషే చీఫ్ మసూద్ అజార్ బావమరిది అని నివేదికలు వెల్లడించాయి. కాగా, ఈ దాడుల్లో మసూద్ ఇప్పటికే తన సోదరుడిత్ సహా 10 కుటు-ంబ సభ్యులు, నలుగురు సన్నిహితులను కోల్పో యాడు. ఈ విషయాన్ని అంగీకరిస్తూ లేఖ కూడా విడుదల చేశాడు. ఎయిర్ ఇండియా హైజాక్ సూత్రదారి తొలగించబడిన ఈ ఉగ్రవాదులు పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న ఉగ్రవాద సంస్థలలోని అత్యంత ఉన్నత స్థాయి వ్యక్తులలో కొందరు, లష్కరే తోయిబా మరియు జైషే మొహమ్మద్ రెండింటితో బలమైన సంబంధాలు కలిగి ఉన్నారు.



## గ్రానైట్ లారీ బోల్తా.. ముగ్గురు కూలీల మృతి

**బాపట్ల :** బాపట్ల జిల్లా పర్చూరు మండలం తిమ్మరాజుపాలెం వద్ద గ్రానైట్ పలకల లోడుతో వెళ్తున్న లారీ బోల్తాపడింది. ఈ ప్రమాదంలో పలకల కిందపడి నలిగిపోయి ముగ్గురు మృతి చెందారు. మార్టూరు నుంచి చిలకలూరిపేట, పర్చూరు మీదుగా గుంటూరు వెళ్తుండగా తిమ్మరాజుపాలెం వద్ద ఈ ప్రమాదం జరిగింది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు, స్థానికులు క్రేన్ సహాయంతో పలకలను తొలగించారు. మృతులను మార్టూరుకు చెందిన పాలపర్తి శ్రీను (25), తాళ్లూరి ప్రభుదాస్ (37), నూతలపాడుకు చెందిన తమ్మలూరి సురేంద్ర (26)గా గుర్తించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రూ. 70 లక్షలు లంచం డిమాండ్ కేసు..

### సీబీఐ అదుపులో ఆదాయపు పన్నుశాఖ కమిషనర్

**హైదరాబాద్:** హైదరాబాద్‌లో ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ జీవన్ లాల్ లావిడియా రూ.70 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. జీవన్ లాల్ లావిడియా ఓ ప్రైవేటు కంపెనీకి లబ్ధి చేకూర్చేందుకు లంచం డిమాండ్ చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. ముంబయిలో ఓ మధ్యవర్తి ద్వారా రూ.70 లక్షలు లంచం తీసుకుంటుండగా సీబీఐ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా.. ఈ వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడయ్యాయి. నిందితుడు ఇచ్చిన వివరాల ఆధారంగా కేసు నమోదు చేసిన సీబీఐ.. ముంబయి, హైదరాబాద్, ఖమ్మం, విశాఖపట్నం, ఢిల్లీలోని 18 ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఈ సోదాల్లో రూ.70 లక్షల లంచంతోపాటు మరో రూ. 69 లక్షలు, కీలక పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో జీవన్‌లాల్ లావిడియా, సాయిరామ్ పలిశెట్టి, నట్టా వీర నాగ శ్రీరామ్ గోపాల్, కాంతిలాల్ మెహతా, సజిదా మజహర్ హుస్సేన్ షాలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరిలించినట్లు అధికారులు వెల్లడించారు.



## మే 27నే కేరళకు నైరుతి రుతుపవనాలు

**న్యూఢిల్లీ :** ఈసారి దేశంలోకి నైరుతి రుతుపవనాలు అంచనాల కంటే ముందే ప్రవేశించనున్నాయి. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించడం ద్వారా దేశమంతటా వర్షాలు మొదలవుతాయి. జులై 8 నాటికి ఇవి దేశమంతా విస్తరిస్తాయి. మళ్లీ వాయవ్య భారతం నుంచి సెప్టెంబరు 17తో రుతుపవనాల ఉపసంహరణ మొదలై అక్టోబరు 15 నాటికి ముగుస్తుంది. ప్రస్తుతం ఇవి జూన్ 1 కంటే ముందుగా మే 27న కేరళను తాకే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ శనివారం ప్రకటించింది. గతేడాది మే 30న రాగా.. 2023 జూన్ 8న, 2022 మే 29న దేశంలోకి ప్రవేశించాయి. ఈ సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. భారత ఉపఖండంలో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే ఎల్‌నినో పరిస్థితుల అవకాశాన్ని సైతం తోసిపుచ్చింది. మన దేశంలో 52% నికర సాగు భూమికి ఇప్పటికీ వర్షపాతమే ప్రధాన ఆధారం. దేశ మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో ఈ సాగు భూమి నుంచి ఏకంగా 40% దిగుబడి వస్తుంది. అందుకే భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. దేశవ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైన జలాశయాలను తిరిగి నింపడానికి, దేశ జీడీపీకి 18.2 శాతం తోడ్పాటుకు ఇది ఎంతో ముఖ్యం.



## మరోసారి శ్రీనగర్ ఎయిర్‌పోర్టు సమీపంలో భారీ పేలుళ్లు

**శ్రీనగర్ :** భారత్‌పై పాకిస్థాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడులకు తెగబడుతున్న విషయం తెలిసిందే. తాజాగా శ్రీనగర్‌లో మరోసారి భారీ పేలుళ్లు సంభవించినట్లు ఆర్మీ అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్ విమానాశ్రయం సమీపంలో 11.45 గంటల ప్రాంతంలో రెండు భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించాయని తెలిపారు. ఈ పేలుళ్ల కారణంగా ప్రజలు భయాందోళనకు గురయ్యారని.. విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని అన్నారు. పేలుళ్ల శబ్దం వినిపించిన వెంటనే పలు ప్రాంతాల్లో సైరన్లు మోగించి.. ప్రజలను అప్రమత్తం చేశామని పేర్కొన్నారు. అవంతిపురం సమీపంలో ఐదుసార్లు భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు అధికారులు పేర్కొన్నారు. శ్రీనగర్‌లోని దాల్ సరస్సులో క్షిపణి లాంటి వస్తువు పడినట్లు గుర్తించామన్నారు. శనివారం తెల్లవారుజామున శ్రీనగర్ విమానాశ్రయంపై.. ఎయిర్ బేస్‌పై డ్రోన్లతో దాడి చేయగా.. సైన్యం వాటిని తిప్పికొట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో పాక్ వరుస దాడులకు పాల్పడుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో, బాల్కనీల్లో ఉండకుండా ఇళ్లల్లోనే ఉండాలని హెచ్చరించారు. పంజాబ్‌లోని బఠిండాలో అధికారులు రెడ్ అలర్ట్ విధించారు. శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో పేలుళ్లు సంభవిస్తుండడంతో దానితో సహా ఉత్తర, పశ్చిమ భారత్‌లోని 32 విమానాశ్రయాలను ఈనెల 15 వరకు మూసివేస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది.



## పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోంది : భారత్

**న్యూఢిల్లీ :** పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోందని ఆర్మీ ప్రతినిధి సోఫియా ఖురేషీ పేర్కొన్నారు. భారత్-పాక్ సరిహద్దుల్లో ఘర్షణలపై విదేశాంగశాఖ, మిలిటరీ ప్రెస్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో విదేశాంగశాఖ ప్రతినిధి విక్రమ్ మిస్రీ, సైన్యానికి చెందిన కర్నల్ సోఫియా ఖురేషీ, వాయుసేనకు చెందిన వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ పాల్గొన్నారు. తొలుత కర్నల్ సోఫియా ఖురేషీ మాట్లాడుతూ "పశ్చిమ సరిహద్దుల్లో పాక్ నిరంతరం దాడులు చేస్తోంది. డ్రోన్లు, దీర్ఘశ్రేణి ఆయుధాలు, లాయిటరింగ్ మ్యూనిషన్, ఫైటర్ జెట్లను వాడి.. భారత మిలిటరీ స్థావరాలపై దాడులు చేస్తోంది. అయితే వాటిని భారత్ తిప్పికొట్టింది. కానీ, 26 చోట్ల పాక్ ఆయుధాలు గగనతలంలోకి చొచ్చుకొచ్చాయి. అవి ఉధంపూర్, భుజ్, పఠాన్‌కోట్, భఠిండా వాయుసేన స్థావరాల్లోని పరికరాలను దెబ్బతీసి, సిబ్బందిని గాయపర్చాయి. తెల్లవారుజామున 1.40 సమయంలో పాక్ హైస్పీడ్ మిసైల్స్‌తో పంజాబ్‌లోని వాయుసేన స్థావరాలపై దాడులు చేసింది. శ్రీనగర్, అవంతిపుర, ఉధంపూర్‌లో వైద్య కేంద్రాలపై దాడి చేసింది. ఇది రెచ్చగొట్టే చర్య అని కచ్చితంగా తెలుస్తోంది" "దీనికి తగినట్లు ప్రతిస్పందిస్తూ.. భారత దళాలు పాక్‌లోని మిలిటరీ స్థావరాలు, రాడార్లు, కమాండ్ కంట్రోల్ సెంటర్లపై దాడులు చేసింది. వీటిల్లో రఫీకీ, మురిద్, చక్లాల, రహిమ్ యార్ ఖాన్, సుక్కుర్, చునియాన్ స్థావరాలు ఉన్నాయి. ఫైటర్ జెట్లతో అత్యంత కచ్చితంగా లక్ష్యాలు ఛేదించే ఆయుధాలు వాడి ఈ దాడులు నిర్వహించాము. పస్రూర్‌లో రాడార్ కేంద్రం, సియాల్ కోట్‌లోని ఏవియేషన్ బేస్‌ను ధ్వంసం చేశాము. ఈ దాడుల సందర్భంగా పౌరులు ప్రాణాలు పోకుండా చాలా జాగ్రత్తలు తీసుకొన్నాం" "పాక్ సైన్యం సరిహద్దుల దిశగా కదులుతోంది. ఇది పరిస్థితిని మరింత దిగజార్చే ప్రమాదకర చర్య" అని పేర్కొన్నారు. ఇదే అంశాన్ని వ్యోమికా సింగ్ అంతర్జాతీయ మీడియా కోసం ఆంగ్లభాషలో వెల్లడించారు. భారత స్థావరాలు సురక్షితంగా ఉన్నాయని టైమ్ స్టాంప్‌లు ఉన్న వీడియోలు, ఫొటోలను ప్రదర్శించారు. విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. 'శిర్సా, సూరత్‌ఘర్ వైమానిక స్థావరాలను ధ్వంసం చేశామని పాక్ చెప్పడం పూర్తిగా తప్పు. దీంతోపాటు ఆదంపుర్‌లోని ఎస్-400 , బ్రహ్మోస్ మిసైల్ డిపో, పలుచోట్ల ఎయిర్‌ఫీల్డ్‌లను ధ్వంసం చేసినట్లు తప్పుడు ప్రచారాలు చేస్తోంద"న్నారు. ప్రజలు ఇలాంటి వాటిని నమ్మొద్దని చెప్పారు.

# భారత్ - పాక్ ఉద్రిక్తత..

## మీ ఫోన్లలో 'ఎమర్జెన్సీ అలర్ట్స్' పెట్టుకున్నారా?

**న్యూఢిల్లీ :** ప్రస్తుతం భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తత కొనసాగుతోంది. పహల్గాంలో పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపిన ఉగ్రవాదులు 26 మందిని పొట్టన పెట్టుకున్న సంగతి తెలిసిందే. దీంతో పాక్‌లోని, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలను లక్ష్యంగా చేసుకొని భారత్ దాడులు చేసింది. పాకిస్థాన్ మాత్రం సాధారణ పౌరులు, ఇండియన్ ఆర్మీని లక్ష్యంగా దాడులు మొదలుపెట్టింది. దీంతో సరిహద్దు ప్రాంతాల్లో ప్రజలను హెచ్చరిస్తూ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఇంతవరకు వీధుల్లో తిరుగుతూ ప్రకటనలు చేయడం చూశాం కదా.. అయితే, ఇప్పుడు నేరుగా ఫోన్లకే ఇలాంటి సందేశాలూ వచ్చేలా చేశారు. నెట్‌వర్క్ సమస్యలు ఉన్నప్పుడూ మెసేజ్‌లు వచ్చే వెసులుబాటు ఉంది. వాటిని ఫాలో అయి సురక్షితమైన ప్రాంతాలకు చేరితే సరిపోతుంది. సునామీలు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు.. యుద్ధాలు, ఉగ్రవాద దాడులు జరిగినప్పుడు ప్రజలను అప్రమత్తం చేసేందుకు భారత ప్రభుత్వం వైర్‌లెస్ ఎమర్జెన్సీ అలర్ట్ వ్యవస్థను రూపొందించింది. ఆకస్మిక పరిస్థితుల్లో ప్రజలకు అలర్ట్ మెసేజ్ ద్వారా సమాచారం చేరవేయడమే లక్ష్యంగా దీన్ని రూపొందించింది. ఇప్పుడు పాకిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అప్‌డేట్స్ మిస్ కాకుండా ఉండేందుకు ఫోన్లలో ఈ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలని నిపుణులు సూచించారు. ఆండ్రాయిడ్, ఐఫోన్లలో ఈ వెసులుబాటు ఉంది. మీ ఫోన్లలో అలర్ట్స్ డిజేబుల్ చేసి ఉంటే ఇప్పుడైనా ఎనేబుల్ చేసుకోవాలి. మరి అదెలా చేయాలో తెలుసుకుందాం..

### ఆండ్రాయిడ్ యూజర్లు..




- ఫోన్‌లోని సెట్టింగ్స్‌ను ఓపెన్ చేయాలి
- సేఫ్టీ అండ్ ఎమర్జెన్సీ ఆప్షన్‌ను టాప్ చేయాలి. లేకపోతే 'ఎమర్జెన్సీ అలర్ట్స్' అని సెర్చ్‌బార్‌లో శోధించొచ్చు
- వైర్‌లెస్ ఎమర్జెన్సీ అలర్ట్స్‌ను ఎంపిక చేయాలి
- శామ్‌సంగ్, షియోమి, వన్‌ప్లస్.. పేర్లు భిన్నంగా ఉండొచ్చు.
- అన్ని ఆప్షన్లను యాక్టివేట్ చేసుకోవాలి


### ఐఫోన్ యూజర్లు

- సెట్టింగ్స్ యాప్‌ను ఓపెన్ చేయాలి
- నోటిఫికేషన్స్‌కు వెళ్లాలి
- గవర్నమెంట్ అలర్ట్స్ అని ఉంటుంది
- కీలక అలర్ట్‌లు వచ్చేందుకు ఆప్షన్‌ను ఆన్ చేయాలి
- ఒక్కో ఎమర్జెన్సీ సమయంలో ఒక్కోలా అలర్ట్స్ వస్తుంటాయి

## భారత్‌తో చర్చలు జరపండి.. మధ్యవర్తిత్వం చేస్తాం

### పాక్‌కు అమెరికా సూచన

**న్యూఢిల్లీ :** పరిస్థితులు మరింత తీవ్రతరం కాకముందే భారత్‌తో తక్షణం చర్చలు జరపాలని పాకిస్థాన్‌కు అమెరికా సూచనలు చేసింది. పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌తో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఫోన్‌లో మాట్లాడినట్లు విదేశాంగ ప్రతినిధి వెల్లడించారు. భారత్- పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో వీరు మాట్లాడుకోవడం గమనార్హం. పెరుగుతున్న సైనిక ఉద్రిక్తతలను తగ్గించడానికి తక్షణం చర్యలు తీసుకోవాలని రూబియో పాక్‌కు సూచించారని విదేశాంగశాఖ తెలిపింది. ఉద్రిక్తతలు మరింత తీవ్రతరం కాకుండా ఉండేందుకు అవసరమైతే ఇరు దేశాల మధ్య తాము మధ్యవర్తిత్వం చేస్తామని ప్రతిపాదించినట్లు వెల్లడించింది. ఇదిలాఉండగా.. భారత విదేశాంగ మంత్రి జై శంకర్‌తోనూ రూబియో ఫోన్‌లో మాట్లాడారు. భారత్-పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు సద్దుమణిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని రూబియో సూచించారు. ఇరుదేశాల మధ్య వివాదాల ముగింపునకు చర్చలు జరపాలని, అందుకు అమెరికా పూర్తి సాయం అందిస్తుందని తెలిపారు. ఈ



ఫోన్‌కాల్ విషయాన్ని జై శంకర్ స్వయంగా ధ్రువీకరించారు. ఈ సందర్భంగా భారత్ విధానం ఎప్పుడూ బాధ్యతాయుతంగానే ఉంటుందని స్పష్టం చేశారు. భారత్-పాక్‌లు సంయమనం పాటించాలని జీ7 దేశాలు పిలుపునిచ్చాయి. పహల్గాం ఉగ్రదాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. ఈసందర్భంగా ఇరుదేశాల మధ్య పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలిపాయి. భారత్- పాక్‌లలోని పౌరుల భద్రతపై ఆందోళన చెందుతున్నామని, శాంతిస్థాపన కోసం ఇరుదేశాలు చర్చలు జరపాలని ప్రతిపాదించాయి.

## పాక్ మరింత రెచ్చిపోతే పీఓకే, బలోచిస్థాన్ పోవడం ఖాయం

**: మాజీ లెఫ్టినెంట్ జనరల్**

పాకిస్థాన్ కావాలనే భారత్‌ను రెచ్చగొడుతోందని, యుద్ధానికి పురిగొల్పుతోందని ఆర్మీ రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ ఏఆర్కే రెడ్డి అన్నారు. ఒకవేళ ద్వైపాక్షిక చర్చలు, వెనక్కి తగ్గుతామని ప్రకటించినా ఆ దేశాన్ని అంత సులువుగా నమ్మకూడదన్నారు. భారత్‌తో యుద్ధానికి కాలు దువ్వితే పాక్ ఆక్రమిత కశ్మీర్, బలోచిస్థాన్ వంటివి కోల్పోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. గత ఉదంతాలను పాక్ ఓసారి గుర్తు చేసుకోవాలన్నారు. ఈ మేరకు 'ఆపరేషన్ సిందూర్', తదనంతరం భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల గురించి ఈనాడు.నెట్‌తో ఎక్స్‌క్లూజివ్‌గా మాట్లాడారు. కార్గిల్ యుద్ధ సమయంలో నార్తర్న్ కమాండ్‌కు చీఫ్ స్టాఫ్‌గా వ్యవహరించిన ఆయన.. వివిధ అంశాలపై మాట్లాడారు. ఆయన మాటల్లోనే..

### పాక్ కావాలనే రెచ్చగొడుతోంది..

పహల్గాంలో పర్యాటకానికి వచ్చిన వారిని మతం అడిగి మరీ పాకిస్థాన్ ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. దానికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. భారత్ కేవలం పాక్ ఉగ్రస్థావరాల మీదే దాడికి పాల్పడింది. మిలటరీ, పౌరుల జోలికి పోలేదు. భారత్ తనంతట తానుగా యుద్ధాన్ని కోరుకోవడం లేదనడానికి ఇదే నిదర్శనం. పాక్ పరిస్థితి వేరు. ఆర్థికంగా అంతంత మాత్రంగానే ఉన్నా.. భారత్ చూసి ఓర్వలేక కావాలనే కయ్యానికి కాలు దువ్వుతోంది. అక్కడి ప్రజలను, దేశ ఆర్థిక పరిస్థితి గురించి పట్టించుకునే పరిస్థితిలో ఆ దేశం లేదు. అక్కడి మిలటరీ ఏం చెప్తే అది. ఉగ్రవాదాన్ని మాత్రం వారు వదలరు. లష్కరే తయ్యిబా, జైషే మహ్మద్ వంటి ఉగ్ర ముఠాలను స్ట్రాటజిక్ అసెట్‌లుగా ఆ దేశం భావిస్తోంది.

### మన సన్నద్ధతలో మనం ఉండాలి..

భారత్ తమపై చేస్తున్న సైనిక దాడిని ఇక్కడితో ఆపితే తాము కూడా ఉద్రిక్తతలు తగ్గించడానికి చర్యలు తీసుకుంటామని ఓ వైపు అక్కడి విదేశాంగ శాఖ చెబుతోంది. మరోవైపు తమ సైన్యాన్ని సరిహద్దులవైపు నడిపిస్తోంది. మన దృష్టి మరల్చేందుకు పాక్ ఇలాంటి కుయుక్తులను పన్నుతుంటుంది. పాక్ ఎప్పుడు ఏ మూల నుంచైనా దాడి చేసే అవకాశం ఉంది. మన సన్నద్ధతలో మనం ఉండాలి. పాక్ ఓ వైపు డ్రోన్లను ప్రయోగిస్తోంది. స్కూళ్లు, ప్రార్థనా మందిరాలు, ఆస్పత్రుల మీద దాడులు చేస్తోంది. మనం పాక్ పౌరుల జోలికి పోకపోయినా.. దాయాది దేశం మాత్రం ఉన్మాదంతో ఈ తరహా దాడులకు పాల్పడుతోంది. తమ ఆర్మీ బలమైనదని నిరూపించుకునే ప్రయత్నం చేస్తోంది. వాస్తవానికి అక్కడి పౌరులకే ఆర్మీ అంటేనే ఏహ్య భావం. వాళ్ల పట్ల ప్రజలకు ఉన్నది భయమే తప్ప.. గౌరవం కాదు.

### తగ్గాల్సింది పాకిస్థానే

ఒకవేళ ప్రస్తుత ఉద్రిక్తత పరిస్థితులను నిజంగా తగ్గించుకోవాలని ఆ దేశం అనుకుంటే పాకిస్థానే వెనక్కి



తగ్గాలి. పహల్గాంలో భార్య ముందు భర్తను, కుమారుడి ముందు తండ్రిని దారుణంగా హతమార్చారు. కావాలనే మనల్ని రెచ్చగొట్టారు. మన దగ్గర సుస్థిరమైన ప్రభుత్వం ఉంది. మన సాయుధ బలగాలు దృఢంగా ఉన్నాయి. 140 కోట్ల మంది పౌరులు మన సాయుధ బలగాల వెంట ఉన్నారు. ఉగ్రవాదులను రెచ్చగొట్టి భారత్‌పై ఉసిగొల్పుతున్న పాకిస్థానే ఈ విషయంలో వెనక్కి తగ్గాలి. ఉగ్రవాదులు చనిపోతే అధికారికంగా అంత్యక్రియలు చేసే సంస్కృతి ఆ దేశానిది.

### పీఓకే, బలోచిస్థాన్ పోవడం ఖాయం

కార్గిల్ యుద్ధాన్ని దగ్గర నుంచి చూశా. అప్పట్లో నియంత్రణ రేఖ దాటకూడదన్న లక్ష్మణ రేఖ ఉండేది. కార్గిల్ యుద్ధంలో పాక్ ఓడిపోయినప్పుడు నవాజ్ షరీఫ్ ప్రభుత్వం కుప్పకూలింది. ముషారఫ్ అధికార పగ్గాలు చేపట్టారు. కార్గిల్ యుద్ధం అనేది ఆ దేశంలో రాజకీయ అస్థిరతకు కారణమైంది. తర్వాత ముషారఫ్ ప్రభుత్వం కూడా అధికారం కోల్పోయింది. కానీ, ఇన్నేళ్లుగా మన ప్రజాస్వామ్య ప్రభుత్వం సుస్థిరంగా ఉంది. గతంలో భారత్‌తో పెట్టుకుని తూర్పు పాకిస్థాన్ (బంగ్లాదేశ్) కోల్పోయింది. కార్గిల్ విషయంలో ఎదురుదెబ్బ చూసింది. ఆర్థికంగానూ నష్టపోయింది. ఇప్పుడూ అదే ధోరణిని కనబరిస్తే పీఓకేను స్వాధీనం చేసుకోవడానికి భారత్ ఏమాత్రం వెనుకాడదు. మరోవైపు పాక్ బలోచిస్థాన్ రూపంలో తిరుగుబాటు ఎదుర్కొంటోంది. ఏ క్షణంలోనైనా బలోచిస్థాన్ విముక్తి జరగొచ్చు. పాకిస్థాన్‌కు అఫ్గానిస్థాన్‌తోనూ గొడవలు ఉన్నాయి. భారత్‌తో యుద్ధానికి దిగే ముందు ఇవన్నీ పాక్ గుర్తించాలి. మన సాయుధ బలగాలు చాలా బలంగా ఉన్నాయి. అయినా కాదని కయ్యానికి కాలు దువ్వితే ఆ దేశానికి భంగపాటు తప్పదు. తుర్కియే అనేది ఓ చిన్న దేశం. ఆ దేశం మన మీద వ్యతిరేకతతో పాకిస్థాన్‌కు డ్రోన్లను అందిస్తోంది. వాటివల్ల మనకు వాటిల్లే నష్టం తక్కువే. పాకిస్థాన్ దగ్గర అమెరికాకు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానాలు ఉన్నాయి. వాటిని భారత్ మీద వాడకూడదనే నిబంధన ఉంది. ఒకవేళ వాడితే యుద్ధ సామగ్రి సరఫరాను అమెరికా నిలిపివేస్తుంది. చైనాకు పాకిస్థాన్ మీద పెద్ద ప్రేమ లేదు.

## చర్చలు జరపడానికి సిద్ధం

### పాక్ విదేశాంగ మంత్రి కీలక వ్యాఖ్యలు



**ఇస్లామాబాద్ :** భారత్ తమపై దాడి చేస్తే ఎదురుదాడికి దిగుతామని మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిన పాక్ ఇప్పుడు మాట మార్చేసింది. పాక్ విదేశాంగ శాఖ మంత్రి ఇషాక్ దార్ మీడియాతో మాట్లాడుతూ.. భారత్ తమపై చేస్తున్న సైనిక దాడిని ఇక్కడితో ఆపితే తాము కూడా ఉద్రిక్తతలు తగ్గించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇరుదేశాల మధ్య దాడుల వల్ల పాక్ ఆర్థిక పరిస్థితి కుదేలవ్వడం, ప్రజల పరిస్థితులు అధ్వానంగా మారే ప్రమాదం ఉండడంతో.. ఈ యుద్ధ వాతావరణాన్ని రూపుమాపడం కోసం న్యూఢిల్లీతో చర్చలు జరపడానికి ఇస్లామాబాద్ సిద్ధంగా ఉందని పాక్ అధికారిక వర్గాలు వెల్లడించాయి. భారత్-పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో పరిస్థితులు చేయి దాటకముందే దాడుల నివారణకు చర్యలు తీసుకోవాలని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో ఇరుదేశాలకు సూచించారు. ఈ నేపథ్యంలో పాక్ విదేశాంగశాఖ మంత్రి ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. గురువారం రాత్రి నుంచి పాక్ భారత సరిహద్దు ప్రాంతాల్లో దుస్సాహసానికి ఒడిగడుతూనే ఉంది. బారాముల్లా నుంచి భుజ్ వరకు 26 ప్రాంతాల పైకి వరసగా డ్రోన్లు ప్రయోగించింది. ముఖ్యంగా శ్రీనగర్ విమానాశ్రయాన్ని, అవంతీపొరా వైమానిక స్థావరాన్ని లక్ష్యంగా చేసుకొని డ్రోన్లను ప్రయోగిస్తూ.. విఫలయత్నం చేస్తుండగా, దాయాది చర్యలను భారత సైన్యం తిప్పి కొడుతోంది. శనివారం మరోసారి జమ్మూ, ఫిరోజ్‌పుర్, పఠాన్‌కోట్, జైసల్మేర్, బాడ్‌మేడ్, భుజ్ తదితర ప్రాంతాలపై వీటిని మళ్లీ పంపేందుకు ప్రయత్నించగా భారత సైనికులు వాటిని కూల్చివేశారు.



## భారత్- పాకిస్థాన్ ఉద్రిక్తతలు..

### మరోసారి స్పందించిన చైనా

**చైనా :** భారత్- పాకిస్థాన్‌ల మధ్య సమస్యకు ముగింపు పలికేందుకు అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషిస్తామని చైనా పేర్కొంది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో బీజింగ్ ఈమేరకు పేర్కొనడం గమనార్హం. ఇరుదేశాలు సంయమనం పాటించాలని చైనా విదేశాంగ శాఖ శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. 'భారత్- పాక్‌ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తత పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం. శాంతి, స్థిరత్వం కోసం ఇరుదేశాలు సమయమనం పాటించాలని కోరుతున్నాం. శాంతియుత మార్గాలతో సమస్యలను పరిష్కరించుకోవాలి. ఉద్రిక్తతలను తీవ్రతరం చేసే చర్యలను తగ్గించుకోవాలని సూచిస్తున్నాం. ఈ ఉద్రిక్తతలను తగ్గించాలని అంతర్జాతీయ సమాజం కూడా ఆశిస్తోంది. ఈ సమస్య ముగింపునకు అవసరమైతే నిర్మాణాత్మక పాత్ర పోషించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం' అని బీజింగ్ పేర్కొంది. ఏప్రిల్ 22న పహల్గాంలో పర్యటకులపై జరిగిన ఉగ్రదాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. దీనికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' పేరుతో పాక్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాల లక్ష్యంగా దాడులు చేసింది. దీంతో భారత్- పాక్‌ల మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమయ్యాయి.



## పాక్ దాడులు.. మృతుల కుటుంబాలకు రూ.10లక్షల పరిహారం

**శ్రీనగర్ :** గత రెండు రోజుల నుంచి జమ్మూకశ్మీర్ సరిహద్దు ప్రాంతాలపై పాక్ జరుపుతున్న దాడుల్లో దాదాపు 20మంది పౌరులు మృతి చెందిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా నష్టపరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు తమ ప్రభుత్వం ఎప్పటికీ మద్దతుగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. పహల్గాం దాడికి ప్రతీకారంగా ఉగ్రస్థావరాలను భారత్ ధ్వంసం చేయడంతో.. పాక్ కూడా సరిహద్దు ప్రాంతాల్లో ప్రతీకార దాడులకు పాల్పడుతోంది. నియంత్రణ రేఖ వెంట పాక్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి దాడులకు తెగబడుతోంది. కశ్మీర్‌లోని శ్రీనగర్, రాజౌరి, పూంఛ్, పఠాన్ కోట్ ప్రాంతాల్లో పాక్ డ్రోన్‌లతో దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో జమ్మూకశ్మీర్ ప్రభుత్వ అధికారి రాజ్‌కుమార్ థప్పా సహా దాదాపు 20మంది పౌరులు ప్రాణాలు కోల్పోగా..పదుల సంఖ్యలో గాయపడ్డారు. పౌరులు, ప్రభుత్వ ఉన్నతాధికారి మృతి పట్ల జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కరోజు ముందే తాను అధ్యక్షత వహించిన ఆన్‌లైన్ సమావేశంలో రాజ్‌కుమార్ పాల్గొన్నారని.. ఇంతలోనే రాజౌరిలోని ఆయన ఇంటిపై జరిగిన దాడిలో ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని అన్నారు. శనివారం వేకువజామున కూడా భారత్‌పై పాకిస్థాన్ సైన్యం దాడులకు పాల్పడింది. రాత్రి నుంచే సరిహద్దు రాష్ట్రాల్లో కొన్నిచోట్ల బాంబుపేలుళ్లు వినిపించడంతో అధికారులు అప్పటికప్పుడు విద్యుత్తు సరఫరా నిలిపివేసి 'బ్లాకౌట్' పాటించారు. శ్రీనగర్, పఠాన్ కోట్ ప్రాంతాల్లో ఉదయం కూడా పేలుళ్ల శబ్దాలు వచ్చినట్లు స్థానికులు పేర్కొన్నారు. కాగా పాక్ దాడులను భారత్ సమర్థంగా తిప్పికొట్టింది. సరిహద్దు ప్రాంతాల్లో అధికారులు సైరన్లు మోగిస్తూ ప్రజలను అప్రమత్తం చేశారు. మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో మరోసారి శ్రీనగర్ ఎయిర్‌పోర్ట్ సమీపంలో భారీగా పేలుళ్లు సంభవించినట్లు శబ్దాలు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు.





# వందే భారత్‌లో ఢిల్లీకి క్రికెటర్లు

## ధర్మశాల నుంచి జలంధర్ మీదుగా పంజాబ్, డీసీ జట్ల ప్రయాణం

**ధర్మశాల:** ధర్మశాలలో గురువారం పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య ఐపీఎల్ మ్యాచ్ ఆగిపోయిన నేపథ్యంలో తర్వాతి రోజు ఈ రెండు జట్ల ఆటగాళ్లు, సిబ్బందిని వందే భారత్ ప్రత్యేక రైలులో ఢిల్లీకి తీసుకెళ్లారు. భారత్, పాక్ మధ్య దాడులు, ప్రతిదాడుల నేపథ్యంలో ధర్మశాల సహా పలు విమానాశ్రయాలను మూసేసిన సంగతి తెలిసిందే. దీంతో పంజాబ్, ఢిల్లీ ఆటగాళ్లను రైల్లో ఢిల్లీకి తీసుకెళ్లాల్సి వచ్చింది. మ్యాచ్ ఆగిపోయాక కాసేపటికే భారీ భద్రత మధ్య ఆటగాళ్లను వారు బస చేస్తున్న హోటళ్లకు తీసుకెళ్లిన పోలీసులు.. తర్వాతి రోజు ఉదయం ఢిల్లీ ప్రయాణానికి ఏర్పాట్లు చేశారు. ఆ సమయంలో ముందు జాగ్రత్తగా ఎక్కువ మందితో బస్సుల్లో ప్రయాణించడాన్ని కూడా నివారించారు. దాదాపు 50 వాహనాలను వినియోగించి చిన్న చిన్న బృందాలుగా రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఆటగాళ్లకు భద్రతగా పెద్ద సంఖ్యలో పోలీసు వాహనాలు కూడా వెంట వెళ్లినట్లు కంగ్రా జిల్లా ఎస్పీ వెల్లడించారు. అత్యవసరంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో జలంధర్ మీదుగా పంజాబ్, డీసీ ఆటగాళ్లు, సిబ్బంది ఢిల్లీకి చేరుకున్నారు.

**తొక్కిసలాట జరగకుండా..** పకడ్బందీగా: గురువారం రాత్రి ధర్మశాలలో గురువారం రాత్రి ఢిల్లీ, పంజాబ్ మధ్య మ్యాచ్ అర్ధంతరంగా ఆగిపోవడానికి కారణం ఫ్లడ్ లైట్ల వైఫల్యమే అని ముందు అనుకున్నారంతా. కానీ జమ్ము సహా పలు నగరాలపై పాకిస్థాన్ సైన్యం డ్రోన్ దాడులకు పాల్పడిన నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల్లోని అనేక నగరాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఈ క్రమంలోనే ధర్మశాలలోనూ ఫ్లడ్ లైట్లు ఆగిపోయాయి. పరిస్థితి తీవ్రత దృష్ట్యా మ్యాచ్‌ను కొనసాగించడం మంచిది కాదని ఐపీఎల్ అధికారులకు ప్రభుత్వ వర్గాల నుంచి సమాచారం వచ్చింది. అయితే భద్రత కారణాలతో మ్యాచ్ ఆపేస్తున్నట్లు చెబితే ప్రేక్షకులు ఆందోళనకు గురై, తొక్కిసలాట జరిగే ప్రమాదం ఉందని ఐపీఎల్ అధికారులు, పోలీసులు భావించారు. ఆ సమయంలో స్టేడియంలోనే ఉన్న ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధూమల్.. పోలీసులతో సమన్వయం చేసుకుని గందరగోళానికి తావివ్వకుండా ప్రేక్షకులను బయటికి పంపే ఏర్పాట్లు చేశారు. ఫ్లడ్ లైట్ల వైఫల్యం వల్లే మ్యాచ్ ఆగిందని, అవి మళ్లీ వెలగవని చెప్పి అభిమానులతో స్టేడియం ఖాళీ చేయించారు. "ముందు ఫ్లడ్‌లైట్ల వైఫల్యం గురించి చెబితే ప్రేక్షకులు స్టేడియాన్ని వీడలేదు. అయినా వారిని ఒత్తిడికి గురి చేయకుండా, తొక్కిసలాటకు ఆస్కారం ఇవ్వకుండా అందరినీ బయటికి పంపాం. హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ సంఘం అధికారులు, పోలీసుల వల్లే అరగంటలోనే 25 వేల మంది ప్రేక్షకులను ఖాళీ చేయించగలిగాం" అని ధూమల్ తెలిపాడు.

**పీఎస్ఎల్ కూడా..**

లాహోర్: భారత్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)ను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) వాయిదా వేసింది. టోర్నీలో మిగిలిన మ్యాచ్‌లను యూఏఈలో నిర్వహించనున్నట్లు ప్రకటించిన కొన్ని గంటల్లోనే పీసీబీ ఈ వాయిదా నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి షాబాజ్ షరీఫ్ సలహా మేరకు టోర్నమెంట్‌ను వాయిదా వేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది. కానీ అసలు కారణం.. పీఎస్ఎల్ మిగతా మ్యాచ్‌లకు ఆతిథ్యమివ్వడానికి యూఏఈ సిద్ధంగా లేకపోవడమే అని సమాచారం. మ్యాచ్‌ల నిర్వహణకు పీసీబీ ప్రతిపాదిస్తే యూఏఈ తిరస్కరించే అవకాశముంది. "గత కొన్నేళ్లుగా బీసీసీఐతో ఎమిరేట్స్ క్రికెట్ బోర్డు బలమైన సంబంధాల్ని కొనసాగిస్తోంది. 2021లో భారత్ ఆతిథ్యం ఇవ్వాల్సిన ఐసీసీ టీ20 ప్రపంచకప్‌ను, అదే ఏడాది ఐపీఎల్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో టీమ్ఇండియా మ్యాచ్‌లను నిర్వహించింది" అని యూఏఈ బోర్డు వర్గాలు తెలిపాయి. ఐసీసీ ప్రధాన కార్యాలయం కూడా దుబాయ్‌లోనే ఉంది. ప్రస్తుతం ఐసీసీకి జై షా ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నాడు.



## పాక్‌కు అంత సీన్ లేదు..

### త్వరలోనే మ్యాచులు చూస్తాం : గంగూలీ



భారత్ - పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఐపీఎల్ 2025 సీజన్‌ను బీసీసీఐ వారం రోజులపాటు వాయిదా వేసింది. దాయాదుల మధ్య యుద్ధ వాతావరణం నెలకొనడంతో క్రికెట్ ఆడటం సమంజసం కాదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, త్వరలోనే మళ్లీ ఐపీఎల్ మ్యాచ్‌లు చూస్తామని.. పాకిస్థాన్ మరింతకాలం ఒత్తిడి తట్టుకోవడం కష్టమని భారత మాజీ కెప్టెన్ సౌరభ్ గంగూలీ వ్యాఖ్యానించాడు. "ప్రస్తుతం దేశంలో యుద్ధ వాతావరణం ఉంది. దీంతో బీసీసీఐ ఐపీఎల్‌ను వాయిదా వేసింది. ఎందుకంటే భారత్‌కు చెందిన క్రికెటర్లే కాకుండా విదేశీ ప్లేయర్లు చాలామంది ఉన్నారు. వారి భద్రత విషయంలో రాజీ పడకూడదు. అయితే, త్వరలోనే ఐపీఎల్ 2025 సీజన్ పునఃప్రారంభమవుతుంది. ఇప్పుడు టోర్నీ కీలక దశలో ఉంది. ధర్మశాల, చండీగఢ్, ఢిల్లీ, జైపుర్.. ఇలాంటి మైదానాల్లో కొన్ని మ్యాచులు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో బీసీసీఐ నిర్ణయం సరైందే. గత మ్యాచ్ సమయంలో ఏం జరిగిందో చూశాం. త్వరలోనే పరిస్థితులు చక్కబడతాయి. బీసీసీఐ తప్పకుండా ఐపీఎల్‌ను పూర్తిచేసింది. ఎందుకంటే ఒత్తిడిని మరింత కాలం తట్టుకొనేంత సీన్ పాక్‌కు లేదు" అని గంగూలీ తెలిపాడు.

## రోహిత్ బాటలోనే విరాట్ కోహ్లీ.. టెస్టులకు వీడ్కోలు?



భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కూడా టెస్టులకు రిటైర్‌మెంట్ తీసుకుంటాడా? అవుననే అంటున్నాయి క్రికెట్ వర్గాలు. ఇటీవల కెప్టెన్ రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. అతడి బాటలోనే కోహ్లీ టెస్టులకు వీడ్కోలు పలకాలని భావిస్తున్నట్లు క్రికెట్ వర్గాలు వెల్లడించాయి. ఈ విషయాన్ని బీసీసీఐ దృష్టికి తీసుకెళ్లినట్లు వార్తలు వస్తున్నాయి. జూన్ నుంచి ఇంగ్లాండ్ పర్యటనకు టీమ్ఇండియా వెళ్లనుంది. ఆలోగానే టెస్టు భవితవ్యంపై కోహ్లీ ప్రకటన చేస్తాడని సమాచారం. తన రిటైర్‌మెంట్ ఆలోచనను పరిగణనలోకి తీసుకోవాలని బీసీసీఐకి కోహ్లీ చెప్పినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం కోహ్లీ ఐపీఎల్‌లో ఆడుతున్నాడు. ఇప్పటికే రోహిత్, రవీంద్ర జడేజాతో కలిసి టీ20లకు గుడ్‌బై చెప్పేసిన సంగతి తెలిసిందే.



# నమ్మిస్తారు.. ఖాతా ఖాళీ చేస్తారు..

## పెరుగుతున్న క్రెడిట్‌కార్డు మోసాలు

## 4 నెలల్లో 80కి పైగా కేసులు

**హైదరాబాద్ :** సైబర్ నేరాలపై అవగాహన ఉన్నా.. కొంచెం ఏమరుపాటు, నిర్లక్ష్యం డబ్బు పోయేందుకు కారణమంటున్నారు సైబర్ క్రైమ్ పోలీసులు. నగరంలో ప్రతి నెలా 15-20 క్రెడిట్ కార్డు మోసాలపై కేసులు నమోదవుతున్నాయి. ఈ ఏడాది 4 నెలల్లో వచ్చిన 80 ఫిర్యాదుల్లో 90 శాతం మంది ప్రైవేటు ఉద్యోగులు. 10 శాతం గృహిణులు ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

మోసం చేస్తారిలా..!

పనివేళల్లో ఫోన్ చేస్తారు. అనుమానం రాకుండా ఖాతాదారుడి వ్యక్తిగత సమాచారం చెప్పి కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నట్లు నమ్మిస్తారు. క్రెడిట్ కార్డుతో కొనుగోళ్లు బాగా చేశారని, రివార్డు పాయింట్లతో నగదు, విలువైన వస్తువులు కొనుగోలు చేసేందుకు గడువు ముగుస్తుందంటారు. తాము పంపే లింక్‌ను క్లిక్ చేస్తే కోరిన వస్తువులు గుమ్మం వద్ద చేరుతుందని చెప్పి, సమాచారం సేకరించి సొమ్ము స్వాహా చేస్తారు. కస్టమర్‌కేర్ నుంచి వచ్చిన ఫోన్‌కాల్‌ను నమ్మని వాళ్లను సైతం తేలిగ్గా బుట్టలో పడేస్తారు. తమకు ఎటువంటి వివరాలు చెప్పవద్దని, తాము పంపే లింక్ ద్వారా యాప్ డౌన్‌లోడ్ చేసుకొని కేవైసీ అప్‌డేట్, రివార్డులు సొంతం చేసుకోమని చెబుతారు. ఏపీకే ఫైల్ డౌన్‌లోడ్ చేయించి 'స్క్రీన్ షేరింగ్'తో లావాదేవీలు తమ అధీనంలోకి తీసుకొని అందినంత కాజేస్తారు. క్రెడిట్‌కార్డుల నుంచి పరిమితంగానే నగదు ఉపసంహరించుకునే వీలుంది. దీంతో కొత్త తరహాలో నగదు స్వాహా చేస్తున్నారు. నకిలీ చిరునామా, వ్యాపార సంస్థల పేరిట స్వైపింగ్ మెషీన్లు తీసుకొంటారు. వ్యాపారుల సహకారంతో కార్డుదారుల వివరాలు తెలుసుకొని, వాటి ద్వారా తమ ఖాతాల్లోకి మళ్లిస్తారు. క్రెడిట్‌కార్డు వివరాలతో ఈ-కామర్స్ వెబ్‌సైట్ల నుంచి ఖరీదైన సెల్‌ఫోన్లను కొనుగోలు చేస్తున్నారు. వాటిని తక్కువ ధరకు విక్రయిస్తారు. ప్రయాణాలు, రద్దీప్రాంతాలు, రద్దీ ప్రాంతాల్లో మాయమైన సెల్‌ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు తెలివిగా సొమ్ము చేసుకుంటారు. బాధితులు ఫోన్ చేసినప్పుడు తాము దూరంగా ఉన్నామని, చిరునామా చెబితే ఇచ్చి వెళతామని మభ్యపెడతారు. సిమ్‌కార్డును మరోఫోన్‌లోకి మార్చి, యూపీఐ, డెబిట్, క్రెడిట్‌కార్డుల కొత్త ఐడీ తయారు చేసి, పాస్‌వర్డ్, పిన్ నంబర్లు మార్చి సొమ్ము చేసుకుంటారు. ఫోన్ పోయిందనే బాధ, దొరికినవాళ్లు తిరిగి ఇస్తామని చెప్పడంతో సిమ్‌కార్డు బ్లాక్ వాయిదా వేయడమే మోసగాళ్లకు అవకాశంగా మారుతోంది.

# వాట్సప్ బాట్‌లో

# ప్రీమియం చెల్లింపు : ఎల్ఐసీ


**హైదరాబాద్:** పాలసీదారులు సులభంగా ప్రీమియం చెల్లించేందుకు వీలుగా సరికొత్త సదుపాయాన్ని తీసుకొచ్చినట్లు లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) తెలిపింది. ఇందుకోసం ప్రత్యేకంగా వాట్సప్ నంబరు 8976862090 కేటాయించినట్లు పేర్కొంది. ఎల్ఐసీ పోర్టల్‌లో నమోదు చేసుకున్న పాలసీదారులు, ఈ నంబరుకు సందేశం పంపించడం ద్వారా తమ పాలసీలకు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలు తెలుసుకునేందుకు వీలవుతుంది. నేరుగా యూపీఐ, నెట్ బ్యాంకింగ్, కార్డుల ద్వారా వాట్సప్ బాట్‌లోనే చెల్లింపులు పూర్తి చేయొచ్చు. పాలసీలకు చెల్లించాల్సిన ప్రీమియం నుంచి, చెల్లించిన తర్వాత రశీదు కూడా ఈ వాట్సప్ బాట్‌లోనే లభిస్తుందని ఎల్ఐసీ సీఈఓ, ఎండీ సిద్ధార్థ మొహంతి తెలిపారు. పాలసీదారులు ఎక్కడినుంచైనా, ఎప్పుడైనా ప్రీమియం చెల్లించేందుకు ఇది సౌకర్యంగా ఉంటుదన్నారు. దాదాపు 2.2 కోట్ల మంది ఎల్ఐసీ పోర్టల్‌లో నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్ సేవల కోసం రోజుకు 3 లక్షల మందికి పైగా పాలసీదారులు పోర్టల్‌ను సందర్శిస్తుంటారని తెలిపారు. ఎల్ఐసీ కేటాయించిన వాట్సప్ నంబరుకు 'హాయ్' అని సందేశం పంపించాలి. ఆ తర్వాత తెరపై పలు రకాల ఆప్షన్లు కనిపిస్తాయి. ఇందులో మీకు కావాల్సింది ఎంపిక చేసుకుని, తదుపరి సూచనల ప్రకారం కొనసాగొచ్చు.

LIC
भारतीय जीवन बीमा निगम
LIFE INSURANCE CORPORATION OF INDIA

## ఆ ప్రాంతాల్లో ఐటీ ఉద్యోగులకు

# ఇంటి నుంచి పని

**ఢిల్లీ:** భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు తీవ్రమైన నేపథ్యంలో.. ఛండీగఢ్, గురుగ్రామ్, నోయిడా, ఢిల్లీ, జయపుర్, అహ్మదాబాద్ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న తమ ఐటీ సిబ్బంది, ఇంటి నుంచే పని (డబ్ల్యూఎఫ్‌హెచ్) చేసేందుకు పలు కంపెనీలు అనుమతులు ఇచ్చాయి. హెచ్‌సీఎల్ టెక్, ఈవై, కేపీఎంజీ, డెలాయిట్ వంటి కంపెనీలు ఈ అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. సమీప కాలంలో కార్యాలయ విధుల నిమిత్తం దేశ, విదేశీ గమ్యాలకు వెళ్లడంపైనా ఆంక్షలు విధించినట్లు తెలిసింది. 'ఇంటి నుంచి పని'కి ఇచ్చిన అనుమతులు శుక్రవారానికి వర్తిస్తాయని, సోమవారం నుంచి తమ ఉద్యోగులు ఏం చేయాలనే అంశాన్ని ఆదివారం ప్రకటిస్తామని హెచ్‌సీఎల్ టెక్, ఈవై తెలిపాయి. అత్యవసరం కాని దేశ, విదేశీ ప్రయాణాలు విరమించుకోవాలని తమ సిబ్బందికి అకౌంటింగ్-టెక్ కన్సల్టింగ్ సంస్థ డెలాయిట్ ఇండియా సూచించింది. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలపై సామాజిక మాధ్యమాల్లో కామెంట్లు చేయొద్దనీ, కస్టమర్లతో సంభాషణల్లోనూ ప్రస్తావించొద్దని తమ ఉద్యోగులను టెక్‌మహీంద్రా కోరింది.



ఇల్లు లేదా కార్యాలయం నుంచి పనిచేసుకునే వీలు కల్పిస్తున్నట్లు కేపీఎంజీ ఇండియా తెలిపింది. ఇందుకోసం బిజినెస్ మేనేజర్లను సంప్రదించాలని కోరింది.

# అప్పుడు నేనెంతో బాధపడ్డా..

## ఫెయిల్యూర్‌ని అనుకున్నా: సమంత



'శుభం'తో నిర్మాతగా తొలి అడుగు వేశారు నటి సమంత. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. తన కెరీర్ గురించి పలు ఆసక్తికర విషయాలు బయటపెట్టారు. త్వరలోనే తాను 'మా ఇంటి బంగారం' సెట్‌లోకి అడుగుపెడతానని చెప్పారు. యాక్టింగ్ నుంచి కొంతకాలం బ్రేక్ తీసుకొని.. తిరిగి సెట్‌లోకి అడుగుపెట్టినప్పుడు ఎంతో కంగారుపడ్డానన్నారు. జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న తరుణంలో 'ఊ అంటావా' పాట ఆఫర్ వచ్చిందని దానిని తానొక సవాలుగా స్వీకరించానని తెలిపారు. తన తండ్రి మరణించిన రోజును గుర్తుచేసుకున్నారు.

**అప్పుడెంతో బాధపడ్డా..!**


"కెరీర్ ఆరంభంలోనే సక్సెస్ చూశా. వరుస సినిమాలు విజయాలు అందుకున్నాయి. దాంతో అందరూ నన్ను గోల్డెన్ లెగ్ ఆఫ్ తెలుగు సినిమా అని పిలిచేవారు. పోటీలో భాగమైపోయా. కానీ ఫెయిల్యూర్స్ వల్లే ఎన్నో విషయాలు నేర్చుకున్నా. నా సినిమా తొలిసారి ఫ్లాప్ అయినప్పుడు కుమిలిపోయా. నేనొక ఫెయిల్యూర్‌ని అనుకున్నా. ఇన్నేళ్ల కెరీర్ తర్వాత సక్సెస్ అంటే నా దృష్టిలో నిర్వచనం మారింది. స్వేచ్ఛగా జీవించడమే విజయం అని అర్థమైంది. ఇప్పుడు నేను సక్సెస్‌లో లేనని చాలామంది అనుకుంటారు. కానీ, గతంతో పోలిస్తే ఇప్పుడే నేను విజయవంతంగా రాణిస్తున్నా. ప్రతిరోజూ నాకిష్టమైన పనులతో కొత్త విషయాలు నేర్చుకుంటూ ముందుకుసాగుతున్నా" "ఆరోగ్యపరమైన సమస్యల రీత్యా కొంతకాలం వర్క్ నుంచి బ్రేక్ తీసుకున్నా. యాక్టింగ్‌ను ఎంతో మిస్ అయ్యా. యాక్టింగ్ మర్చిపోయానేమో అనిపించింది. 'రక్త్ బ్రహ్మాండ్: ది బ్లడీ కింగ్‌డమ్' షూట్‌లోకి అడుగుపెట్టిన తొలిరోజు అంత సులువుగా అనిపించలేదు. ఒకసారి యాక్టింగ్‌లోకి దిగితే జీవితాంతం అది మనలో భాగం అవుతుందని అప్పుడు అర్థమైంది" "ఊ అంటావా' ఆఫర్ వచ్చినప్పుడు చాలామంది చేయొద్దని చెప్పారు. నన్ను నేను ఎప్పుడూ ఒక హాట్ గర్ల్‌గా అనుకోలేదు. ఆవిధంగా అస్సలు ఊహించుకోలేదు. అలాంటి సమయంలో ఈ పాట ఆఫర్ వచ్చినప్పుడు ఒక సవాలుగా అనుకొని చేశా. సెట్‌లోకి అడుగు పెట్టినప్పుడు కూడా కంగారుపడ్డా. అయినా ధైర్యంగా సాంగ్ పూర్తి చేశా. మళ్లీ భవిష్యత్తులో అలాంటి పాటల్లో యాక్ట్ చేస్తాననుకోవడం లేదు" "అభిమానుల వల్లే ఈ స్థాయికి వచ్చాను. అందుకే వాళ్లు ఎప్పుడైనా ఫొటోలు కోసం అడిగితే నో చెప్పను. మా నాన్న చనిపోయిన రోజు ముంబయిలో ఉన్నా. అమ్మ ఫోన్ చేసి విషయం చెప్పగానే షాకయ్యా. ఆయనతో కొంతకాలంగా మాట్లాడటం లేదు. ఆరోజు ఏం జరుగుతుందో కూడా అర్థం కాలేదు. ఫ్లైట్ జర్నీలో ఉన్నప్పుడు.. ఇంటికి వెళ్లే సమయంలో చాలామంది అభిమానులు నన్ను కలిసి ఫొటోల కోసం రిక్వెస్ట్ చేశారు. నేను వారితో నవ్వుతూనే ఫొటోలు దిగా. వాళ్లను బాధపెట్టడం నాకు ఇష్టం లేదు" అని సమంత వివరించారు.

# నాకు తెలియకుండానే హీరోను చేశారు

## శ్రీకాకుళం షర్లాక్ హోమ్స్ మూవీపై వెన్నెల కిషోర్



తాను హీరో అని తనకే తెలియకుండా ఒక సినిమా చేసినట్లు- వెన్నెల కిషోర్ చెప్పుకొచ్చాడు. అసలు విషయం ఏమిటంటే, వెన్నెల కిషోర్ కీలకపాత్రలో 'శ్రీకాకుళం షర్లాక్ హోమ్స్' అనే సినిమా రూపొందింది. ఈ సినిమాలో హీరో వెన్నెల కిషోర్ అని ముందు నుంచి సినిమా టీం చెబుతూ వచ్చింది. అంతేకాక, వెన్నెల కిషోర్ ప్రమోషన్స్‌కి ఎందుకు రాలేదు అంటే, అది ఆయన్ని అడగాలంటూ కామెంట్ చేయడం హాట్ టాపిక్ అయింది. ఈ విషయం మీద వెన్నెల కిషోర్ స్పందించాడు. నాకు నేను ఈ సినిమాలో హీరో అనే సంగతి తెలియదు. నాకు ముందుగా సినిమా కథ మొత్తం చెప్పలేదు. ఈ మధ్య నేను అలా అడగడం కూడా మానేశాను. ఎందుకంటే కొంతమంది కథ మొత్తం అడిగితే ఫీల్ అవుతున్నారు. కాబట్టి నా వరకు ట్రాక్ చెప్పమన్నాను, చెప్పారు. ఏడు రోజుల డేట్స్ ఇచ్చాను, షూట్ చేశాను. తర్వాత ఇంకొన్ని ఎమోషనల్ సీన్స్ యాడ్ చేయాలన్నారు. వెళ్లి నటించి వచ్చాను. సినిమా రిలీజ్ సమయంలో నేను హీరో అని పోస్టర్ వేస్తే ఆశ్చర్యపోయాను. అసలు నాకే తెలియకుండా నన్ను హీరోగా ఎలా చేశారో అర్థం కాలేదు. నాకు ముందు చెప్పినప్పుడు ఆ సినిమాలో వేరే హీరో ఉన్నాడు, అతనికి జంటగా అనన్య నాగాళ్ల నటిస్తుందని చెప్పారు. కానీ చివరికి నన్ను హీరోగా చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఇది నాకు తెలియకుండా జరిగింది. ముందే నాకు దర్శక నిర్మాతలు నేనే హీరోనని చెప్పి ఉంటే, అప్పుడు నేను ప్రమోషన్స్‌కి కూడా వచ్చి ఉండేవాడినేమో అంటూ ఆయన మాట్లాడారు.




## ప్రదీప్ రంగనాథన్..

# డ్యూడ్ మూవీ

తమిళ సినీ ఇండస్ట్రీలో 'లవ్ టుడే' సినిమాతో నటుడిగా, డైరెక్టర్‌గా సంచలన ఎంట్రీ ఇచ్చిన ప్రదీప్ రంగనాథన్, 'డ్రాగన్' సినిమాతో తన సక్సెస్ జర్నీని కంటిన్యూ చేశాడు. ఈ ద్విభాషా మూవీ తమిళ, తెలుగు ఆడియన్స్‌ను ఫిదా చేస్తూ అతని ఫేమ్‌ను మరో లెవెల్‌కి తీసుకెళ్లింది. బ్యాక్ టు- బ్యాక్ హిట్స్‌తో జోష్‌లో ఉన్న ప్రదీప్, ఇప్పుడు బిగ్ బ్యానర్ మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న పాన్ ఇండియా మూవీలో హీరోగా చేస్తున్నాడు. ఈ సినిమాతో కీర్తిస్వరన్ డైరెక్టర్‌గా డెబ్యూ చేయబోతున్నాడు. 'ప్రేమలు' స్టార్ మమితా బైజు ఈ సినిమాలో హీరోయిన్‌గా కనిపించనుండగా, సీనియర్ యాక్టర్ శరత్ కుమార్ ఓ కీలక రోల్‌లో నటిస్తున్నాడు. మేకర్స్ సినిమా -టైటిల్‌ను ఆఫీషియల్‌గా రివీల్ చేసి, పోస్టర్‌ను లాంచ్ చేశారు. అలాగే, రిలీజ్ డేట్ గురించి కూడా బిగ్ అనౌన్స్‌మెంట్ చేశారు. 'డ్యూడ్' అనే కూల్, యూత్‌ఫుల్ -టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో ప్రదీప్ రంగనాథన్ సీరియస్ అండ్ ఇం-టె-న్స్ లుక్‌లో దర్శనమిచ్చాడు. అతని ఫేస్‌పై గాయాలు, హ్యాండ్‌లో మంగళసూత్రం, గట్స్‌తో నిండిన ఎక్స్‌ప్రెషన్ తో ఈ పోస్టర్ కళ్లు చెదిరేలా ఉంది. -టైటిల్, ఫస్ట్ లుక్ చూస్తే, 'డ్యూడ్' ఒక మోడర్న్ ట్విస్ట్‌తో ఫుల్ ఎంటర్-టైన్‌మెంట్ ప్యాకేజ్‌గా కనిపిస్తోంది. ఈ సినిమా 2025 దీపావళి సీజన్‌లో వరల్డ్‌వైడ్‌గా గ్రాండ్‌గా రిలీజ్ కాబోతోంది. మైత్రి మూవీ మేకర్స్ ఈ ద్విభాషా ప్రాజెక్ట్ కోసం యంగ్ అండ్ టాలెం-టె-డ్ టీ-మ్‌ను రంగంలోకి దింపింది. మ్యూజిక్ డిపార్ట్‌మెంట్‌లో రైజింగ్ స్టార్ సాయి అభ్యంకర్ లీడ్ చేస్తుండగా, సినిమాటోగ్రఫీని నికేత్ బొమ్మి హ్యాండిల్ చేస్తున్నాడు. ప్రొడక్షన్ డిజైన్‌ను లతా నాయుడు, ఎడిటింగ్‌ను బరత్ విక్రమన్ స్టీర్ చేస్తున్నారు, సినిమా విజువల్ వరల్డ్‌ను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లడానికిప్రస్తుతం షూటింగ్ ఫుల్ స్వింగ్‌లో జరుగుతోంది. దీపావళికి ఆడియన్స్‌కు కిక్కిచ్చే ఎంటర్-టైనర్ ఇవ్వడానికి టీ-మ్ ఫుల్ స్పీడ్‌లో వర్క్ చేస్తోంది. 'డ్యూడ్' తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ లాంగ్వేజెస్‌లో రిలీజ్ కానుంది.

# మరోమారు విజయ్, రష్మికల జోడీ



విజయ్ దేవరకొండ ఈ నెలలోనే 'కింగ్డమ్' సినిమాతో సందడి చేయనున్నారు. ఆ తర్వాత ఆయన చేయనున్న సినిమాలు ఇప్పటికే ఖరారైన సంగతి తెలిసిందే. రెండు సినిమాలూ సెట్స్‌పైకి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నాయి. విజయ్ దేవరకొండ పుట్టినరోజుని పురస్కరించుకుని శుక్రవారం ఆయా సినిమాలకి సంబంధించిన పోస్టర్లని విడుదల చేశాయి చిత్రబృందాలు. విజయ్ దేవరకొండ (ఃుశా ఉ।÷ఎ।సశుశ) కథానాయకుడిగా మైత్రీ మూవీ మేకర్స్, టి.సిరీస్ సంస్థలు కలిసి ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, భూషణ్‌కుమార్, క్రిషన్ కుమార్ నిర్మాతలు. ఇందులో విజయ్ సరసన రష్మిక కథానాయిక. బ్రిటిష్‌పాలన కాలం నేపథ్యంలో, 1854 - 1878 మధ్య జరిగిన చారిత్రక సంఘటనల ఆధారంగా ఈ చిత్రం రూపొందుతోంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. విజయ్ ధ్యానముద్రలో ఉన్న లుక్‌ని చిత్రబృందం విడుదల చేసింది. పాన్ ఇండియా స్థాయిలో, ఇప్పటివరకూ ఎవరూ స్పృశించని కథాంశంతో వస్తున్న ఓ శక్తిమంతమైన సినిమా ఇదని చిత్రవర్గాలు తెలిపాయి. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా, రవికిరణ్ కోలా దర్శకత్వంలోనూ ఓ సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు - శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామాగా, పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమా రూపొందుతోంది. త్వరలోనే రెగ్యులర్ చిత్రీకరణ ప్రారంభిస్తున్నట్టు-గా ప్రకటిస్తూ, లుక్‌ని విడుదల చేసింది చిత్రబృందం. భారతీయ సైన్యానికి తన వంతు బాధ్యతగా విరాళాన్ని అందజేయనున్నట్టు- తెలిపారు కథానాయకుడు విజయ్ దేవరకొండ. రానున్న కొన్ని వారాలపాటు- తన క్లాత్ బ్రాండింగ్ రౌడీ వేర్ అమ్మకాలతో వచ్చే లాభాల్లో కొంత వాటాని భారత సైన్యానికి విరాళంగా ఇవ్వనున్నట్టు- ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. మేడ్ ఇన్ ఇండియా మాత్రమే కాదు, మేడ్ ఫర్ ఇండియా కూడా అంటూ తన సామాజిక మాధ్యమాల ద్వారా ఓ పోస్ట్‌ని పంచుకున్నారు విజయ్.

# బాలీవుడ్‌లో ఆపరేషన్ సిందూర్..!

'ఆపరేషన్ సిందూర్' శత్రుదేశం వెన్నులో వణుకుపుట్టిస్తోన్న పేరిది. ప్రతి భారతీయుడు సగర్వంగా చెప్పుకొంటున్న ఈ పేరుతో సినిమా రానుంది. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడికి వ్యతిరేకంగా మన సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' పేరుతో బాలీవుడ్‌లో సినిమాను తెరకెక్కించనున్నారు. దీనిపై అధికారిక ప్రకటన చేసి ఓ పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఉత్తమ్ నితిన్ దర్శకత్వంలో ఈ సినిమా రానుంది. నిక్కీ విక్కీ భగ్నానీ ఫిల్మ్స్ పతాకంపై ఈ చిత్రం తెరకెక్కనుంది. తాజాగా విడుదల చేసిన పోస్టర్‌లో యూనిఫాం ధరించి.. రైఫిల్ పట్టుకొని నుదుటన సిందూరం పెట్టుకుంటోన్న మహిళను చూపారు. అలాగే బ్యాక్‌గ్రౌండ్‌లో ఫైటర్ జెట్‌లను, మండుతున్న యుద్ధ భూమిని చూపారు. ప్రస్తుతం భారత్ - పాక్‌ల మధ్య జరుగుతోన్న ఉద్రిక్తతలను, పహల్గాం సంఘటనను ఈ చిత్రంలో చూపనున్నట్లు- స్పష్టమవుతోంది. త్వరలోనే ఇందులో నటించనున్న నటీ-నటు-ల వివరాలను వెల్లడించనున్నారు. ఉగ్రవాద లోకానికి వణుకు పుట్టించిన 'ఆపరేషన్ సిందూర్' పేరుతో సినిమా తీసేందుకు సినీ దర్శక నిర్మాతలు పోటీ-పడ్డారు. ఈ పేరును ప్రకటించినప్పుడే సుమారు 15 నిర్మాణ సంస్థలు దీనికోసం రిజిస్టర్ చేసుకున్నాయి. ఇండియన్ మోషన్ పిక్చర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్‌లో జీ స్టూడియోస్, టీ--సిరీస్ లాంటి కొన్ని బాలీవుడ్ బడా నిర్మాణసంస్థలు కూడా ఈ పేరు కోసం పోటీ-పడుతూ దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే.






## దశాబ్దాల బాధకు

# ఇది సమాధానం

## యుద్ధంపై జాన్వీకపూర్ పోస్ట్

పాకిస్థాన్-భారత్ యుద్ధ నేపథ్యంలో ఇండియన్ ఆర్మీపై దేశ వ్యాప్తంగా ప్రశంసలు కురుస్తూనే ఉన్నాయి. సామాన్యుడి నుంచి సెలబ్రిటీల దాకా అందరూ ఇండియన్ ఆర్మీకి మద్దతు పలుకుతున్నారు. జాన్వీకపూర్ ఇప్పటికే వరుసగా పోస్టులు పెడుతూ ఇండియన్ ఆర్మీకి మద్దతు ప్రకటిస్తోంది. తాజాగా యుద్ధ వాతావరణం గురించి సుదీర్ఘ పోస్టు పెట్టింది. 'ఇన్ని రోజులు మనం యుద్ధం రావొద్దనే కోరుకున్నాం. కానీ టెర్రరిస్టుల మన ప్రజలను చంపుతుంటే సహించేది లేదు. ఇండియా ఎన్నడూ కయ్యానికి కాలు దువ్వలేదు. ఇన్ని రోజులు మన మీద జరిగిన దాడులను తిప్పి కొడుతున్నాం. కానీ దశాబ్దాల బాధ ఇప్పుడు పెరిగింది. ఆ బాధను తీర్చుకోవడానికే ఇప్పుడు మన ఇండియన్ ఆర్మీ రంగంలోకి దిగింది. ఇది దూకుడు కాదు.. దశాబ్దాల బాధకు సమాధానం. -టె-ర్రరిస్టులు అనే వారు భూమ్మీద ఉండటానికి వీల్లేదు. మన సైనికులు బార్డర్ దగ్గర పోరాడుతూ మనల్ని కాపాడుతున్నారు. మన దేశ సౌభ్రాతృత్వాన్ని కాపాడుతున్న సైనికులకు ఎప్పటికీ రుణపడి ఉండాలి. వాళ్ల వల్లే మనం సేఫ్ గా ఉంటు-న్నాం. ఇలాంటి -టైమ్ లో దేశమంత మన ఇండియన్ ఆర్మీకి మద్దతు నిలవాలి. ఎలాంటి ఫేక్ న్యూస్‌ను వ్యాప్తి చేయొద్దు' అంటూ చెప్పుకొచ్చింది ఈ బ్యూటీ-.



## 'భైరవం'.. రిలీజ్ డేట్ ప్రకటించిన టీమ్

**హైదరాబాద్:** టాలీవుడ్‌లో భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'భైరవం'. మంచు మనోజ్, నారా రోహిత్, బెల్లంకొండ సాయిశ్రీనివాస్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. విజయ్ కనకమేడల దర్శకత్వంలో ఇది రూపొందుతోంది. అదితి శంకర్, దివ్యా పిళ్లై, ఆనంది కథానాయికలు. ఈ సినిమా రిలీజ్‌కు సంబంధించి ఇప్పటికే పలు తేదీలు తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్‌ను టీమ్ అధికారికంగా ప్రకటించింది. మే 30న ప్రపంచ వ్యాప్తంగా దీనిని విడుదల చేయనున్నట్లు చెప్పింది. కొత్త పోస్టర్‌ను అభిమానులతో పంచుకుంది. విభిన్న కథాంశంతో రానున్న ఈ చిత్రానికి శ్రీ చరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. యాక్షన్ డ్రామాగా శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

Edited,Printed, Published and Owned by DHANDYALA RAVI KUMAR, Printed at Gayathri Printers, Plot no: 69 to 75, 4th Line, IDA, Khanapuram, Khammam -507002.Telangana.
EDITOR: DHANDYALA RAVI KUMAR. RNI NO: APTEL/2008/26868. Ph: 9848156178, mail: organ.today@gmail.com , website : www.organnews.in